
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 36

శుక్రవారం 20-10-2023



నాలుగోసారీ ఛేదించేశారు

వన్డే ప్రపంచకప్‌లో భారత్‌కు వరుసగా నాలుగో గెలుపు.. కోహ్లి సెంచరీ -12లో



రెండో రోజూ అమ్మకాలు

అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం.. సెన్సెక్స్ 248 పాయింట్ల నష్టం -13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



హమాస్ రాక్షసత్వం

ఆటిజం బాధితురాలైన 12 ఏళ్ల ఇజ్రాయెల్ బాలిక నోయా డాన్‌ను కిడ్నాప్ చేసిన హమాస్ ఆమెను హత్య చేసింది.

వివరాలు 6లో ▸



ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛ

హమాస్‌పై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇజ్రాయెల్.. గాజాపై చేస్తున్న భీకర దాడుల్లో సాధారణ పాలస్తీనియన్లు బలవుతున్నారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీలో హై స్పీడ్ ప్రయాణం

దేశంలోనే తొలి సెమీ హైస్పీడ్ రీజనల్ రైలు 'నమో భారత్' శనివారం నుంచి ఢిల్లీవాసులకు అందుబాటులోకి రానుంది.

వివరాలు 6లో ▸



విచారణ పూర్తిచేయండి

ఆస్తుల కేసులో సీబీఐ దర్యాప్తును సవాల్ చేస్తూ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

వివరాలు 6లో ▸


కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కౌరవులతో పోరాడుతున్నాం

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రానున్నది కురుక్షేత్ర యుద్ధం.. తోడేళ్లంతా ఏకం అవుతాయి
- ఇది పేదలు - పెత్తందార్ల మధ్య జరుగుతున్న క్లాస్‌వార్
- గజదొంగల ముఠా చెప్పే అబద్ధాలను నమ్మకండి
- 2014లో చంద్రబాబు హామీలు, ఆపై మోసాలను ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి.. ఓటు వేసే ముందు ఒక్కటే ఆలోచించండి
- మీ బిడ్డ వచ్చాక మీ ఇంటికి మంచి జరిగిందా? లేదా?
- గతంలో ఎప్పుడూ జరగని విధంగా అందరికీ మేలు చేస్తున్నాం
- చివరకు కుప్పంలో కూడా 20 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం
- నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ.2.38 లక్షల కోట్లు
- జగనన్న చేదోడుతో నాలుగో ఏడాదీ 3.25 లక్షల మందికి సాయం
- టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు రూ.325.02 కోట్ల లబ్ధి
- నేరుగా ఖాతాల్లోకి సాయాన్ని జమ చేసిన సీఎం



సాక్షి ప్రతినిధి కర్నూలు: 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ప్రతీ అడుగులోనూ వారికి నేనున్నానంటూ భరోసా ఇస్తూ ప్రేమ, బాధ్యత చూపిస్తున్న ప్రభుత్వం మనది. రాబోయేది కురుక్షేత్ర యుద్ధం. పేదవాడు ఓవైపు, పెత్తందారీ మరోవైపు ఉన్నాడు. యుద్ధం జరగబోయేది కులాల మధ్య కాదు.. జరగబోయే యుద్ధం క్లాస్ వార్! కౌరవులంతా ఓవైపు ఉన్నారు. తోడేళ్లంతా ఏకం అవుతాయి. ఆ గజదొంగల ముఠాల్లా మీ బిడ్డకు అర డజను టీవీ ఛానెళ్లు లేవు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, దత్తపుత్రుడి తోడూ ఉండదు. నేను నమ్ముకుంది దేవుడి దయ..

మిగతా 10వ పేజీలో ▶



విశాఖలో విప్రో విస్తరణ

- ప్రాజెక్ట్ లావెండర్ పేరుతో అధికారికంగా ప్రకటించిన సంస్థ
- డేటా సెంటర్‌గా అభివృద్ధికి ప్రణాళికలు.. 1000 సీట్లకు విస్తరించాలని నిర్ణయం
- ప్రభుత్వంతో చర్చలు సఫలం
- వీడీఐ, క్లౌడ్ ప్రాజెక్టుల కేంద్రంగా విశాఖ బ్రాంచ్

- వివరాలు 14లో ▸


'పోలవరం'పై మరో ముందడుగు



- కేంద్ర జల్‌శక్తి శాఖ కమిషనర్ అధ్యక్షతన సవరించిన వ్యయ కమిటీ ఏర్పాటు
- నవంబర్ 2లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం..
- ఇప్పటికే తొలిదశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.38 కోట్లుగా సీడబ్ల్యూసీ ఖరారు
- దీనిని పరిశీలించి ప్రధాని అధ్యక్షతన ఏర్పాటైన ప్రాజెక్టు ఇన్వెస్ట్‌మెంట్ బోర్డుకు పంపనున్న ఆర్‌సీసీ
- పీఐబీ ఆమోదిస్తే సవరించిన అంచనా వ్యయం మేరకు పోలవరానికి నిధులు

- వివరాలు 5లో ▸

చంద్రబాబు రిమాండ్ పొడిగింపు



- నవంబర్ 1 వరకు పొడిగిస్తూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఉత్తర్వులు
- వర్చువల్ విధానంలో న్యాయస్థానం ఎదుట హాజరుపర్చిన జైలు అధికారులు
- తన భద్రతపై సందేహాలు ఉన్నాయని చెప్పిన చంద్రబాబు
- లిఖితపూర్వకంగా తెలపాలన్న న్యాయమూర్తి

- వివరాలు 5లో ▸

అవినీతిపరులకు '17ఏ' రక్షణ కవచం కాదు




- అవినీతి స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు ఆ సెక్షన్ వర్తించదు.. అరెస్టుకు అపాయింటింగ్ అథారిటీ అనుమతి అవసరం లేదు
- సెక్షన్ 17ఏ ముసుగులో అవినీతి కేసుల నుంచి తప్పించుకోలేరు
- ఈ నెల 7న పట్నా హైకోర్టు స్పష్టమైన తీర్పు
- చంద్రబాబుకీ ఇదే వర్తిస్తుందంటున్న న్యాయ నిపుణులు

- వివరాలు 5లో ▸

కంటినిండా కునుకు లేదు

- దేశంలోని 10.4 కోట్ల మంది పెద్దల్లో నిద్ర సంబంధిత రుగ్మత అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా
- శ్రామిక జనాభా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం.. కొందరిలో ప్రాణాంతక వ్యాధులకు కారణం
- 'ఎయిమ్స్' అధ్యయనంలో వెల్లడి
- జీవనశైలిలోనూ మార్పులు చేసుకోవాలంటున్న నిపుణులు
- ఓఎస్‌ఏకు రాష్ట్రంలోని బోధనాస్పత్రుల్లో ఉచిత చికిత్స
- గుంటూరు జీజీహెచ్‌లో స్లీప్ ల్యాబ్.. పాలిసోగ్రఫీ పరీక్షలు



సాక్షి, అమరావతి: మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్ల కారణంగా దేశంలోని 11% మంది నిద్రకు సంబంధించిన రుగ్మత అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియాతో బాధపడుతున్నారు. ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. కొందరిలో ఓఎస్‌ఏ తీవ్రమై మధుమేహం, రక్తపోటు, ఇతర జీవనశైలి జబ్బులతోపాటు ప్రాణాంతకమైన గుండెపోటుకు కారణమవుతోంది. ఈ విషయం ఎయిమ్స్–న్యూఢిల్లీ వైద్యుల అధ్యయనంలో వెల్లడైంది. 8 అధ్యయనాల డేటాను విశ్లేషించి ఆ ఫలితాలను స్లీప్ మెడిసిన్ రివ్యూ జర్నల్‌లో ఇటీవల ప్రచురించారు. దేశంలోని పని చేసే వయస్సు వారిలో సుమారు 10.4 కోట్ల మంది ఓఎస్‌ఏతో బాధపడుతున్నట్టు ఎయిమ్స్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ నంత్ మోహన్ వెల్లడించారు. ఈ సమస్య శ్రామిక జనాభా ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని తెలిపారు. ప్రజలలో నిద్ర రుగ్మతల గురించి తక్షణ అవగాహన పెరగాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు.

మన ఆస్పత్రుల్లో చికిత్స

రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఓఎస్‌ఏ సమస్యకు ఉచితంగా చికిత్స అందిస్తారు. గుంటూరు జీజీహెచ్‌లో స్లీప్ ల్యాబ్ సైతం అందుబాటులో ఉంది. నిద్ర సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న వారికి ఈ ల్యాబ్‌లో పాలిసోగ్రఫీ పరీక్ష నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. రూ.25వేల ఖర్చు అయ్యే పాలిసోగ్రఫీ పరీక్షను ఉచితంగా చేస్తున్నారు.

ఓఎస్‌ఏ సమస్య అంటే

- ➤ ఓఎస్‌ఏ అనేది తీవ్రమైన నిద్ర లేమి సమస్య. ముక్కు నుంచి స్వరపేటిక వరకు ఒక శ్వాసనాళం ఉంటుంది. ఆ నాళం మూసుకుపోయినప్పుడు శరీరంలోకి సరిపడినంత ఆక్సీజన్ అందదు. ఈ సమస్యనే స్లీప్ అప్నియా అంటారు.
- ➤ ఓఎస్‌ఏ సమస్య ఉన్నవారికి నిద్రలో శ్వాస కొద్దిసేపు ఆగిపోతుంది. దీంతో మధ్యలో మెలకువ వస్తుంటుంది. కొన్నిసార్లు శ్వాస తీసుకోవడం ఆగిపోయి పెద్దగా గురక పెడుతుంటారు.
- ➤ సకాలంలో చికిత్స చేయకపోతే ఓఎస్‌ఏతోపాటు మధుమేహం, హైపర్ టెన్షన్, బ్రెయిన్ స్ట్రోక్, కార్డియోమయోపతి, గుండెపోటు, గుండె వైఫల్యం లాంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది.
- ➤ ప్రపంచవ్యాప్తంగా 25 శాతం మంది పురుషులు, 10 శాతం మంది మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారని వైద్య రంగ నిపుణుల అంచనా. మనదేశంలో 11శాతం మంది పెద్దలు ఈ సమస్యతో బాధపడుతున్నారని గుర్తించారు.

ఇవీ ఓఎస్‌ఏ లక్షణాలు



- ➤ రాత్రిపూట నిద్రలో తరచూ మెలకువరావడం, చెమటలు పట్టడం
- ➤ నోరు ఎండిపోయిన అనుభూతి
- ➤ గట్టిగా గురకపెట్టడం
- ➤ తీవ్ర అలసట
- ➤ ఒత్తిడి, అశాంతి, ఆందోళన
- ➤ జ్ఞాపకశక్తి తగ్గిపోవడం
- ➤ మతిమరుపు, చిరాకు



వరుసగా మూడో ఏడాదీ

వైఎస్సార్ అవార్డులు

- ఏడు రంగాల్లో 27 అవార్డులను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, 4 వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు
- క్రీడల్లో కరణం మల్లీశ్వరి, పుల్లెల గోపీచంద్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్
- నవంబర్ 1న అవార్డుల ప్రదానం - వివరాలు 14లో

'ఆయుష్'కు కొత్త కళ

- తొలిదశలో 110 డిస్పెన్సరీల అభివృద్ధి
- 'నాడు–నేడు' ద్వారా రూపురేఖలు మార్చేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆయుష్ డిస్పెన్సరీలు సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. రంగులు వెలిసిపోయి, పాచిపట్టి అధ్వానంగా కనిపించే డిస్పెన్సరీలు కళకళలాడుతున్నాయి. రోగులకు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్ అవసరాల కోసం ముందుగానే మందులు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అల్లోపతి ఆస్పత్రుల రూపురేఖలు మార్చినట్లుగానే ఆయుష్ ఆస్పత్రులను సైతం అన్ని విధాలా అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా తొలి దశలో ఎంపిక చేసిన 110 డిస్పెన్సరీలను ఆధునికీకరిస్తున్నారు. ఒక్కో డిస్పెన్సరీకి రూ.3.5 లక్షలు కేటాయించి భవనాలకు మరమ్మతులు చేసి రంగులు వేస్తున్నారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. సోలార్ ప్యానల్స్‌ను అమర్చి విద్యుత్ ఆదాకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే 95 డిస్పెన్సరీల్లో మరమ్మతులు, రంగులు వేయడం వంటి పనులన్నీ పూర్తయ్యాయి. ఈ ఏడాది మే నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 735 ఆయుష్ డిస్పెన్సరీలకు రూ.3 కోట్లతో ప్రభుత్వం మందులు సరఫరా చేసింది. ఈ మందులు వినియోగంలో ఉండగానే భవిష్యత్‌లో కొరత లేకుండా మరో రూ.12 కోట్ల విలువైన మందులను కొనుగోలు చేస్తోంది. రెండు నెలల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసి డిస్పెన్సరీలకు మందులను సరఫరా చేయనుంది. ఇంగ్లిష్ మందుల తరహాలోనే ఆయుష్ మందులను కూడా ట్యాబ్‌లెట్లు, క్యాప్సుల్స్, సిరప్స్, టానిక్స్ రూపంలో అందజేసేలా కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం 110 డిస్పెన్సరీలను ఆధునికీకరిస్తున్నామని, విడతల వారీగా అన్ని ఆస్పత్రులను అభివృద్ధి చేస్తామని ఆయుష్ కమిషనర్ డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ లగింశెట్టి తెలిపారు.

నాడు


తిరుపతి జిల్లా చెంగనగుంట ఆయుష్ డిస్పెన్సరీ

నేడు





మండల స్థాయిలోనూ 'జగనన్నకు చెబుదాం'తో భరోసా

- ప్రజల వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాలకు వెళ్తున్న కలెక్టర్లు
- ఇప్పటికే 13,365 ప్రజా సమస్యల స్వీకరణ.. 4,517 పరిష్కారం
- మరో 8,777 సమస్యలు పరిష్కార దశలో..

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలాల స్థాయిలోనూ చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. కలెక్టర్లు, జిల్లాల అధికారులు స్వయంగా హాజరై వినతులు స్వీకరించి.. వాటిని పరిష్కరిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో భాగంగానే గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. అలాగే ప్రతి సోమవారం కలెక్టర్లు, అధికారులు కూడా జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ప్రజా సమస్యలను మరింత సంతృప్త స్థాయిలో పరిష్కరించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించింది. 1906 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమస్యలు తెలియజేస్తే.. వాటిని త్వరగా పరిష్కరించేందుకు నాలుగు స్థాయిల్లో ఆడిట్ మెకానిజాన్ని ఏర్పాటు చేసింది. సీఎంవో అధికారులు, శాఖాధిపతులు, కలెక్టరేట్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారాన్ని పర్యవేక్షిస్తోంది. ఈ నేపథ్యంలో గత నెల నుంచి మండల స్థాయిలోనూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి వారం బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు నిర్వహిస్తున్నారు. ఏ రోజు.. ఏ మండల కేంద్రానికి కలెక్టర్లు, అధికారులు వస్తారో ముందే తెలియజేస్తున్నారు. దీంతో ప్రజలు ఆయా మండల కేంద్రాలకు వెళ్లి కలెక్టర్లను కలిసి తమ సమస్యలను చెప్పుకుంటున్నారు. ఇలా వచ్చిన వినతులను అధికారులు అదే రోజు 'జగనన్నకు చెబుదాం' పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రజల నుంచి 13,365 సమస్యలపై వినతులు వచ్చాయి. ఇందులో 4,517 పరిష్కారమవ్వగా.. 8,777 సమస్యలు పరిష్కార దశలో ఉన్నాయి. రీ ఓపెన్‌లో 71 సమస్యలున్నాయి. ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ డా.కె.ఎస్.జవహర్ రెడ్డి ఈ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి.. పురోగతిని తెలుసుకున్నారు. అలాగే అధికారులకు పలు సూచనలు చేశారు.


Greenchef®
మహా మహోత్సవం
700 వాట్స్
1.8 లీటర్లు
5
అదనంగా స్టెయిన్‌లెస్ స్టీల్ కుకింగ్ పాన్
ఉచితం
ప్రత్యేక ధర
₹2,699
(MRP: ₹5,399)
స్టార్క్ రైస్ కుక్కర్
ప్రత్యేక ధర
₹3,099
(MRP: ₹5,298)
6
5
1
1
ఇగ్నైట్ ఇండక్షన్ కాంబో
280MM IB
ప్రత్యేక ధర
₹2,599
(MRP: ₹4,499)
5
2
కాపర్
1000 వాట్స్
600 వాట్స్
థండర్‌బోల్ట్ మిక్సర్ గ్రైండర్ కాంబో
థండర్‌బోల్ట్ మిక్సర్ గ్రైండర్ + ఐరన్ 407
ప్రత్యేక ధర
₹2,399
(MRP: ₹4,698)
5
1.8 లీటర్లు
24
700
ఉచితం
కార్లో ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ కాంబో
ప్రత్యేక ధర
₹1,199
(MRP: ₹2,498)
1
1.5 లీటర్లు
24
700
స్విఫ్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్ కెటిల్ కాంబో
ప్రత్యేక ధర
₹2,699
(MRP: ₹4,499)
2
IS: 4246
CM/L-6248268
జంబో బ్రాస్ బర్నర్
ఆర్బిట్ డబుల్ బర్నర్ గ్లాస్‌టాప్
పటిష్టమైన గ్లాస్
బేక్‌లైట్ నాబ్
జంబో బర్నర్
ప్రత్యేక ధర
₹2,199
(MRP: ₹3,499)
ఉచితం
రీగల్ తవా
280 MM IB
క్లాసిక్ స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ 2-ఇన్-1 కాంబో
3L కుక్కర్ + 2L పాన్
ప్రత్యేక ధర
₹2,799
(MRP: ₹4,899)
ఉచితం
రీగల్ తవా
280 MM IB
క్లాసిక్ స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ కాంబో
5L కుక్కర్ + 3L పాన్ + 1 గ్లాస్ మూత
ప్రత్యేక ధర
₹9,999
(MRP: ₹16,999)
1350 m³/hr
ప్రతి చిమ్నీతో కెటిల్ ఉచితం
బ్లాక్ పెర్ల్ ప్రో 60CM BK చిమ్నీ
మోషన్ సెన్సార్
3-స్పీడ్ టచ్
ఫిల్టర్-లెస్ సాంకేతికత
ప్రత్యేక ధర
₹17,299
(MRP: ₹34,989)
BLDC
DC మోటార్
1550 m³/hr
2
జంబో బ్రాస్ బర్నర్
జైలో 60CM BK చిమ్నీ మరియు బ్లేజ్ డబుల్ బర్నర్ కాంబో
తక్కువ శబ్దంతో కూడిన పనితీరు
పవర్ సేవింగ్
9-స్పీడ్ మోషన్ సెన్సార్
బాఫిల్ ఫిల్టర్
పటిష్టమైన గ్లాస్
ఎనామెల్డ్ పాన్ సపోర్ట్
గ్రీన్‌చెఫ్
మిస్డ్ కాల్ సర్వీస్
+91 7848992244
greenchef.in
Follow us on
BANGALORE CITY DISTRIBUTOR: Mercury Impex: 080-41499222, Rajesh: 7259035100, Balu: 8073243012, Raju Nayak: 9902040499, Roshan: 8123212509, Arjun: 9513985746, Paramesh: 9448536604
FOR TRADE & INSTITUTIONAL ENQUIRY CONTACT: Shyamlal: 9742277106, Abhishek: 8197683550

జగనన్న ఆరోగ్య సురక్ష


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐపోలవరం మండలం మురమళ్లలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న ప్రజలు


ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలం ఆలకూరపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు


పల్నాడు జిల్లా నరగాయపాలెంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



జగనన్న ఆరోగ్య సురక్ష — 15వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు	10,113
వైద్య సేవలు పొందిన ప్రజలు	41,10,889
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,08,71,477
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య	68,520

గగన్‌యాన్‌కు ముందు నింగిలోకి టీవీ-డీ1

రేపు మానవరహిత టెస్ట్ వెహికల్ ప్రయోగానికి షార్ సిద్ధం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టబోయే మానవ సహిత గగన్‌యాన్ ప్రాజెక్టుకు ముందు ఈనెల 21న మానవ రహిత ప్రయోగం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా మొట్టమొదటి క్రూ మాడ్యూల్ సిస్టం (వ్యోమగాముల గది)తో కూడిన గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్ (టీవీ-డీ1)ను శనివారం ఉదయం 7 గంటలకు నింగిలోకి పంపడానికి శాస్త్రవేత్తలు అంతా సిద్ధం చేశారు. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదికనుంచి ప్రయోగించనున్నారు. ఇప్పటికే పలు రకాల భూస్థిర పరీక్షలను నిర్వహించారు. ఇందులోని మోటార్ల పనితీరును నిర్ధారించుకున్నారు. ఎంఎస్‌టీలో టీవీ-డీ1 రాకెట్ అనుసంధానం పనులన్నీ పూర్తి చేశారు. ఈ టీవీ-డీ1 రాకెట్ ద్వారా క్రూ మాడ్యూల్ సిస్టంను భూమికి సుమారు 17 కిలో మీటర్ల దూరంలోని అంతరిక్షంలోకి పంపించి తిరిగి దాన్ని సురక్షితంగా తీసుకురావడమే ఈ ప్రయోగం ఉద్దేశం. రాకెట్ శిఖరభాగంలో అమర్చిన క్రూ మాడ్యూల్ సిస్టంను అంతరిక్షంలో వదిలిపెట్టిన తరువాత దానికి పైభాగంలో అమర్చిన 10 పారాచూట్ల సాయంతో శ్రీహరికోట తీరం నుంచి 10 కిలో మీటర్ల దూరంలో బంగాళాఖాతంలో దించి.. నేవీ సాయంతో ప్రత్యేక బోట్‌లో అక్కడ నుంచి సురక్షితంగా తీసుకువచ్చే ప్రక్రియను చేపడుతున్నారు. భవిష్యత్తులో అంతరిక్షంలోకి వెళ్లిన వ్యోమగాములను తిరిగి క్షేమంగా తీసుకువచ్చే ప్రక్రియను ప్రయోగాత్మకంగా నిర్వహించే ప్రయోగం ఇది అని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ఇటీవల ఓ సమావేశంలో తెలిపారు. గగన్‌యాన్ ప్రయోగం ఇప్పటికే ఒక రూపానికి వచ్చిందని, ఆ ప్రయోగంలో టీవీ-డీ1 మొట్టమొదటి అంకమని ఆయన చెప్పారు.


టీవీ-డీ1 రాకెట్‌కి క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టంను అనుసంధానం చేస్తున్న దృశ్యం

టీవీ-డీ1 ప్రయోగమిలా..

- టీవీ-డీ1 ప్రయోగాన్ని 531.8 సెకన్లకు పూర్తి చేయనున్నారు. 34.954 మీటర్ల పొడవు కలిగిన టీవీ-డీ1 రాకెట్ ప్రయోగ సమయంలో 44 టన్నుల బరువు ఉంటుంది.
- ప్రయోగం ప్రారంభమైన 60.6 సెకన్లకు టెక్నికల్ వెహికల్ నుంచి క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టం విడిపోతుంది.
- 90.6 సెకన్లకు క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టం నుంచి క్రూ మాడ్యూల్ విడిపోతుంది.
- ఆ తరువాత 95.9 సెకన్లకు ఏసీఎస్ పారాచూట్ విచ్చుకుని క్రూమాడ్యూల్‌ను సురక్షితంగా భూమివైపుకు తీసుకొస్తుంది.
- 96.2 సెకన్లకు అపెక్స్ కవర్ విడిపోతుంది. 98.2 సెకన్లకు డ్రోగ్ పారాచూట్ విచ్చుకుంటుంది.
- 296.1 సెకన్ల తరువాత డ్రోగ్ పారాచూట్ విడిపోతుంది.
- 296.3 సెకన్లకు పైలట్ పారాచూట్ విచ్చుకుంటుంది.
- 296.5 సెకన్లకు మెయిన్ పారాచూట్ విచ్చుకుని క్రూమాడ్యూల్‌ను సురక్షితంగా భూమివైపునకు తీసుకొస్తుంది.
- 531.8 సెకన్లకు క్రూమాడ్యూల్ బంగాళాఖాతంలో దిగడంతో టీవీ-డీ1 ప్రయోగం పూర్తవుతుంది.


గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ (టీవీ-డీ1) రాకెట్

వారితో ఇలా అను: "ప్రతి ఒక్కడు తనకు తోచినట్లే పనులు చేస్తాడు, కాని మీ ప్రభువుకు మాత్రం ఎవడు సన్మార్గం పొందేవాడో బాగా తెలుసు".

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 20 అక్టోబర్ 2023

చేతులు కాలకముందే...

ఆగ్రహం ఉండొచ్చు, ఆవేశం ఉండొచ్చు. కానీ సంయమనం మరిచి ఆగ్రహకారకుల్ని నిర్మూలించాలనుకోవటం ఉన్మాదమవుతుంది. చివరికది స్వీయ విధ్వంసానికి దారి తీస్తుంది. ఈ విషయంలో అమెరికాకు చాలా అనుభవం ఉంది. అందుకే కావొచ్చు ఇజ్రాయెల్‌కు సంఘీభావంగా పర్యటించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు ఇచ్చిన సలహా ఎంతో విలువైనది. ఆగ్రహాగ్నిని సకాలంలో చల్లార్చుకోనట్టయితే అది మిమ్మల్నే దహిస్తుందని చెప్పటమే కాదు... ఉగ్రదాడి తర్వాత అమెరికా తీసుకున్న చర్యలు ఎలా పరిణమించాయో గుర్తు చేశారు. ఈనెల 7న హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా వందలమందిని హతమార్చటాన్ని ఎవరూ సమర్థించలేదు. అదే సమయంలో దాడి కారకులపై అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా చర్య తీసుకోవాలని ఇజ్రాయెల్‌ను కోరారు. మిలిటెంట్లు రెచ్చిపోయినప్పుడో, దేశంలో ఎన్నికలు సమీపిస్తున్నప్పుడో ఇజ్రాయెల్ అతిగా వ్యవహరించి పాలస్తీనా పౌరుల ప్రాణాలు తీస్తుండటం దశాబ్దాలుగా రివాజైంది. వెస్ట్‌బ్యాంక్, గాజా, లెబనాన్‌లపై అపాచే హెలికాప్టర్లు, ఎఫ్–16 యుద్ధ విమానాలతో క్షిపణుల వర్షం కురిపిస్తూ ఆసుపత్రులు, స్కూళ్లు, జనావాసాలు నేలమట్టం చేసిన ఉదంతాలు ఎన్నో వున్నాయి. ఇలాంటి సమయాల్లో క్షతగాత్రుల్ని ఆదుకోవటానికీ, ఇతరత్రా సాయం అందించటానికీ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలకు కూడా అనుమతులు లభించవు. ఇప్పుడు జరుగుతున్నదీ అదే. మందులు, ఆహారపదార్థాలు అందించటానికి ఈజిప్టువైపునున్న సరిహద్దుల్లో వందలాది ట్రక్కులు రెండురోజులుగా నిలిచిపోయాయి. మరోపక్క ఇజ్రాయెల్ భీకర దాడులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఒక ఆసుపత్రిపై జరిగిన రాకెట్ దాడిలో 500 మంది చనిపోయారు. ఇప్పటికే దాదాపు అయిదువేల మంది పాలస్తీనా పౌరులు చనిపోగా, పదివేలమంది గాయాలపాలయ్యారు. హమాస్ ప్రయోగించిన రాకెట్ గురి తప్పి ఆసుపత్రిపై పడిందని ఇజ్రాయెల్, అది ఇజ్రాయెల్ దళాల పనేనని హమాస్ అంటున్నాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో బైడెన్ హితవచనం కీలకమైనది. కానీ ఆసుపత్రిపై జరిగిన దాడి విషయంలో ఇజ్రాయెల్‌ను వెనకేసుకు రావటం సరైందేనా? యుద్ధమంటూ మొదలయ్యాక కారకులు ఎవరో వెంటనే గుర్తించలేకపోవటం సర్వసాధారణం. కనీసం ఆ సంగతి తేలేవరకూ కూడా ఆగకుండా ఇజ్రాయెల్ వాదనను సమర్థించటం న్యాయమేనా? వేలాదిమంది క్షతగాత్రులకు వైద్యసాయం నిలువరించి, పదిలక్షల మందిని ఆకలిదప్పుల్లో ఉంచటం సమస్యను చక్కదిద్దగలదని ఆయన విశ్వసిస్తున్నారా? ఈ విషయంలో ఇజ్రాయెల్ తీరును తప్పుబట్టాల్సిన అవసరం లేదా? హమాస్ చెరలో బందీలుగా వున్న 200 మందినీ విడుదల చేసేవరకూ గాజాకు ఏ రకమైన మానవతా సాయం అందనీయబోమని నెతన్యాహూ చేసిన ప్రతిన ఏ నాగరిక ప్రమాణాలతో చూసినా నిరసించదగ్గది. ఇజ్రాయెల్ రక్షణకు కావాల్సిన 'అసాధారణ ప్యాకేజీ' కోసం అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రతిపాదిస్తానని చెబుతున్న బైడెన్‌కు సాధారణ ప్రజానీకం గోడు పట్టిన దాఖలాలు లేవు. 2001లో అమెరికాపై ఉగ్రదాడి తర్వాత తీసుకున్న చర్యలతో తమకు న్యాయం దక్కిందని, ఆ క్రమంలో తప్పులు కూడా జరిగాయని ఆయన అంగీకరించటం మంచిదే. ఆనాడు ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధానికి సెనెటర్‌గా ఆయన కూడా మద్దతునిచ్చారు. అది ఇరాక్ వినాశనానికే కాక, అమెరికా ఆర్థిక పతనానికి సైతం కారణమైంది. ఈ చేదు అనుభవాలను బైడెన్ పరోక్షంగా ప్రస్తావించటంకాక కుండబద్దలు కొట్టినట్టు చెప్పివుంటే బాగుండేది. ఎందుకంటే ఇప్పుడు ఇజ్రాయెల్ అక్షరాలా ఉగ్రరూపం దాల్చింది. గతంలో కేవలం ఒకే ఒక సైనికుడి కోసం వేయిమంది పాలస్తీనా పౌరులను విడిచిపెట్టిన ఆ దేశం... హమాస్ చెరలో 200 మంది ఇజ్రాయెల్ పౌరులుండగా ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నది. అది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో బందీగా ఉన్న యువతి షెమ్ వీడియో తెలియజేస్తోంది. బాంబుల మోతలతో తాము చావుబతుకుల్లో బిక్కుబిక్కుమంటూ వున్నామని, తమను రక్షించటానికి పూనుకోవాలని ఆమె వేడుకుంటోంది. వాస్తవానికి ఇంకా సైన్యం భూతల దాడులకు దిగ లేదు. అది మొదలైతే ఇంకెన్ని వైపరీత్యాలు చూడాల్సి వస్తుందో అనూహ్యం. ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న 6 వేల మంది పాలస్తీనా పౌరుల విడుదల, భూతల దాడుల ప్రయత్నాలకు స్వస్తి హమాస్ డిమాండ్లు.

పాలస్తీనాలో శాంతి స్థాపన ఇజ్రాయెల్, హమాస్‌లకు లేదా పశ్చిమాసియాకు మాత్రమే కాదు... అమెరికాకు కూడా అత్యవసరం. ఇజ్రాయెల్ తన మతిమాలిన చర్యల ద్వారా ఇప్పటికే సంక్షోభాన్ని మరింత పెంచింది. ఇజ్రాయెల్‌కు అండగా ఉన్నట్టు కనబడకపోతే వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో ఇంటిదారి పట్టాల్సివస్తుందని బైడెన్ భయపడుతూ ఉండొచ్చు. కానీ ఆ పని చేస్తే అరబ్ దేశాలతో ఇజ్రాయెల్‌కు పీటముడి వేయాలన్న అమెరికా లక్ష్యం గల్లంతవుతుంది. గాజా ఆసుపత్రిపై మారణకాండ తర్వాత ఆ ఛాయలు కనబడుతూనే వున్నాయి. సౌదీ అరేబియా–ఇజ్రాయెల్ మైత్రికి సంబంధించిన యత్నాలు కొన్ని వారాల క్రితమే ఫలించగా, అవి కాస్తా నిలిచి పోయాయి. ఇరాన్‌తోనూ ఒప్పందం కుదర్చాలని అమెరికా తహతహలాడింది. దానికి కూడా గండి పడింది. బైడెన్‌తో జరగాల్సిన సమావేశాన్ని పాలస్తీనా నాయకుడు మహమ్మద్ అబ్బాస్ రద్దు చేసుకున్నారు. జోర్డాన్, ఈజిప్టు దేశాల్లో బైడెన్ రెండో దశ పర్యటన వాయిదా పడింది. భూతల దాడులు మొదలైతే అరబ్ దేశాల్లో ఊహకందని పరిణామాలు చోటు చేసుకుని, ప్రపంచానికే పెనుముప్పుగా మారుతుంది. దాన్ని నివారించటమే అమెరికాకైనా, మరొక దేశానికైనా అంతిమ లక్ష్యం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు ఆశ్వయుజమాసం, **తిథి:** శు.షష్ఠి రా.9.06 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మూల రా.7.31 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.56 నుండి 7.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.09 నుండి 12.56 వరకు, **అమృతఘడియలు:** ప.1.21 నుండి 2.43 వరకు, సరస్వతీ పూజ.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ద్రవ్యోల్బణం మార్కెట్‌కా, మందికా?

విశ్లేషణ



డి. పాపారావు

ఒకప్పుడు ఉపాధి కల్పనకు పునాదులుగా ఉండే వ్యవసాయ, పారిశ్రామిక సరుకు ఉత్పత్తి, సేవారంగాలు ఆర్థిక వ్యవస్థలో పైచేయిలో ఉండేవి. కానీ 1980ల అనంతరం, ఈ రంగాలకు కేవలం పెట్టుబడిని సరఫరా చేసే ఫైనాన్స్ రంగానిది పైచేయి అయింది. అంటే, కుక్కను తోక ఊపసాగింది. దీంతో ఎటువంటి ఉత్పత్తి లేకుండా డబ్బును మరింత డబ్బుగా మార్చే రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ల హవా పెరిగింది. ఈ నేపథ్యంలో, షేర్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువను కాపాడేందుకు ద్రవ్యోల్బణం అదుపు తప్పనిసరి అయింది. పూర్తి స్థాయి ఉపాధి కల్పన, ప్రజల కొనుగోలు శక్తి పెంపుదలలు కూడా ఈ ఫైనాన్స్ పెట్టుబడులకూ, మార్కెట్లకూ పొసగనిదిగా మారింది.

కొద్ది రోజుల క్రితం, అమెరికాలో నెలవారీ ఉపాధి కల్పన గణాంకాలు ఊహించిన దాని కంటే మెరుగైనవిగా వెలువడ్డాయి. కానీ ఈ వార్త అమెరికా షేర్ మార్కెట్ సూచీలలో పతనానికి కారణమైంది. నిజానికి, మార్కెట్ విశ్లేషకులు చెప్పే ఫండమెంటల్స్ బాగుంటే, అది షేర్ మార్కెట్ సూచీలలో పెరుగుదలకు కారణం కావాలి. పైన జరిగింది దీనికి పూర్తిగా విరుద్ధమైనది. ఇక్కడ ఉపాధి కల్పన గణాంకాలు మెరుగ్గా ఉన్నాయి. అంటే, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్, ప్రజల కొనుగోలు శక్తి బాగున్నాయన్నమాట. ఇదే, వాస్తవంలో ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మౌలిక అంశాలు లేదా ఫండమెంటల్స్ బాగుండటం అంటే. ఇది, స్థూల ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశం. ఈ స్థూల ఆర్థిక వ్యవస్థ బాగున్నదంటే దానిలో అంతర్భాగమైన వివిధ రంగాలకు చెందిన సంస్థలూ, పరిశ్రమలూ, ఇతరత్రా వ్యాపారాల ఫండమెంటల్స్ కూడా బాగున్నట్లే. మరి అటువంటప్పుడు అమెరికా షేర్‌మార్కెట్లు ఎందుకు పతనం అయినట్లు?

ఇక్కడ గమనించవలసింది 1980ల అనంతరం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మౌలికంగా జరిగిన మార్పులను. ఈ మార్పులు, మనం పైన చెప్పుకున్న ఫండమెంటల్స్‌కు భిన్నమైన వాతావరణాన్ని తెచ్చిపెట్టాయి. ఉపాధి కల్పనకు పునాదులుగా ఉండే వ్యవసాయ, పారిశ్రామిక సరుకు ఉత్పత్తి, సేవారంగాల (నిజ ఆర్థిక వ్యవస్థగా పిలవబడేవి) కంటే... అటువంటి రంగాలకు కేవలం పెట్టుబడిని సరఫరా చేసే ఫైనాన్స్ రంగానిది పైచేయి అయింది. నిజ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్స్ ఆర్థిక వ్యవస్థల మధ్య ఈ విధంగా సమతూకం మారింది. అంటే, కుక్కను తోక ఊపసాగింది.

ఈ క్రమంలోనే, ఎటువంటి ఉత్పత్తి లేకుండానే కేవలం డబ్బును మరింత డబ్బుగా మార్చివేసే రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ల వంటి సట్టా వ్యాపార రంగాలది పైచేయి అయ్యింది. ఇటువంటి పరిస్థితిలో, షేర్ మార్కెట్‌కు సంబంధించి కూడా ఫండమెంటల్స్ ఏవి అన్నది పూర్తిగా మారిపోయింది. ఈ కారణం చేతనే అమెరికాలో అంచనా కంటే మెరుగ్గా ఉన్న ఉపాధి గణాంకాలు మార్కెట్ల పతనానికి కారణం అయ్యాయి. అయితే, ఈ సరికొత్త ఫైనాన్స్ రంగ ఫండమెంటల్స్ తాలూకు ఏ పనితీరు ఈ మార్కెట్ల పతనానికి దారితీసింది అన్నది ఇక్కడి ప్రశ్న.

షేర్ మార్కెట్ల వంటి ఈ ఫైనాన్స్ రంగాలలో, మదుపుదారులు పెట్టిన పెట్టుబడి విలువను కాపాడుకోవడం అనేది ప్రధాన అంశంగా ఉంటుంది. ఒక వ్యక్తి లేదా సంస్థ షేర్ మార్కెట్లలో కొంత మొత్తాన్ని పెట్టుబడులుగా పెట్టినప్పుడు, అది దాని నుంచి లాభాలను ఆశిస్తుంది. లాభాల సంగతి కాసేపు పక్కన పెట్టినా, కనీసం తను పెట్టిన పెట్టుబడి తాలూకు విలువను కాపాడుకోవాలని కోరుకుంటుంది. దీనికోసం మార్కెట్లో పెట్టుబడిగా పెట్టిన కరెన్సీ విలువ స్థిరంగా



ఉండాలి. అది తీవ్ర ఒడుదుడుకులకు లోనవ్వడం లేదా క్షీణించడం జరగకూడదు. ఇది, షేర్‌మార్కెట్ల పెట్టుబడుల తాలూకు ప్రధాన అవసరం.

మరి ఇక్కడ కరెన్సీల విలువల పతనానికి కారణంగా లేదా దాని వ్యక్తీకరణగా ద్రవ్యోల్బణం అనేది ఉంటుంది. ఒక కరెన్సీ విలువ తగ్గినప్పుడే, దాని కొనుగోలు శక్తి తగ్గుతుంది. కరెన్సీ తాలూకు ఈ కొనుగోలు శక్తి తగ్గుదలనే ద్రవ్యోల్బణం అంటాం. ఈ నేపథ్యంలోనే, షేర్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువను కాపాడేందుకుగానూ ద్రవ్యోల్బణం అదుపు తప్పనిసరి అవసరంగా మారింది. ఫలితంగానే, ఫైనాన్స్ పెట్టుబడుల ఆధిపత్యం పెరిగిన 1980ల అనంతరం, అంటే సుమారుగా 1990ల నుంచీ ప్రపంచంలోని దరిదాపు అన్ని దేశాల కేంద్ర బ్యాంకులూ ద్రవ్యోల్బణం అదుపును తమ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నాయి. ఉదాహరణకు మన రిజర్వ్ బ్యాంకుకు ఈ ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యం, రెండు శాతం అటూ ఇటుగా నాలుగు శాతంగా నిర్ణయించబడింది. అంటే, మన దేశీయ రిజర్వ్ బ్యాంక్, దేశంలో ద్రవ్యోల్బణాన్ని 26 శాతం నడుమన నియంత్రించి ఉంచాలి. అలా అయితేనే భారత షేర్ మార్కెట్లలోకి వచ్చే పెట్టుబడుల విలువకు కాస్త భరోసా ఉంటుంది.

ఇక్కడ మరో ఉదాహరణగా అమెరికా నుంచి భారతదేశ షేర్ మార్కెట్లలోకి ఒక అంతర్జాతీయ ఫైనాన్స్ సంస్థ డాలర్లను పెట్టుబడిగా తెచ్చింది అనుకుందాం. ఆ సంస్థ డాలర్లను నేరుగా పెట్టుబడిగా పెట్టలేదు. దానికోసం కరెన్సీని రూపాయలలోకి మార్చుకుంటుంది. ఇక, ఆ సంస్థకు కీలక ప్రాధాన్యత గల అంశంగా రూపాయి విలువ కాపాడబడటం అనేది ఉంటుంది. ఆ విదేశీ మదుపు సంస్థ, తన షేర్ మార్కెట్ పెట్టుబడులను అమ్ముకుని దేశం నుంచి మరోచోటకి వెళ్ళిపోయే నాటికి రూపాయి విలువ గణనీయంగా తగ్గిపోయి ఉంటే అది పెట్టుబడి + లాభాల విలువ తగ్గుదలకు కారణం అవుతుంది. మార్కెట్‌లో తన పెట్టుబడులను అమ్మివేసినప్పుడు ఆ మదుపుదారుడికి రూపాయల్లో డబ్బు వస్తుంది. తిరిగివెళ్ళిపోయే క్రమంలో రూపాయలను వేరే దేశంలోకి తీసుకుని వెళ్ళలేడు గనుక తిరిగి ఆ మదుపుదారుడు తనకు లభించిన రూపాయలను డాలర్లుగా మార్చుకుంటాడు. ఇక్కడ అతను పెట్టుబడి పెట్టినాటికీ, వాటిని అమ్ముకుని వెనక్కు వెళ్ళేనాటికీ మధ్యన రూపాయి విలువ తగ్గితే, అతనికి ఈ రూపాయలను తిరిగి డాలర్లుగా మార్చుకుంటే, లభించే డాలర్ల మొత్తం కూడా తక్కువగానే వుంటుంది. ఈ మొత్తం పరిస్థితిని మదింపు చేసుకోవడం కోసమే మన దేశంలోకి లేదా ఇతరేతర దేశాలలోకి కూడా పెట్టుబడులను తీసుకువెళ్ళే మదుపుదారులు వాటిపై లభించే లాభాలను అటు, ఆ దేశం తాలూకు కరెన్సీలతో పాటుగా, మరొక కొలబద్ద అయిన డాలెక్స్ (డాలర్లలో లభించిన లాభం) రూపంలో కూడా లెక్కించుకుంటారు. అదీ కథ!

కాబట్టి, నేటి ఫైనాన్స్ యుగంలో ఫండమెంటల్స్ అనేవాటి అర్థం మారిపోయింది. నేడు ఫండమెంటల్స్‌గా పరిగణించబడుతున్నవి ప్రధానంగా ఫైనాన్స్ పెట్టుబడుల కొలబద్ద అయిన ద్రవ్యోల్బణం సూచీలు. ఈ కారణం చేతనే, అమెరికాలో ఉపాధి కల్పన బాగా జరిగిన క్రమంలో షేర్ మార్కెట్లు దిగజారాయి. ఇక్కడ, మరో చిన్న విషయం... ఈ మార్కెట్లు ఆ రోజు మధ్యాహ్నానికి తిరిగి కాస్త కోలుకున్నాయి. దీనికి కారణం, ఈ మెరుగైన ఉపాధి గణాంకం అనేది, వేతనాల పెరుగుదల రూపంలో పెద్దగా ప్రభావం చూపలేదు. అంటే, ఉపాధి మెరుగ్గానే కనబడిందిగానీ... దాని వలన వేతనాల మొత్తం పెరిగిపోయి అది మార్కెట్లో పెరిగిన ప్రజల కొనుగోలు శక్తి లేదా డిమాండ్ రూపంలో ప్రభావం చూపగలిగిందిగా లేదన్నమాట. ఈ వాస్తవాన్ని మధ్యాహ్నానికి గ్రహించిన అమెరికా మార్కెట్ సూచీలు తిరిగి మళ్ళీ పుంజుకున్నాయి. ప్రజల కొనుగోలుశక్తి, లేదా డిమాండ్ పెరగకుంటే మార్కెట్లో ద్రవ్యోల్బణం పెరగదనే సూక్ష్మమే దీనికి కారణం.

1980ల ముందరినాటి కాలం ఫండమెంటల్స్ వేరుగా ఉన్నాయి. అవి, ఒక కంపెనీ తాలూకు బ్యాలెన్స్ షీట్, అలాగే స్థూలంగా నిజ ఆర్థిక వ్యవస్థ తాలూకు బలంపై ఆధారపడి వున్నాయి. కానీ నేడు అది పూర్తిగా నిజంకాదు. ద్రవ్యోల్బణం, దాని కట్టడి అనేవి నేడు మార్కెట్లో ప్రధాన అంశంగా మారింది. కాబట్టి నేడు వివిధ దేశాలలో పూర్తి స్థాయి ఉపాధి కల్పన, ప్రజల కొనుగోలు శక్తి పెంపుదలలు కూడా ఈ ఫైనాన్స్ పెట్టుబడులకూ, మార్కెట్లకూ పొసగనిదిగా మారింది. వినాశకాలే విపరీత బుద్ధి... ఇంతకంటే చెప్పగలిగింది ఏమీ లేదు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆటవికం



ట్యునీషియాలోని ఎల్ హమ్మ సినగాగ్ (యూదుల ప్రార్థనాలయం)కు వందలాది మంది అరబ్బులు నిప్పు పెట్టారు, నాశనం చేశారు. ఎంత కళంకం! ఎలాంటి దారుణ ఆటవిక చర్య!

– గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నాయకుడు

మత విరుద్ధం



ట్యునీషియాలోని సినగాగ్‌కు నిప్పంటించడమనేది భయానకమైన నేరం; ఇది పూర్తిగా ఇస్లామిక్ బోధనలకు విరుద్ధమైన చర్య. ఇది తీవ్రమైన బాధనూ, ఆందోళననూ కలిగిస్తోంది.

– ఎర్కిన్ సినానోవిచ్, ఇస్లాం పండితుడు

శాంతి శాంతి



నేను ఆశావాదిని. ఇన్షాఅల్లాహ్ ఈ యుద్ధం ముగియగానే, ఇషామెల్ పిల్లలు, ఇసాక్ పిల్లలు తమ స్నేహసంబంధాలను పునరుద్ధరించుకొనేలా ఈ ప్రాంతంలో శాంతి నెలకొంటుంది. ముస్లింలు, యూదులు తమ సంబంధాలను పునరుద్ధరించుకునేలా శాంతి నెలకొంటుంది. ప్రపంచంలోనే మన ప్రాంతాన్ని అత్యుత్తమంగా నిలబెట్టేలా శాంతి నెలకొంటుంది.

– లోయే అల్‌షరీఫ్, పీస్ యాక్టివిస్ట్

ఇస్త్రీ తత్వం



బట్టలకు ఇస్త్రీ చేయడం అనేది నాకు ఇష్టమైన ఒక ధ్యానం లాంటిది. నీ చొక్కా పాడుకుంటూ ఉందేమో అన్న సంభావ్యత మన సందిగ్ధతలను పోగొడుతుంది. ముడతల వంకర తీస్తున్నప్పుడల్లా మన జీవితాన్నే సరిచేసుకుంటున్న ఫీలింగ్ వస్తుంది. ఇది నిజంగా జెన్ జోన్‌లోకి వెళ్లడానికి సులువైన మార్గం.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

పూల పండుగ



పోయినేడాది మొదటిసారి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది కాన్సులేట్‌లో ఆతిథ్యం ఇవ్వడానికి సంతోషిస్తున్నాను. ఈ పూల పండగ నాకు నచ్చింది. ఈ అందమైన తెలంగాణ పండుగను జరుపుకోవడానికి కలిసి వచ్చిన అందరికీ ధన్యవాదాలు.

– జెన్నిఫర్ లార్సన్, యూఎస్ కాన్సుల్ జనరల్

పట్టించుకోకు!



ఈ రైట్, లెఫ్ట్ వర్గాల ఎడతెగని ట్రోలింగ్‌ను ఎలా తట్టుకుంటావని చాలామంది నన్ను అడుగుతుంటారు. ఈ ట్విట్టర్ (ఎక్స్)లో మనుగడ సాగించాలంటే– మొదటి రూల్: మేధా, సూక్ష్మ భేదాల చర్చలకు ఇది తగిన వేదిక కాదని గుర్తుంచుకోండి. అవి కావాలంటే ఐఐసీ, ఐహెచ్‌సీ లాంటివాటికి వెళ్లాలి. రెండో రూల్: నిన్ను గానీ, నీ ట్రోల్స్‌ను గానీ మరీ సీరియస్‌గా తీసుకోవద్దు.

– సంజయ్ ఘోష్, న్యాయవాది

ఏమీ మారలేదు!



జాతివివక్ష, వలసవాదం లాంటి అంశాల మీద మనం పనిచేస్తున్నప్పుడు ఒక దశలో... ఇంక చాల్లే, అందరికీ ఇది అర్థమైపోయింది, కచ్చితంగా ప్రపంచం ముందుకెళ్లిపోయింది అనిపిస్తుంది. కానీ మళ్లీ తెలిసొస్తుంది: అసలు ఏమీ జరగలేదని! మళ్లీ అదే రొటీన్, మళ్లీ అదే వివక్ష, మళ్లీ అదే నాగరికపు మాటలు, అవే ద్వంద్వ ప్రమాణాలు.

– ప్రియంవదా గోపాల్, ప్రొఫెసర్

దేశపు జెండాకుండే పొగరున్న కవి!

**''నదులూ కవులూ భూగోళపు రక్తనాళాలు
నదులు ప్రవహిస్తాయి కవితల్లా
పక్షుల కోసం పశువుల కోసం మనుష్యుల కోసం
నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి
కవులు కంటున్న కలలు మనుష్యుల్లో ఫలిస్తాయి''**

ప్రబంధ కవుల పద ప్రౌఢత్వం, భావకవుల లలితమైన ఇంద్రజాలం, అభ్యుదయ కవుల పదును, విప్లవ కవుల నెత్తురు నిండిన భావపరంపర ఇవన్నీ కలిపితే గుంటూరు శేషేంద్ర శర్మ (1927–2007) సాహిత్యం. విశ్వసాహిత్యంపైన గాఢమైన అవగాహన ఉన్న మహాపండితుడు, ఛందో బద్ధమైన పద్యాన్ని ఎంత సుందరంగా చెప్పగలడో వచన కవితనూ అంతే పదునుగా నడపగల మహాకవి శేషేంద్ర. 80 ఏళ్ల జీవించిన శేషేంద్ర 30కి పైగా రచనలు చేశారు. ఆధునిక కవిత్వంలో విలక్షణ ఊహాశాలిత శేషేంద్ర శర్మ ప్రత్యేకత. ఆయన రచన 'నా దేశం – నా ప్రజలు' 2004లో నోబెల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ అయ్యింది. 1994లో 'కాలరేఖ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.



గుంటూరు శేషేంద్ర శర్మ

'ఒక్కొక్క కన్నీటి బిందువులో ఎంతెంత సాగరం దాగి ఉందో' తెలుసుకున్నవాడు కాబట్టే ప్రజల సుఖదుఃఖాలు, కష్టనష్టాలనే వస్తువులుగా, రైతులను, కార్మికులనే నాయకులుగా స్వీకరించి మానవజాతి జీవించి ఉన్నంత కాలం స్మరించుకునే కావ్యాలను లోకానికి బహుకరించి వెళ్లిపోయారు. 'నా దేశం–నా ప్రజలు', 'మండే సూర్యుడు', 'గొరిల్లా', 'అరుస్తున్న ఆడ్మీ', 'సముద్రం నా పేరు', 'నీరై పారిపోయింది', 'ప్రేమలేఖలు', 'శేషజ్యోత్స్న' ఈ ఎనిమిది కావ్యాలను కలిపి 'ఆధునిక మహాభారతం' పేర సంకలనం చేశారు.

'సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు /తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు/పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు/నేనింత పిడికెడు మట్టే కావచ్చు/ కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది' అని శేషేంద్ర రాసిన వాక్యాలు అమ్ముడు పోయిన కవులే ఎక్కువున్న ఈనాటి సంక్షోభ కాలంలో ఒక దిక్సూచిలా పనిచేస్తాయి. 'నీవు కాలేజీ గోడల్లోకి పోతావు. అక్కడ్నుంచి గవర్నమెంటు గోడల్లోకి పోతావు. అక్కడ్నుంచి ఎప్పుడూ ఎవరూ తిరిగిరాని గోడల్లోకి పోతావు. ఇక నీవు బతికిందెప్పుడు' అని ఈ దేశ విద్యార్థుల జీవిత చిత్రాన్ని ఆవిష్కరించారు.

'వ్యవసాయ కూలీల ఆకాశం వర్షాలే కురుస్తుంది. వసంతాలు కురువదు. రైతులారా రాజకీయ వర్షం పడుతోంది. మోసపోయి మీ విత్తనాలు చల్లకండి' అని అవకాశవాద రాజకీయాలు ఆనాడు ఎలా ఉండేవో రైతులకు, కార్మికులకు విప్పిచెప్పారు.

సాహిత్యానికి మూలభూతమైన ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా 'కవిసేన మేనిఫెస్టో' రచించి సంచలనం సృష్టించారాయన. 'కామోత్సవ్' (1987) నవల రాసి ఎంతో వివాదానికి కారకుడయ్యారు. ''శేషేన్ నీది మంచి పద్యమా లేక ఫ్రెంచి మద్యమా.. శ్రీనాథుడి క్రీడల్లో, అల్లసాని వాడల్లో కూడా దొరకని పదచిత్రం'' అని శేషేంద్రకు ఓ కవి ఇచ్చిన కితాబు అక్షరాల నిజం.

– వెల్దండి శ్రీధర్, తెలుగు అధ్యాపకులు । 98669 77741
(నేడు గుంటూరు శేషేంద్ర శర్మ జయంతి)

పేదరికం తగ్గుతోంది!

అభిప్రాయం



డా॥ పృథ్వీకర్ రెడ్డి

దేశంలో గత ఐదేళ్లలో రెండేళ్లు కరోనా మహమ్మారి ఇబ్బందిపెట్టినా పేదరికం తగ్గుముఖం పట్టడం శుభపరిణామం. మన రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధోరణి కనిపించడం ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ, విద్యా, వైద్య పథకాల ఫలితమేనని చెప్పవచ్చు.

నీతి ఆయోగ్ నివేదిక –2023 ను పరిశీలించినప్పుడు దేశంలో పేదరికం పరిస్థితి ఇటీవలి సంవత్సరాల్లో (2015–16, 2019–21) ఎలా ఉందో స్పష్టమవుతోంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)... సామాజిక–ఆర్థిక, సామాజిక శ్రేయస్సు కొరకు 'ఎవరినీ వదిలిపెట్టకూడదు' అనే దృష్టితో నిర్దేశించబడ్డాయి. అంటే ఆదాయంతో ముడిపడిన పేదరికమే కాకుండా, మిగతా అన్ని వసతులనూ పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని అంచనా వేసి దాని నిర్మూలించడం కూడా ఒక లక్ష్యమన్నమాట. అనేక కోణాలను పరిగణన లోకి తీసుకుని పేదరికాన్ని అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, అవసరమైన వసతులు... అంటే నీరు, పారిశుద్ధ్యం, పోషకాహారం, శిశు, ప్రసూతి మరణాలు, పాఠశాల హాజరు, ఇతర ప్రాథమిక గృహ సౌకర్యాలు పొందడం వంటి వాటినన్నిటినీ పేదరికాన్ని నిర్వచించడంలో పరిగణించాలి. ఇటువంటి పేదరిక అంచనా కోసం నిర్దేశించిన 12 సూచికలలో పదింటిని, ప్రపంచ స్థాయిలో పేదరికాన్ని అంచనా వేయడానికి చేర్చినవి కాగా మిగిలిన రెండు సూచికలు: ప్రసూతి ఆరోగ్యం, బ్యాంక్ ఖాతాలు దేశంలో పేదరికాన్ని అంచనావేయడానికి అదనంగా చేర్చబడ్డాయి. ఇటువంటి అనేక కోణాల ఆధారంగా నిర్ధారించిన పేదరికం (ఎంపీఐ) జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఎలా ఉందో నీతి ఆయోగ్ తాజా నివేదిక తెలియజేస్తోంది.

దేశ స్థాయిలో పేదరికం బాగా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది. 2015–16లో మన జనాభాలో 25 శాతం పేదలు ఉండగా, 2019–21 నాటికి 15 శాతానికి పేదరికం తగ్గింది. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని వేసిన అంచనా దేశంలో 13.5 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారని సూచిస్తోంది. సుస్థిర అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలు 2030 కంటే ముందుగానే,



భారతదేశం సాధించవచ్చని ఇది చెబుతోంది. మొత్తం 12 సూచికలు అభివృద్ధిని చూపించాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేగంగా తగ్గుముఖం పట్టింది. పట్టణ ప్రాంతాలకు వచ్చేటప్పటికి 8.65 శాతం నుండి 5.27 శాతానికి పేదరికం తగ్గింది. 28 రాష్ట్రాలలో, పది రాష్ట్రాలు 2019–21లో దేశ సగటు 14.96 శాతం కంటే ఎక్కువ శాతం పేదరికాన్ని నమోదు చేశాయి. దేశంలో అత్యల్పంగా కేరళలో ఒక శాతం కంటే తక్కువ మంది పేదలుగా ఉన్నారు. మొత్తం ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలలో పేదల శాతం దేశ సగటు కంటే చాలా తక్కువగా ఉంది.

2019–21లో దేశ సగటు పేదరిక స్థాయి కంటే, తెలుగు రాష్ట్రాల్లో, పైన చెప్పిన విధంగా అంచనా వేసిన పేదల శాతం చాలా తక్కువగా ఉంది. ఇది 2015–16 లో తెలుగు రాష్ట్రాలలో దాదాపు 12 నుండి 13 శాతం ఉండగా, 2019–21 నాటికి రెండు తెలుగు రాష్ట్రాలలో 6 శాతానికి తగ్గింది. పేదరిక అంచనాలో ఉపయోగించిన సూచికలలో, పిల్లల–కౌమార మరణాలు, పాఠశాలలో గడిపిన సంవత్సరాలు, పాఠశాల హాజరు, విద్యుత్ సౌకర్యం, ఆస్తులు కలిగి ఉండటం వంటివి రెండు తెలుగు రాష్ట్రాలలో సమాన శాతంలో ఉన్నాయి.

2023 ఏడాదిలో విడుదల అయిన నీతి ఆయోగ్ నివేదిక, కరోనా వైరస్ కారణంగా ఆర్థికంగా, సామాజికంగా అతలాకుతలం అయిన కాలాన్ని అనగా 2019–21ను ప్రతిబింబిస్తోంది. పేదరిక నిర్మూలనను దృష్టిలో ఉంచుకొని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన అనేక కార్యక్రమాలు బహుసూచికలతో పొందు పరచిన పేదరిక శాతాన్ని తగ్గించడంలో బాగా సహాయపడ్డాయి.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో 'వైఎస్ఆర్ అమ్మ ఒడి', 'వైఎస్ఆర్ జగనన్న విద్యా దీవెన', 'వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా', 'జగనన్న ఆరోగ్య సురక్ష', గృహనిర్మాణ పథకం; తెలంగాణలో 'ఆరోగ్య లక్ష్మి', గృహనిర్మాణ పథకం, 'కేసీఆర్ కిట్' 'మిషన్ భగీరథ' పథకాలు పేదరిక శాతాన్ని గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయి. అదనంగా, రెండు రాష్ట్రాలలో, ఆరోగ్య మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయడం కూడా పాఠశాల హాజరు, తల్లీ పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి దోహదపడుతున్నాయి. ఈ పథకాల పూర్తి ప్రభావం తదుపరి నీతి ఆయోగ్ నివేదికలో ఎక్కువగా ప్రస్ఫుటం గావచ్చు. ఈ పథకాల ప్రభావంతో, తెలుగు రాష్ట్రాలలో, పేదరిక నిర్మూలన గణనీయంగా తగ్గవచ్చు.

వ్యాసకర్త ఆర్థిక అంశాల నిపుణుడు
ఈ–మెయిల్: prudhvikar@cess.ac.in

మధ్యంతర బెయిల్ కుదరదు

సాక్షి, అమరావతి : స్కిల్ స్కాంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు రాష్ట్ర హైకోర్టు మరోసారి ఝలక్ ఇచ్చింది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు కుదరదని తేల్చిచెప్పింది. అలాగే, ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని.. ఈ వ్యాజ్యం తేలేలోపు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన ప్రధాన పిటిషన్, అనుబంధ పిటిషన్ల తదుపరి విచారణను వాయిదా వేసింది. మరోవైపు.. ఈ విషయంలో చంద్రబాబు దాఖలు చేసిన వ్యాజ్యాలను దసరా సెలవుల్లో అత్యవసర కేసుల విచారణకు ఏర్పాటయ్యే వెకేషన్ కోర్టు ముందుంచుతూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు చేసిన అభ్యర్థన మేరకు హైకోర్టు ఈ మేర ఉత్తర్వులిచ్చింది. నిజానికి.. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో మరో న్యాయమూర్తి ముందు మధ్యంతర బెయిల్ కోసం వాదనలు వినిపించేందుకు వీలుగా చంద్రబాబు న్యాయవాదులు వెకేషన్ కోర్టు ముందుంచాలన్న అభ్యర్థనను తెరపైకి తెచ్చారు. ఇదే సమయంలో.. చంద్రబాబు కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వారు కోర్టు దృష్టికి తీసుకురావడంతో, చట్ట ప్రకారం ఆయనకు జైలులో తగిన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. అంతేకాక.. తదుపరి విచారణ సమయంలో చంద్రబాబు వైద్య నివేదికలను కోర్టు ముందుంచాలని కూడా జైలు అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అయితే, ఈ బెయిల్ పిటిషన్లు ఎప్పుడు విచారణకు వస్తాయి.. ఏ న్యాయమూర్తి ముందు విచారణకు వస్తాయన్న విషయాలు రెండు మూడ్రోజుల్లో తెలిసే అవకాశముంది.

చంద్రబాబుకు చర్మ సమస్యలున్నాయి..

ఈ సందర్భంగా చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్‌లు వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు ఆరోగ్యస్థితికి సంబంధించిన వైద్య నివేదికలను మెమో రూపంలో కోర్టు ముందుంచామని చెప్పారు. చంద్రబాబుకు కొన్ని వైద్య పరీక్షలు అవసరమని వైద్యులు ఆ నివేదికల్లో పేర్కొన్నారని వివరించారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. సుప్రీం కోర్టు 17ఏపై తీర్పును రిజర్వ్ చేసింది కదా, ఆ తీర్పు ప్రభావం ఈ పిటిషన్లపై ఉంటుంది కదా? అని ప్రశ్నించారు. కొంతమేర ఉంటుందని, అందుకే తాము ప్రధాన బెయిల్ పిటిషన్‌లో వాదనలు వినిపించడంలేదని, మధ్యంతర బెయిల్ కోసం దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యంలో వాదనలు వినిపిస్తున్నామని లూథ్రా, దమ్మాలపాటి చెప్పారు. మధ్యంతర బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. సుప్రీంకోర్టు తీర్పు కోసం వేచిచూడటం మంచిదన్నారు. ఆ తీర్పు ప్రభావం ఈ వ్యాజ్యాలపై ఉన్నప్పుడు, ఆ తీర్పు కోసం వేచిచూడటంలో తప్పులేదన్నారు.

మధ్యంతర బెయిల్‌ను 'సుప్రీం' తోసిపుచ్చింది..

అనంతరం.. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలన్న చంద్రబాబు అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించిందన్నారు. అందువల్ల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదన్నారు. అసలు చట్టంలో ఎక్కడా కూడా మధ్యంతర బెయిల్ ప్రస్తావనే లేదని తెలిపారు. ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకుంటూ.. అదనపు ఏజీ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బెయిల్ పిటిషన్ 19న హైకోర్టులో ఉందని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పడంతో తమ మధ్యంతర బెయిల్ అభ్యర్థనను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం సాధ్యంకాదని తేల్చిచెప్పారు. వైద్య పరీక్షల విషయంలో ఏం చేయాలగమో అది చేస్తామన్నారు. వ్యక్తిగత వైద్యునితో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు అనుమతిచ్చే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. దీనిపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. తామే వైద్య పరీక్షలు చేయించి తామే తిరిగి జైలుకు తీసుకొస్తామన్నారు. వ్యక్తిగత వైద్యునితో వైద్య పరీక్షలకు మీకేం అభ్యంతరమని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీనిపై తాను అధికారులతో మాట్లాడి చెప్పాల్సి ఉంటుందని, అందువల్ల విచారణను కొద్దిసేపు వాయిదా వేయాలని కోర్టును కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను మ. 2.15 గంటలకు వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం విచారణ మొదలు కాగా, చంద్రబాబు న్యాయవాదులు వ్యూహాన్ని మార్చారు. మధ్యంతర బెయిల్ సాధ్యంకాదని హైకోర్టు తేల్చిచెప్పడంతో కొత్త అభ్యర్థనను తెరపైకి తెచ్చారు. మరో న్యాయమూర్తి ముందు మధ్యంతర బెయిల్ కోసం ప్రయత్నాలు చేసుకునేందుకు వీలుగా, తమ బెయిల్, మధ్యంతర బెయిల్ వ్యాజ్యాలను దసరా సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు ఏర్పాటయ్యే వెకేషన్ కోర్టు ముందుంచాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు. దీంతో న్యాయమూర్తి వారి అభ్యర్థనపట్ల సానుకూలంగా స్పందించి ఆ మేర ఉత్తర్వులు జారీచేశారు.

అవినీతిపరులకు '17ఏ' రక్షణ కవచం కాదు

- ఈ నెల 7న పట్నా హైకోర్టు స్పష్టమైన తీర్పు
- ఇదే విధమైన సీబీఐ వాదనలతో ఏకీభవించిన కర్ణాటక హైకోర్టు
- డీకే శివకుమార్‌కు 17ఏ వర్తించదని సీబీఐ స్పష్టమైన వాదనలు
- చంద్రబాబుకీ ఇదే వర్తిస్తుందంటున్న న్యాయ నిపుణులు

> 'అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ అంటే అవినీతి నుంచి కాపాడే రక్షణ కవచం కాదు. అవినీతి కేసుల్లో నిందితులు తప్పించుకునేందుకు సాధనం కాదు. అవినీతికి పాల్పడినవారు ఆ కేసుల నుంచి తప్పించుకొనేందుకు అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి కాదు' – పట్నా హైకోర్టు

> 'సెక్షన్ 17 ఏ అమలులోకి రావడానికి ముందు అంటే 2018 జులై 26కి ముందు వ్యవహారాలకు ఈ చట్టం కింద రక్షణ లభించదు. అంతేకాదు అవినీతికి పాల్పడడం, ఉద్దేశపూర్వకంగా అవినీతి చేయటం అన్నవి ప్రభుత్వ విధుల నిర్వహణ కిందకు రావు'
> – డీకే శివకుమార్ కేసులో కర్ణాటక హైకోర్టులో సీబీఐ వాదనలు. ఈ వాదనలతో కర్ణాటక హైకోర్టు ఏకీభవించింది

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి అరెస్టయిన మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ఏ ను అడ్డం పెట్టుకొని బయటపడాలని చేస్తున్న ప్రయత్నాలు చెల్లవని పట్నా, కర్ణాటక హైకోర్టులు రెండు వేర్వేరు కేసుల్లో ఇచ్చిన తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. సెక్షన్ 17ఏ అవినీతిపరులకు రక్షణ కవచం కాదని ఈ నెల 7న పట్నా హైకోర్టు విస్పష్టమైన తీర్పు ఇచ్చింది. సెక్షన్ 17 ఏ ప్రకారం అపాయింటింగ్ అథారిటీ నుంచి సీబీఐ ముందస్తు అనుమతి తీసుకోలేదంటూ కర్ణాటక హోం మంత్రి డీకే శివకుమార్ చేసిన వాదనను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. సెక్షన్ 17ఏ అమలులోకి రాకముందే శివకుమార్‌పై కేసు నమోదు చేసినందున అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి అవసరంలేదన్న సీబీఐ వాదనలతో కర్ణాటక హైకోర్టు ఏకీభవించింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేయడం, రిమాండ్‌కు పంపడం న్యాయపరంగా సరైనదేనని ఈ తీర్పుల ద్వారా స్పష్టమవుతోందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. చంద్రబాబు వేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.

ఇదీ బిహార్ కేసు

బిహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్ జిల్లాలోని సుగాలి పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కిశోర్ కుమార్ అక్రమంగా మద్య రవాణా చేస్తున్న వారిని విడిచిపెట్టారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన్ని చకియాకు బదిలీ చేశారు. ఆయన చకియాకు బదిలీ అయిన తరువాత సుగాలి పోలీసు స్టేషన్‌లో మూసివేసిన ఓ కేసును మళ్లీ నమోదు చేసి సంబంధిత వ్యక్తుల నుంచి లంచం వసూలు చేశారు. దీంతో ఆ జిల్లా ఎస్పీ ఆయన్ని అరెస్ట్ చేసి, సస్పెండ్ చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ కిశోర్ కుమార్ పట్నా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సెక్షన్ 17ఏ కింద తనను అరెస్టు చేయాలంటే అపాయింటింగ్ అథారిటీ అనుమతి ఉండాలని వాదించారు. పట్నా హైకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. అవినీతి నిరూపితమైనందున ఆయన అరెస్టుకు అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి అవసరం లేదని తేల్చి చెప్పింది. సెక్షన్ 17ఏను అడ్డంపెట్టుకుని అవినీతి కేసుల నుంచి తప్పించుకోలేరని కూడా స్పష్టంగా చెప్పింది.

ఇదీ శివకుమార్ కేసు..

అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ ప్రకారం అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి తీసుకోనందున సీబీఐ తనపై నమోదు చేసిన కేసు చెల్లదని కర్ణాటక హోం మంత్రి డీకే శివకుమార్ హైకోర్టులో వాదనలు వినిపించారు. ఈ వాదనలను సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. సెక్షన్ 17 ఏ అమల్లోకి రావడానికి (2018 జులై 26కి) ముందు 2013 నుంచి 2018 ఏప్రిల్ మధ్య శివకుమార్ అవినీతికి పాల్పడినందున ఆయనకు ఈ సెక్షన్ వర్తించదని తెలిపింది. అవినీతికి పాల్పడడం, ఉద్దేశపూర్వంగా అవినీతి చేయటం ప్రభుత్వ విధుల నిర్వహణ కిందకు రావని కూడా చెప్పింది. సీబీఐ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. శివకుమార్ వినతిని తిరస్కరించింది.

చంద్రబాబుదీ అవే అడ్డగోలు వాదనలు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడిన చంద్రబాబు, టీడీపీ నేతలు కూడా ఇదే అడ్డగోలు వాదన వినిపిస్తున్నారు. సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ ముందస్తు అనుమతి తీసుకోనందున అరెస్ట్ చెల్లదని, కేసు కొట్టివేయాలని వాదిస్తున్నారు. ఈ వాదనను సీఐడీ న్యాయవాదులు సమర్థంగా తిప్పికొట్టారు. అవినీతి వ్యవహారాల నుంచి గంపగుత్తగా రక్షణ కల్పించడం సెక్షన్ 17ఏ ఉద్దేశం కాదని వాదించారు. ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు గానీ ప్రభుత్వ అధికారులుగానీ ఉద్దేశపూర్వకంగా ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడితే వారికి కేసుల నుంచి సెక్షన్ 17ఏ రక్షణ కల్పించదని చెప్పారు. అందువల్ల చంద్రబాబు అరెస్టుకు గవర్నర్ అనుమతి అవసరం లేదని చెప్పారు. సీఐడీ న్యాయవాదుల వాదనలను పట్నా, కర్ణాటక కేసులు బలపరుస్తున్నాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. చంద్రబాబు ఈ సెక్షన్ ద్వారా రక్షణ పొందడానికి ఏ విధంగా అర్హులు కారో వారు విశ్లేషించి మరీ చెబుతున్నారు.

- ▲ కళ్ల ముందు అవినీతి కనిపిస్తున్నప్పుడు సెక్షన్ 17ఏ వర్తించదని పట్నా కోర్టు చెప్పింది. స్కిల్ స్కామ్‌లో కూడా ప్రజాధనం రూ.371 కోట్లు కొల్లగొట్టిన విషయం నిర్ధారణ అయ్యింది. నకిలీ ఇన్వాయిస్‌లతో ప్రభుత్వ ధనాన్ని అక్రమంగా దారిమళ్లించారని కేంద్ర జీఎస్టీ అధికారులు నిగ్గు తేల్చారు. కాబట్టి చంద్రబాబుకు సెక్షన్ 17ఏ కింద రక్షణ పొందలేరన్నది నిర్ధారణ అయ్యింది.
- ▲ ఉద్దేశపూర్వకంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినా సెక్షన్ 17ఏ కింద రక్షణ లభించదని పట్నా హైకోర్టు చెప్పింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు పూర్తి అవగాహనతోనే అవినీతికి పాల్పడ్డారు. ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల అభ్యంతరాలను బేఖాతరు చేశారు. ప్రైవేటు వ్యక్తి గంటా సుబ్బారావుకు నాలుగు కీలక పోస్టులు కట్టబెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేయాలని ఆదేశిస్తూ నోట్ ఫైళ్లపై 13 సంతకాలు చేశారు. కాబట్టి ఈ కేసులో చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తించదన్నది సుస్పష్టం.
- ▲ సెక్షన్ 17ఏ అమలులోకి రావడానికి (2018 జులై 26కి) ముందే 2017 మే నెలలోనే స్కిల్ స్కామ్‌లో కేంద్ర జీఎస్టీ విభాగం కేసు నమోదు చేసింది. ఏపీ ఏసీబీకి 2018 ఫిబ్రవరిలోనే ఆ విషయాన్ని తెలిపింది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసును తొక్కిపెట్టింది. కాబట్టి ఈ కేసులో సెక్షన్ 17 ఏ వర్తించదు అన్నది కర్ణాటకలో డీకే శివకుమార్ కేసు ద్వారా స్పష్టమైంది. స్కిల్ స్కామ్‌లో అప్పటి సీఎం చంద్రబాబుతో పాటు ప్రైవేటు వ్యక్తులు కూడా నిందితులుగా ఉన్నారు. ప్రైవేటు వ్యక్తులతో కలిపి ప్రజాప్రతినిధిపై కేసు పెట్టడం చెల్లదన్న డీకే శివకుమార్ వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.
- ▲ సెక్షన్ 17ఏ ముసుగులో అవినీతి కేసుల నుంచి తప్పించుకోలేరని పట్నా హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రస్తుతం చంద్రబాబు ఈ స్కామ్ నుంచి బయటపడటానికి ఆ కోణంలోనే ప్రయత్నిస్తున్నారు. తాను అవినీతికి పాల్పడలేదని, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరగలేదని ఆయన చెప్పడం లేదు. సెక్షన్ 17ఏ ప్రకారం తనపై సీఐడీ నమోదు చేసిన కేసు చెల్లదని మాత్రమే చెబుతున్నారు. అందువల్ల స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పూర్తిగా అసంబద్ధమని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

'పోలవరం'పై మరో ముందడుగు

తొలిదశ అంచనా వ్యయం రూ.31,625.38 కోట్లుగా సీడబ్ల్యూసీ ఖరారు చేసి పంపిన ప్రతిపాదనను మదింపు చేసేందుకు కమిటీ ఏర్పాటు



సాక్షి, అమరావతి: పోలవరం జాతీయ ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయాన్ని ఆమోదించే ప్రక్రియలో కేంద్రం మరో అడుగు ముందుకేసింది. ఈ వ్యయాన్ని రూ.31,625.38 కోట్లుగా ఖరారు చేస్తూ కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పంపిన ప్రతిపాదనను మదింపు చేసేందుకు ఆర్‌సీసీ (రివైజ్డ్ కాస్ట్ కమిటీ–సవరించిన వ్యయ కమిటీ)ని ఏర్పాటుచేస్తూ గురువారం కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర జల్‌శక్తి శాఖ కమిషనర్ (ఎస్పీఆర్) ఏఎస్ గోయల్ అధ్యక్షతన సీడబ్ల్యూసీ (పీపీఓ) పుష్కర్‌సింగ్ కుతియాల్, కేంద్ర ఆర్థిక శాఖ (వ్యయ విభాగం) ప్రధాన సలహాదారు రిచామిశ్రా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సభ్య కార్యదర్శి రఘురాం సభ్యులుగా ఏర్పాటైన ఆర్‌సీసీకి సీడబ్ల్యూసీ సీఈ (పీఏఓ) యోగేష్ పైతంకర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. సీడబ్ల్యూసీ ఖరారుచేసిన సవరించిన అంచనా వ్యయాన్ని మదింపు చేసి రెండు వారాల్లోగా అంటే నవంబర్ 2లోగా నివేదిక ఇవ్వాలని ఆర్‌సీసీని ఆదేశించారు. ఈ నివేదికను ప్రధాని మోదీ అధ్యక్షతన ఏర్పాటైన ప్రాజెక్టు ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఐబీ)కి కేంద్ర జల్‌శక్తి శాఖ పంపనుంది. పీఐబీ ఆమోదముద్ర వేస్తే సవరించిన అంచనా వ్యయం మేరకు పోలవరం తొలిదశ పనులకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. కమీషన్ల కక్కుర్తితో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2016, సెప్టెంబరు 7 అర్ధరాత్రి 2013–14 ధరల ప్రకారం కేవలం రూ.20,398.61 కోట్లతోనే ప్రాజెక్టును పూర్తిచేస్తానని అప్పటి సీఎం చంద్రబాబు అంగీకరించారు. కానీ, 2013, భూసేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.33,168.23 కోట్లు అవసరం. అలాంటిది.. కేవలం రూ.20,398.61 కోట్లకే ప్రాజెక్టును పూర్తిచేస్తానని చంద్రబాబు అంగీకరించడంలో ఆంతర్యం కమీషన్లు దండుకోవడమే. 2016, సెప్టెంబరు 7 నుంచి 2019, మే 29 వరకూ చంద్రబాబు అదే చేశారు. ఇదే అంశాన్ని ప్రధానికి సీఎం వైఎస్ జగన్ వివరించి.. తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ప్రధాని సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే పోలవరం తొలిదశ సవరించిన వ్యయాన్ని రూ.31,625.38 కోట్లుగా సీడబ్ల్యూసీ ఖరారుచేస్తూ ఈనెల 13న కేంద్ర జల్‌శక్తి శాఖకు ప్రతిపాదన పంపింది. జాతీయ ప్రాజెక్టుల సవరించిన అంచనా వ్యయాన్ని మదింపు చేసి, పీఐబీకి నివేదిక ఇచ్చేందుకు ఆర్థిక శాఖ, సంబంధిత ప్రాజెక్టును ప్రతిపాదించే శాఖ అధికారులతో ఆర్‌సీసీని ఏర్పాటుచేయాలని 2016, సెప్టెంబరు 5న కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆర్‌సీసీ ఇచ్చే నివేదికే అత్యంత కీలకం. దీనిని యథాతథంగా పీఐబీ ఆమోదించనుంది.

తొలిదశ పూర్తికాగానే రెండో దశ..

పోలవరం ప్రాజెక్టు కనీస నీటి మట్టం 41.15 మీటర్లు (119.4 టీఎంసీలు) స్థాయిలో నీటిని నిల్వచేయాలంటే.. ఇటీవల లైడార్ సర్వేలో వెల్లడైన అంశాలను పరిగణలోకి తీసుకుంటే 90 గ్రామాల పరిధిలోని 171 ఆవాసాల్లోని 37,568 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఇందులో ఇప్పటికే 12,658 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించారు. మరో 24,910 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. తొలిదశ సవరించిన అంచనా వ్యయం మేరకు కేంద్రం నిధులు ఇవ్వగానే ఆ కుటుంబాలకు పునరావాసం కల్పిస్తారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 45.72 మీటర్లు (194.6 టీఎంసీలు). పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేయాలంటే 137గ్రామాల పరిధిలోని 200 ఆవాసాల్లో 64,155 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. తొలిదశలో, రెండో దశలో నీటిని నిల్వచేయాలంటే ముంపునకు గురయ్యే 1,10,879 హెకార్ల భూమిని సేకరించాలి. మరోవైపు.. తొలిదశలో 41.15 మీటర్లలో నీటిని నిల్వచేశాక.. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకే ఏవైనా లోపాలుంటే సరిదిద్దుతూ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ 45.72 మీటర్ల వరకూ 194.6 టీఎంసీలను రాష్ట్ర ప్రభుత్వం నిల్వచేయనుంది. రెండో దశలో 45.72 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయడానికి సవరించిన అంచనా వ్యయాన్ని తొలిదశ పనులు పూర్తయ్యే నాటికి కేంద్రం ఆమోదించనుంది.

నవంబర్ 1 వరకు చంద్రబాబుకు రిమాండ్

సాక్షి, అమరావతి/రాజమహేంద్రవరం: స్కిల్ స్కామ్ కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రిమాండ్‌ను నవంబర్ 1వ తేదీ వరకు పొడిగిస్తూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు రిమాండ్ గడువు ముగియడంతో ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వర్చువల్ విధానంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఎదుట గురువారం ప్రవేశ పెట్టారు. రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగించాలని సీఐడీ తరఫు న్యాయవాది మెమో దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యం ఎలా ఉంది.. అని చంద్రబాబును న్యాయమూర్తి వాకబు చేశారు. తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఏం కంగారు పడొద్దని.. మెడికల్ టీమ్ ఉందని న్యాయమూర్తి అన్నారు. చంద్రబాబు వైద్య నివేదికలు ఎప్పటికప్పుడు న్యాయస్థానానికి పంపించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తన భద్రతపై తనకు కొన్ని సందేహాలు ఉన్నాయని చంద్రబాబు కోర్టు దృష్టికి తీసుకురాగా.. ఏమైనా సందేహాలు ఉంటే లిఖితపూర్వకంగా తన దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. ఆయన రాసే లేఖను తనకు పంపించాలని జైలు అధికారులను ఆదేశించారు. అనంతరం చంద్రబాబుకు మరో 14 రోజులపాటు (నవంబర్ 1 వరకు) రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రిమాండ్‌ను పొడిగించడం ఇది అయిదోసారి. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబును సీఐడీ అధికారులు సెప్టెంబర్ 9వ తేదీన అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 10న న్యాయస్థానంలో హాజరు పరిచారు. ఆయనకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. అప్పటి నుంచి అంటే 40 రోజులుగా ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. చంద్రబాబు మరిన్ని రోజులు జైల్లోనే ఉండనుండటంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే 300 మంది భద్రత చర్యలలో నిమగ్నమయ్యారు. వారిని అలాగే కొనసాగించేలా నిర్ణయం తీసుకున్నారు.

క్లుప్తంగా...

‘అల్-అహ్లీ ఆసుపత్రి’ మరణాల పట్ల మోదీ సంతాపం



న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గాజాలోని అల్-అహ్లీ ఆసుపత్రిలో పేలుడు ఘటనలో పెద్ద సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలియజేశారు. పాలస్తీనియన్లకు అవసరమైన మానవతా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇజ్రాయెల్, గాజా ప్రాంతంలో ఉగ్రవాదం, హింస పెచ్చరిల్లుతుండడం, శాంతి భద్రతలు దిగజారుతుండడంపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్-పాలస్తీనా అంశంపై భారత్ వైఖరి మారలేదని ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఘర్షణ మొదలైన తర్వాత మొహమ్మద్ అబ్బాస్‌తో మోదీ మాట్లాడడం ఇదే తొలిసారి. ‘ఆపరేషన్ అజయ్’లో భాగంగా దాదాపు 1,200 మంది భారతీయులు, 18 మంది నేపాలీ జాతీయులను ఇజ్రాయెల్ నుంచి క్షేమంగా భారత్‌కు చేర్చినట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది.

బంగారు అడిగళార్ కన్నుమూత



సాక్షి, చెన్నై: చెన్నై శివారులోని మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్దర్ పీఠం వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు, విద్యాసంస్థల అధినేత బంగారు అడిగళార్ (83) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. చెన్నైకు 100 కి.మీ దూరంలో మేల్‌మరువత్తూరు గ్రామంలో ఆదిపరాశక్తి పీఠాన్ని బంగారు అడిగళార్ నిర్మించారు. ఆదిపరాశక్తి ఆలయాలను పొరుగు రాష్ట్రాలలోనూ నెలకొల్పి మహిళల ద్వారా పూజాది కార్యక్రమాలను నిర్వహింపచేశారు. దీంతో మేల్ మరువత్తూరుకు భారీగా భక్తులు తరలి రావడం, కాలక్రమేణా భక్తుల చేత అమ్మగా పిలవబడే స్థాయికి ఆధ్యాత్మిక గురువుగా బంగారు అడిగళార్ ఎదిగారు. ఆదిపరాశక్తి సిద్దర్ పీఠం నేతృత్వంలో విద్యా సంస్థలను నెలకొల్పారు. సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీతో గౌరవించింది. వయో సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం సాయంత్రం కన్నుమూశారు.

గుండెపోటు అంటూ.. బిల్లు ఎగ్గొట్టేస్తూ..

మాడ్రిడ్: ఓ ఘరానా మోసగాడు(50). దర్జాగా రెస్టారెంట్లకు వెళ్లి, కావాల్సినవన్నీ పూటుగా తినేసేవాడు. బిల్లు అడిగితే గుండెపోటు అంటూ హఠాత్తుగా పడిపోయేవాడు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లి, అట్నుంచటే తప్పించుకుపోయేవాడు. ఇలా ఏడాదిలోనే 20 రెస్టారెంట్లకు బిల్లు ఎగ్గొట్టాడు. చివరికి కథ అడ్డం తిరిగి పోలీసులకు దొరికిపోయాడు. స్పెయిన్‌లోని బ్లాంకా ప్రాంతంలోని అలికంటేలో ఈ ఘటన చోటుచేసుకుంది. గత ఏడాది నవంబర్ నుంచి ఓ వ్యక్తి ఆ నగరంలో ఉంటున్నాడు. ఎప్పటిమాదిరిగానే గత నెలలో బ్రాండెడ్ సూటూబూటూ వేసుకుని పేరున్న రెస్టారెంట్‌కు దర్జాగా వెళ్లాడు. ఖరీదైన ఆహారం ఆర్డరిచ్చి, ఆరగించాడు. బిల్లు 37 డాలర్లయింది. వెయిటర్ చేతికిచ్చిన బిల్లును చూసి, తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సిబ్బంది అతడి వ్యవహారాన్ని పసిగట్టి అడ్డుకున్నారు. హోటల్‌లోని తన రూంలో ఉన్న డబ్బు తెస్తానంటూ బయలుదేరాడు. వాళ్లు ససేమిరా అన్నారు. ఆ వెంటనే గుండెనొప్పి అంటూ ఛాతీ పట్టుకుని ఉన్న పళంగా కిందపడిపోయాడు. హోటల్ సిబ్బంది అంబులెన్సుకు బదులుగా వెంటనే పోలీసులకు కబురు పెట్టారు. వాళ్లొచ్చి..గత కొన్ని నెలలుగా నగరంలోని రెస్టారెంట్లను మోసం చేస్తున్నది అతడేనని గుర్తించి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. అతడి ఫొటోను నగరంలోని అన్ని రెస్టారెంట్లకు పంపి, అలర్ట్ చేస్తామని తాజా బాధిత రెస్టారెంట్ యజమాని తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై సీబీఐ ఉక్కుపాదం

న్యూఢిల్లీ: ఆపరేషన్ చక్ర-2 పేరుతో సీబీఐ అధికారులు గురువారం దేశవ్యాప్తంగా తొమ్మిది ఫేక్ కాల్ సెంటర్లు సహా 76 ప్రాంతాల్లో సోదాలు జరిపారు. రూ.100 కోట్ల క్రిప్టో స్కాం సహా సైబర్ సంబంధిత ఆర్థిక నేరాలపై నమోదైన అయిదు వేర్వేరు కేసుల్లో దర్యాప్తులో భాగంగా దాడులు జరిపినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. నకిలీ క్రిప్టో కరెన్సీ కారణంగా భారతీయులు రూ.100 కోట్లకుపైగా నష్టపోయారని వివరించారు. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఎఫ్ఐయూ) అందజేసిన కీలక సమాచారం ఆధారంగా దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నేరగాళ్లు విదేశీయులే లక్ష్యంగా టెక్నికల్ సపోర్టు ముసుగులో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నట్లు అమెజాన్, మైక్రోసాఫ్ట్‌ల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ, ఇంటర్‌పోల్, యూకే, సింగపూర్, జర్మనీ దేశాల నిఘా, పోలీసు విభాగాల సాయం తీసుకుంటున్నామన్నారు.ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, కేరళ, తమిళనాడు, పంజాబ్, పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రాల్లో జరిపిన దాడుల్లో 32 సెల్‌ఫోన్లు, 48 ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు, 33 సిమ్‌కార్డులు, పెన్‌డ్రైవులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. గత ఏడాది చక్ర-1లో భాగంగా దేశవ్యాప్తంగా 115 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు జరిపింది.



గాజా సిటీ మీదుగా ఇజ్రాయెల్ వైపు దూసుకెళ్తున్న కస్సామ్ రాకెట్లు



గాజాస్ట్రిప్ వద్ద సరిహద్దులకు సమీపంలో ఇజ్రాయెల్ సైనికుల గస్తీ

ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛ

13వ రోజూ గాజా స్ట్రిప్‌పై భీకర దాడులు | క్షిపణులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్ సైన్యం

- పెద్ద సంఖ్యలో భవనాలు నేలమట్టం
- ఖాన్ యూనిస్‌లో 90 మంది ఆశ్రయం పొందుతున్న భవనంపై దాడి
- 15 మంది మృతి.. 40 మందికి గాయాలు

ఖాన్ యూనిస్/న్యూఢిల్లీ: హమాస్‌పై యుద్ధం పేరిట ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్న భీకర దాడుల్లో సాధారణ పాలస్తీనియన్లు బలవుతున్నారు. గాజా స్ట్రిప్‌పై దాడులు తక్షణమే ఆపాలని, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని ప్రపంచ దేశాలన్నీ విజ్ఞప్తి చేస్తున్నా ఇజ్రాయెల్ లెక్కచేయడం లేదు. శత్రువులు ఎక్కడ దాగున్నా మట్టుబెట్టడమే తమ లక్ష్యం అంటూ ఇజ్రాయెల్ సైన్యం గురువారం తెల్లవారుజామునే గాజాపై నిప్పుల వర్షం కురిపించింది. ఉత్తర గాజాతోపాటు దక్షిణ గాజాలో ‘సురక్షితమైన ప్రాంతాలు’ అని భావిస్తున్న చోట కూడా దాడులు చేసింది. హమాస్‌పై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ పెద్ద సంఖ్యలో క్షిపణులు ప్రయోగించింది. చాలా ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఎంతమంది చనిపోయారన్నది తెలియరాలేదు. ఖాన్ యూనిస్‌లో దాదాపు 90 మంది ఆశ్రయం పొందుతున్న ఓ భవనం ఇజ్రాయెల్ క్షిపణి దాడిలో ధ్వంసమైంది. ఈ భవనంలో కనీసం 15 మంది మృతిచెందారని, మరో 40 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు పేర్కొన్నారు. గాజాలో శిథిలాల నుంచి చిన్న పిల్లల మృతదేహాలను బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు చూపరులను కలచి వేస్తున్నాయి.

ఇప్పటిదాకా ఎంతమంది బలయ్యారో?

ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. దాదాపు 23 లక్షల మంది పాలస్తీనియన్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. హమాస్ సైతం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు ప్రయోగిస్తూనే ఉంది. ఇరుపక్షాల నడుమ ఈ నెల 7న ప్రారంభమైన యుద్ధం గురువారం 13వ రోజుకు చేరింది. ఇప్పటికే గాజాలో 3,785 మంది మరణించారు. దాదాపు 12,500 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు. ఇవన్నీ అధికారిక గణాంకాలే. వాస్తవంగా ఎంతమంది బలయ్యారో ఇప్పుడే తెలిసే అవకాశం లేదు. చాలా సమయం పట్టొచ్చు.

ఒక్కపూట భోజనం.. మురికి నీరు

గాజాలో ఆహారం, నీటి కొరత మరింత పెరిగింది. ఒక్కపూట భోజనం దొరకడమే గగనంగా మారింది. దాహమేస్తే మురికి నీరే దిక్కవుతోంది. ఈజిప్టు నుంచి గాజాకు మానవతా సాయం చేరవేయడానికి ఇజ్రాయెల్ అంగీకరించినప్పటికీ అది ఎప్పటికి అందుతుందో చెప్పలేమని స్థానిక అధికారులు అంటున్నారు. ఈజిప్టు సరిహద్దుల్లోని రఫాలో తమ వైమానిక దాడుల్లో హమాస్ అగ్రశ్రేణి మిలిటెంట్ హతమయ్యాడని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గాజాలో వందలాది టార్గెట్లపై దాడులు చేశామని, మిలిటెంట్ల సొరంగాలు, నిఘా కేంద్రాలు, కమాండ్ సెంటర్లు, మోర్టార్-లాంచింగ్ పోస్టులను ధ్వంసం చేశామని వెల్లడించింది. మిలిటెంట్లు గాజాలో ఎక్కడ నక్కినా సరే దాడులు తప్పవని హెచ్చరించింది. వారు సాధారణ పౌరుల ముసుగులో తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఉందని తెలియజేసింది.



ఖాన్ యూనిస్‌లో దెబ్బతిన్న భవంతి నుంచి క్షతగాత్రులను బయటకు తెస్తున్న దృశ్యం

హమాస్ చేతికి ఉ.కొరియా ఆయుధాలు!

ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు ఉత్తర కొరియా ఆయుధాలు ప్రయోగించారా? అవుననే అంటోంది ఇజ్రాయెల్ సైన్యం. హమాస్ వీడియో దృశ్యాలు, మిలిటెంట్ల నుంచి స్వాధీనం చేసుకున్న కొన్ని ఆయుధాలను పరిశీలిస్తే ఇవి ఉత్తర కొరియా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని నిపుణులు చెప్పారు. మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై దాడికి ఎఫ్-7 రాకెట్ గ్రెనేడ్‌తో, షోల్డర్ ఫైర్డ్ వెపన్స్ వాడినట్లు పేర్కొన్నారు. ఇవి ఉత్తర కొరియాకు చెందినవేనని అనుమానిస్తున్నారు. కానీ, హమాస్ మిలిటెంట్లకు ఎలాంటి ఆయుధాలు విక్రయించలేదని ఉత్తర కొరియా తేల్చిచెప్పింది.

భూతల దాడులకు సిద్ధంగా ఉండాలి

గాజాపై భూతల దాడులకు సిద్ధంగా ఉండాలని తమ సేనలకు ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ సూచించారు. గాజాలో అడుగు పెట్టేందుకు సన్నాహాలు చేసుకోవాలని చెప్పారు. కానీ, భూతల దాడులు ఎప్పటినుంచి ప్రారంభమవుతాయో బహిర్గతం చేయలేదు. ఆయన గురువారం గాజా సరిహద్దులో తమ సైనికులతో సమావేశమయ్యారు. ఆదేశాలు రాగానే ముందుకు కదిలేలా సర్వసన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గాజాను ఇప్పటిదాకా మనం బయటి నుంచే చూశామని, ఇకపై లోపలికి వెళ్లి చూడబోతున్నామని మంత్రి వ్యాఖ్యానించారు.

హమాస్ రాక్షసత్వం

- హ్యారీ పోటర్ అభిమాని కిడ్నాప్ విషాదాంతం
- ఇజ్రాయెల్ బాలిక నోయా డాన్ అపహరణ, హత్య



టెల్ అవీవ్: ప్రఖ్యాత రచయిత్రి జేకే రౌలింగ్ రచించిన హ్యారీ పోటర్ పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి. చిన్నపిల్లలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన 12 ఏళ్ల బాలిక నోయా డాన్ ఆటిజం బాధితురాలు. ఆమెకు హ్యారీ పోటర్ సాహసాలంటే చెప్పలేనంత ఇష్టం. ఈ సిరీస్‌లో వచ్చిన పుస్తకాలన్నీ చదివేసింది. ఈ నెల 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు నోయా డాన్‌ను అపహరించారు. ఆమె నాన్నమ్మతోపాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులు బందీలుగా గాజాకు చేరారు. వారంతా ఎక్కడున్నారో, ఎలా ఉన్నారో తెలియరాలేదు. అసలు బతికున్నారో లేదో కూడా తెలియని పరిస్థితి. ఆటిజం బాధితురాలైన నోయా డాన్‌ను విడుదల చేయాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం హమాస్‌ను కోరింది. హ్యారీ పోటర్ పాత్రధారి ఆహార్యంతో ఉన్న నోయా డాన్ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఈ పోస్టును ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది షేర్ చేశారు. హమాస్ చెర నుంచి నోయా డాన్‌ను విడిపించేందుకు చొరవ చూపాలంటూ జేకే రౌలింగ్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. జేకే రౌలింగ్ వెంటనే స్పందించారు. హ్యారీ పోటర్ అభిమాని కిడ్నాప్ అయ్యారని తెలుసుకొని చలించిపోయారు. ఆమెకు విముక్తి కల్పించాలని హమాస్‌ను అభ్యర్థించారు. నోడా డాన్ క్షేమంగా తిరిగిరావాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రౌలింగ్ ప్రతిస్పందన తర్వాత ఇజ్రాయెల్ వ్యథకు నోయా డాన్ ఒక ప్రతీకగా మారిపోయారు. ఇజ్రాయెల్ పౌరులంతా ఆమె గురించి చర్చించుకున్నారు. క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. కానీ, ఇంతలోనే దుర్వార్త వినాల్సి వచ్చింది. నోయా డాన్‌తోపాటు ఆమె నాన్నమ్మ కార్మెలా మృతదేహాన్ని బుధవారం గాజాలో గుర్తించినట్లు ఇజ్రాయెల్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. నోయా డాన్ ఇక లేదని తెలిసి ఇజ్రాయెల్ ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారు. బాలికను హమాస్ మిలిటెంట్లు హత్య చేసినట్లు తెలుస్తోంది. ‘‘అమ్మా, నాకు చాలా భయమేస్తోంది. ఎవరో బూచాళ్లు మన ఇంట్లోకి వచ్చారు. వెంటనే వచ్చి నన్ను నీతో తీసుకెళ్లు’’.. బయటకు వెళ్లిన తన తల్లితో ఫోన్‌లో నోయా డాన్ చివరి సంభాషణ ఇది.

ఇజ్రాయెల్ నెగ్గాలని కోరుకుంటున్నా

యూకే ప్రధానమంత్రి రిషి సునాక్ స్పష్టీకరణ ● ఇజ్రాయెల్‌లో పర్యటన



నెతన్యాహూతో రిషి సునాక్

టెల్ అవీవ్: ప్రస్తుత సంక్షోభ సమయంలో ఇజ్రాయెల్‌కు తాము అండగా నిలుస్తామని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని ఆయన ఖండించారు. ఇజ్రాయెల్‌కు ఇది నిజంగా విపత్కర సమయమని అన్నారు. సునాక్ గురువారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో సమావేశమయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. భేటీ అనంతరం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు. గాజాకు నిత్యావసరాలు సరఫరా చేయడానికి వీలుగా కారిడార్‌ను తెరవడానికి ఇజ్రాయెల్ అంగీకరించడాన్ని సునాక్ స్వాగతించారు. హమాస్‌పై యుద్ధంలో ఇజ్రాయెల్ విజయం సాధించాలని కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. మధ్యప్రాచ్య దేశాలతో ఇజ్రాయెల్ శాంతియుత సంబంధాలను నెలకొల్పుకోకుండా నిరోధించడానికే హమాస్ తమపై దాడులు చేసిందని నెతన్యాహూ ఆక్షేపించారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ తీరును ఆస్ట్రేలియా తప్పు పట్టింది. హమాస్‌పై యుద్ధం చేస్తూ మొత్తం పాలస్తీనియన్లను శిక్షించడం ఏమిటని నిలదీసింది.

ఢిల్లీ వాసులకు ‘హై స్పీడ్’ ప్రయాణం

- దేశంలో తొలి సెమీ హై స్పీడ్ ‘నమో భారత్’రీజనల్ రైలు
- ఢిల్లీ-గాజియాబాద్-మీరట్ మార్గంలో మూడో వంతు తగ్గనున్న ప్రయాణ సమయం
- అబ్బురపరిచే సౌకర్యాలు, విశేషాలు
- అందుబాటులోకి 17 కి.మీ. కారిడార్
- నేడు ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

‘ప్రయాణానికి తక్కువ సమయం, కుటుంబానికి ఎక్కువ...!’. దేశంలోనే తొలి సెమీ హైస్పీడ్ రీజనల్ రైల్ సర్వీస్‌కు సంబంధించిన ఆకర్షణీయమైన నినాదాల్లో ఇదొకటి! ర్యాపిడ్ ఎక్స్‌గా పిలుస్తున్న ఈ తొలి సెమీ హై స్పీడ్ ప్రాంతీయ రైలు దేశ రాజధాని ప్రాంత (ఎన్‌సీఆర్) వాసులకు అందుబాటులోకి రానుంది. మొత్తం 82 కిలోమీటర్ల మేర చేపట్టిన ఢిల్లీ-గాజియాబాద్-మీరట్ రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (ఆర్‌ఆర్‌టీఎస్) కారిడార్‌లో 17 కి.మీ. ప్రస్తుతం సిద్ధమైంది. సాహిబాబాద్-దుహై స్టేషన్ల మధ్యనున్న ఈ కారిడార్‌ను శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ర్యాపిడ్ ఎక్స్ రైలుకు నమో భారత్‌గా గురువారం నామకరణం చేశారు. శనివారం నుంచి ఇది ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది. కారిడార్‌లో కొత్తగా నిర్మించిన స్టేషన్లలో అందమైన కుడ్యచిత్రాలు, ఆకర్షణీయమైన నినాదాలు అలరిస్తున్నాయి. అంతేనా...! ఈ ర్యాపిడ్ ఎక్స్ హై స్పీడ్ రైల్వే వ్యవస్థ విశేషాలు అన్నీ ఇన్నీ కావు...

గంటకు 160 కి.మీ. వేగం!

- ర్యాపిడ్ ఎక్స్ ద్వారా రాజధాని వాసులకు ప్రయాణ సమయం ఏకంగా మూడో వంతు దాకా తగ్గనుంది.
- ప్రయోగాల సందర్భంగానే ర్యాపిడ్ ఎక్స్ రైళ్లు గంటకు 160 కి.మీ. వేగాన్ని సులువుగా అందుకున్నాయి!
- అనేక ఆకర్షణీయమైన ఫీచర్లు ఈ రైళ్ల సొంతం.
- ఒక్కో రైల్లో ఆరు కోచ్‌లుంటాయి. వీటిలో 1,700 మంది ప్రయాణించవచ్చు.
- ప్రతి రైల్లో ఒక మహిళా కోచ్‌తో పాటు వారికి దివ్యాంగులకు, వృద్ధులకు కొన్ని సీట్లు ప్రత్యేకిస్తారు.
- రెండు వరుసల్లో, వరుసకు రెండు చొప్పున సీట్లుంటాయి. నిలబడేందుకు విశాలమైన స్థలం అందుబాటులో ఉంటుంది.
- ల్యాప్‌టాప్, మొబైల్ చార్జింగ్ పాయింట్లు, లగేజీ ర్యాక్‌లు, అభిరుచికి అనుగుణంగా లైటింగ్‌ను మార్చుకునే వెసులుబాటు, సీట్ పుష్ బ్యాక్, కోట్ తగిలించుకునే హుక్, ఫుట్ రెస్ట్, ప్రీమియం కోచ్‌లో ప్రయాణికులకు సాయపడేందుకు అసిస్టెంట్, స్నాక్స్, డ్రింక్స్ కొనుక్కునేందుకు వెండింగ్ మెషీన్ల వంటివెన్నో ఇందులో ఉన్నాయి.
- ఉదయం ఆరింటి నుంచి రాత్రి 11 దాకా ప్రతి 15 నిమిషాలకు ఒక రైలు అందుబాటులో ఉంటుంది.
- డిమాండ్‌ను, అవసరాన్ని బట్టి ముున్ముందు ప్రతి 5 నిమిషాలకు ఒక రైలు నడుపుతారు.
- చార్జీలు స్టాండర్డ్ కోచ్‌లో రూ.20-రూ.40, ప్రీమియం కోచ్‌లో రూ.40-రూ.100.
- ప్రతి స్టేషన్‌నూ ఆకర్షణీయమైన రంగులతో కూడిన కుడ్య చిత్రాలు, నినాదాలతో ఆకట్టుకునేలా తయారు చేశారు.
- ఈ ర్యాపిడ్ ఎక్స్ ప్రాజెక్టును ఢిల్లీ, హరియాణా రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలతో కలిసి కేంద్రం సంయుక్తంగా చేపట్టింది.
- ఢిల్లీ-గాజియాబాద్-మీరట్ మధ్య 81.15 కి.మీ. ఆర్‌ఆర్‌టీఎస్ వ్యవస్థ 2025 కల్లా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.
- ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.30 వేల కోట్లు.



‘ఏఐ’ బ్యాగేజ్ స్కానింగ్

ర్యాపిడ్ ఎక్స్ రైళ్ల ఉద్దేశమే ప్రయాణ సమయం తగ్గించడం. అందుకు అనుగుణంగా కారిడార్‌లోని స్టేషన్లలో బ్యాగేజీ తనిఖీ సమయాన్ని బాగా తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం కృత్రిమ మేధ ఆధారంగా పని చేసే సాంకేతిక వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. నియంత్రిత, నిషేధిత వస్తువులుంటే అది వెంటనే భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది.

- ఇందులో డ్యుయల్ వ్యూతో కూడిన ఎక్స్ రే బ్యాగేజీ తనిఖీ వ్యవస్థ ఉంటుంది. దాంతో బ్యాగేజీ తాలూకు పై, లోపలి భాగాలు స్క్రీన్‌పై విడిగా, స్పష్టంగా కన్పిస్తాయి.
- ఈ స్టేషన్లలో తక్షణ స్పందన బృందం, బాంబ్ డిటెక్షన్-డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ వంటివాటిని యూపీ పోలీసులు అందుబాటులో ఉంచనున్నారు!

- సాక్షి, నేషనల్ డెస్క్

వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలి

వాషింగ్టన్: ఇజ్రాయెల్, హమాస్‌లు వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ యూఎస్ కాపిటల్ భవన సముదాయం వద్ద బుధవారం భారీ ప్రదర్శన జరిగింది. వీరిలో వివిధ యూదు సంస్థల ప్రతినిధులు కూడా కొందరున్నారు. ‘యూదులు తక్షణమే కాల్పుల విరమణ కోరుకుంటున్నారు’అంటూ వీరు ప్లకార్డులు ప్రదర్శించారు. పోలీసులు సుమారు 300 మందిని అదుపులోకి తీసుకుని, తాత్కాలిక ఆంక్షలు విధించి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు.



మహ్సా అమినికి సఖరోవ్ పురస్కారం

స్ట్రాస్‌బర్గ్(ఫ్రాన్సు): గత ఏడాది ఇరాన్ పోలీస్ కస్టడీలో మృతి చెందిన కుర్దిష్-ఇరాన్ మహిళ మహ్సా అమిని(22)కి యూరోపియన్ యూనియన్ అత్యున్నత మానవ హక్కుల పురస్కారం ప్రకటించింది. మానవహక్కులు, ప్రాథమిక స్వేచ్ఛ కోసం పోరాడే వారికి సఖరోవ్ పురస్కారాన్ని యూరోపియన్ యూనియన్ ఏటా ప్రకటిస్తోంది. డిసెంబర్ 13న జరిగే కార్యక్రమంలో మహ్సా అమిని కుటుంబీకులకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. హిజాబ్ ధరించలేదనే కారణంతో మహ్సా అమినిని నైతిక విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. కస్టడీలో ఉండగానే ఆమె గత ఏడాది సెప్టెంబర్ 16న మృతి చెందారు. ఇది ప్రభుత్వ హత్యేనంటూ దేశవ్యాప్తంగా కొన్ని నెలలపాటు తీవ్ర ఆందోళనలు కొనసాగాయి. ప్రభుత్వం వాటిని బలప్రయోగంతో అణచివేసింది. గత ఏడాది సఖరోవ్ పురస్కారాన్ని రష్యా దురాక్రమణను ఎదురొడ్డి పోరాడుతున్న ఉక్రెయిన్ పౌరులకు ప్రకటించారు. ఈ అవార్డును ఒకప్పటి సోవియెట్ యూనియన్ అసమ్మతివాది ఆండ్రీ సఖరోవ్ పేరిట 1988లో నెలకొల్పారు. నోబెల్ శాంతి బహుమతి అందుకున్న సఖరోవ్ 1989లో మరణించారు

డీకేపై విచారణ 3 నెలల్లో పూర్తిచేయండి

- సీబీఐకి కర్ణాటక హైకోర్టు ఆదేశం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పిటిషన్ కొట్టివేత

బనశంకరి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీబీఐ దర్యాప్తును సవాలు చేస్తూ కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం కొట్టేసింది. ఇప్పటి వరకు ఉన్న స్టేను ఎత్తివేస్తూ దర్యాప్తు మూడునెలల్లో పూర్తిచేయాలని సీబీఐను ఆదేశించింది. దర్యాప్తు చాలావరకు పూర్తయిందని, అందుకే ఈ దశలో కోర్టు జోక్యం చేసుకోలేదని న్యాయమూర్తి జస్టిస్ కె.నటరాజన్ స్పష్టం చేశారు. 2014-18 మధ్య డీకే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని 2018లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ ఏడాది ప్రత్యేక కేసు నమోదు చేసింది. అంతకుముందు రెండు మూడుసార్లు డీకే, ఆయన సన్నిహితుల నివాసాలు, ఆఫీసుల్లో ముమ్మరంగా సోదాలు జరిపి నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుంది. కర్ణాటక శాసనసభ ఎన్నికల నేపథ్యంలో డీకే కొన్ని నెలల కిందట హైకోర్టును ఆశ్రయించి సీబీఐ దర్యాప్తుపై స్టే తెచ్చుకున్నారు. గత సోదాల సమయంలో రూ.200 కోట్లకుపైగా అక్రమాస్తులు వెలుగు చూశాయని సీబీఐ తరపు న్యాయవాదులు వాదించారు. కేసుపై స్టే ఎత్తివేయాలని అభ్యర్థించారు. హైకోర్టు తీర్పును డీకే సుప్రీంకోర్టులో సవాల్ చేసే అవకాశముందని తెలిసింది.

రాజకీయ దురుద్దేశంతోనే: డీకే



రాజకీయ దురుద్దేశంతో గతంలో బీఎస్ యడియూరప్ప ప్రభుత్వం తన కేసును సీబీఐకి అప్పగించిందని డీకే శివకుమార్ ఆరోపించారు. తీర్పు తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. సీబీఐ తనను, కుటుంబాన్ని కనీసం ఒక్కరోజు కూడా విచారణకు రావాలని పిలవలేదన్నారు. మరి 90 శాతం దర్యాప్తు ఎలా పూర్తి చేశారోనని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కోర్టులపై తనకు నమ్మకం ఉందని, పోరాటం చేస్తానని చెప్పారు. తనను జైలుకు పంపిస్తామన్న రాష్ట్ర బీజేపీ, జేడీఎస్ నాయకుల మాటలను ప్రస్తావిస్తూ.. దమ్ముంటే త్వరగా ఆ పనిచేయాలని సవాల్ విసిరారు.

ప్రయోజనం పొంది ప్రశ్నలడిగారు

- టీఎంసీ నేత మహువా మొయిత్రాపై వ్యాపారవేత్త దర్శన్ సంచలన ఆరోపణ
- అఫిడవిట్‌లో విస్తుగొలుపే అంశాలు

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మహువా మొయిత్రాపై వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీ, ఆదానీ గ్రూప్‌ను అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా టీఎంసీ నేత మొయిత్రా కుట్ర పన్నారని దర్శన్ ఆరోపించారు. ఈ మేరకు దర్శన్ సంతకం చేసిన అఫిడవిట్ ఒకటి మీడియాలో ప్రత్యక్షమైంది.

అఫిడవిట్‌లోని అంశాలు...

- నాకు అనుకూలమైన ప్రశ్నలు అడిగేందుకు ఎంపీ అయిన మొయిత్రా నుంచి పార్లమెంట్ లాగిన్ ఐడీ వివరాలను తీసుకున్నాను
- ఇందుకుగాను ఆమె చాలా విలాసవంతమైన ప్రతిఫలాలు పొందారు. లగ్జరీ ఐటమ్ అడిగేవారు. ఢిల్లీలోని ఆమె తన అధికారిక బంగ్లా ఆధునీకరణ పనులు చేయించుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రయాణ ఖర్చులను భరించాలని డిమాండ్‌చేశారు.
- జాతీయస్థాయి నేతగా ఎదగాలని మొయిత్రాకు ఆశ. అందుకే ప్రధాని మోదీ, గౌతమ్ అదానీలను అప్రతిష్టపాలు చేసి ప్రతిష్ట పెంచుకుందామని స్నేహితులను ఉపాయాలు అడిగేవారు.
- పార్లమెంట్‌లో ఆమె ప్రశ్నలు అడిగేందుకు తగిన సమాచారాన్ని ఆమె పార్లమెంటరీ మెయిల్ ఐడీకి పంపేవాడిని. తర్వాత నేనే నేరుగా ప్రశ్నలు అప్‌లోడ్ చేసేవాడిని.
- ఆమెకు రాహుల్ గాంధీ, శశి థరూర్, పినాకీ మిశ్రా వంటి నేతలతో సత్సంబంధాలు ఉండటంతో నాకూ లాభం ఉంటుందని భావించా.
- ఫైనాన్షియల్ టైమ్స్, న్యూయార్క్ టైమ్స్, బీబీసీ ఇలా ప్రముఖ అంతర్జాతీయ వార్తాసంస్థలకు చెందిన జర్నలిస్టులతో ఆమె మాట్లాడేవారు
- సుచేతా దలాల్, శార్దూల్ ష్రాఫ్‌లతోపాటు మాజీ అదానీ ఉద్యోగులు ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించిప్రశ్నలు అడిగేవాళ్లం. ఇలా ఉండగా, తన పరువుకు భంగం కలిగేలా మీడియా సంస్థలు వార్తలు ప్రచురించకుండా అడ్డుకోవాలంటూ మొయిత్రా వేసిన పిటిషన్ నేడు ఢిల్లీ హైకోర్టులో విచారణకు రానుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023

వీనులవిందు



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం మంగళూరులో ఉర్వీల మహాలక్ష్మి ఆలయంలో వందమంది మహిళల వీణా వాదన కచేరీ

న్యూస్‌రీల్

కరెంటు కోతలపై రైతుల ధర్నా



శివమొగ్గ: ఇష్టానుసారం కరెంటు కోతల వల్ల తమ పంటలు పాడవుతున్నాయని, పంప్‌సెట్‌లకు సక్రమంగా కరెంట్‌ను అందించాలని రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సాగర తాలూకా రైతులు శివమొగ్గలో కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 45 లక్షలపైగా రైతులు ఉన్నారని, వారు పంపుసెట్లు, బోర్ల ద్వారా పొలాలకు నీటిని వాడుకుంటారని, కరెంటు కోతల వల్ల పొలాలకు నీరివ్వలేక వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లోడ్ షెడ్డింగ్ పేరుతో సరిగా కరెంటు ఇవ్వక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికే తీవ్రమైన కరువు ఉన్నామని, ఈ సమయంలో కరెంటు కోతలు సరికాదని వాపోయారు. అనంతరం కలెక్టరును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

రైతులతో భూసేకరణ చర్చలు విఫలం

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి తాలూకాలో చెన్నరాయపట్టణ క్లస్టర్ పరిధిలోని 13 గ్రామాలకు చెందిన రైతుల భూములను స్వాధీనం చేసుకోవడానికి కేఐఏడీబీ ఇచ్చిన నోటీసులు వెనక్కుతీసుకుని, భూస్వాధీన నిర్ణయాన్ని రద్దు చేయాలని గత ఏడాదిన్నర కాలంగా రైతులు పోరాటం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఎంబీ పాటిల్, ఉన్నతాధికారులు గురువారంనాడు బెంగళూరులోని ఖనిజభవనంలో రైతులతో జరిపిన చర్చల్లో ఏమీ తేలలేదు. రైతులను ఎలాగైనా భూములు ఇవ్వడానికి ఒప్పించాలని పరిశ్రమల శాఖ మంత్రి, బెంగళూరు గ్రామీణ ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కేఐఏడీబీ కోరుతున్న 1,777 ఎకరాలు ఎక్కువగా సాగుభూములని, వాటిని ఇచ్చేస్తే తామెలా బతకాలని రైతులు ప్రశ్నించారు. దీంతో అధికారులు మరోసారి సమావేశం జరపాలని నిర్ణయించారు.

వేధిస్తున్నాడని మట్టుబెట్టారు

- భర్త హత్య కేసులో భార్య, మరదలు అరెస్ట్



హతుడు, నిందితులు

బనశంకరి: భర్త వేధింపులు భరించలేక అతన్ని హత్య చేసిన కేసులో భార్య, ఆమె చెల్లిని సంపిగేహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు నజీర్‌ఖాతూన్, కాశ్మీరిని సంపిగేహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...ఈనెల 10న షకీల్ అక్తర్‌సైఫీ కనిపించడం లేదని అతని సోదరుడు సంపిగేహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే ఈనెల 14 తేదీ ఉదయం ముదాసీర్ అనే వ్యక్తి కోగిలు లేఔట్‌లో వెళుతుండగా దుర్వాసన రావడంతో సమీపంలో పిట్‌గుంత మూత తీసి పరిశీలించగా అందులో శవం ఉన్నట్లు గుర్తించారు. ఆయన తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చంపి పిట్‌లో వేశారు:

సంపిగేహళ్లి పోలీసులు ఓ పిట్‌లో బెడ్‌షీట్‌లో మూటగట్టి ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. అదృశ్యమైన షకీల్‌అక్తర్‌సైఫీగా గుర్తించారు. వివిధ కోణాల్లో విచారణ చేసి షకీల్ భార్య, ఆమె సోదరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా షకీల్ పెట్టే వేధింపులను భరించలేక హత్య చేసినట్లు చెప్పారు. షకీల్ నిద్రిస్తుండగా చెల్లితో కలిసి నజీర్‌ఖాతూన్.. షకీల్ గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బెడ్‌షీట్‌లో చుట్టి కోగిలు లేఔట్ పిట్‌లో వేసినట్లు తెలిపారు. వీరిద్దరిపై సంపిగేహళ్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



యువ దసరా ప్రదర్శనలో హీరో శివరాజ్ కుమార్ నృత్యం



ఓ గాయని పాట కచేరీ



చిందులేస్తున్న యువత

యువ కళా సౌరభం

- ఉత్సాహంగా మైసూరు దసరా నవరాత్రి ఉత్సవాలు
- హీరో శివు నృత్య ప్రదర్శన
- బాలల యోగా విన్యాసాలు
- జంబూ సవారీకి ఏర్పాట్లు

మైసూరు: నాడహబ్బ మైసూరు దసరా సంబరాలతో రాచనగరి మార్మోగుతోంది. నవరాత్రి ఉత్సవాలు గురువారం ఐదవ రోజుకు చేరాయి. యువ దసరా వేడుకల్లో కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ వేదికపై ప్రత్యక్షమై మాస్ డైలాగ్‌లు కొడుతూ, నర్తిస్తుంటే ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. నటుడు శరణ్, గాయకుడు, నటుడు సాధుకోకిల హాస్యం అందరినీ నవ్వుల్లో ముంచెత్తింది. యువ దసరాలో నటీనటుల నృత్య హాస్య ప్రదర్శనలు వినోదం పంచాయి. శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ దసరా వేడుకల్లో అందరూ సంతోషంగా పాల్గొంటున్నారని అన్నారు. విద్యార్థులు, యువత చదువుకోవాలి, అలాగే ఆటలు ఆడాలని, గురువులకు తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని చెప్పారు. అలాగే బాలల యోగా విన్యాసాలు అలరించాయి. రాత్రికి ప్యాలెస్ విద్యుద్దీప కాంతుల్లో పోలీస్ బ్యాండు సంగీత ప్రదర్శన ఉత్తేజకరంగా జరిగింది.

పోలీసు బలగాల కవాతు

దసరాకు సమయం దగ్గర పడడంతో జంబూ సవారీ తాలీము జోరుగా సాగుతోంది. ప్యాలెస్ ఆవరణలో ఏనుగులచే సాధన చేయించారు. కెప్టెన్ అభిమన్యు నాయకత్వంలో గజరాజులు, గుర్రాలు క్రమశిక్షణగా పాల్గొన్నాయి. అభిమన్యు అంబారీని మోస్తూ నడిచింది. పెద్దసంఖ్యలో పోలీసు బలగాలు, బ్యాండ్ బృందం దసరా రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. ఉన్నతాధికారులు వేదికపై నుంచి అంబారీకి వందనం సమర్పించారు. మరోవైపు దసరా రోజున జంబూ సవారీ ఊరేగింపు జరిగే రోడ్ల వెంబడి అటు ఇటు బారికేడ్ల నిర్మాణం జరుగుతోంది.



ప్యాలెస్ ముందు పోలీసు వాద్య బృందం సంగీత ప్రదర్శన



అమ్మాయిల యోగాసనాల ప్రావీణ్యం



సాధనలో నిమగ్నమైన పోలీసు బలగాలు



దసరా ఊరేగింపు సాగే రోడ్లలో బారికేడ్ల నిర్మాణం

వందేభారత్ రైలుపై రాళ్లదాడులు

- ధర్మవరం, అనంతపురంలో ఘటనలు
- రైల్వే పోలీసుల విచారణ



వందేభారత్ రైలు

అనంతపురం సిటీ: కాచిగూడ–బెంగళూరు మధ్య నడిచే వందేభారత్ రైలుపై అనంతపురం నగరం వద్ద మళ్లీ రాళ్ల దాడి జరిగింది. ఈ నెల ఒకటిన ధర్మవరం దగ్గర కొందరు రాళ్లతో దాడి చేశారు. అప్పట్లో సీ–4 కోచ్‌పై రాళ్లు పడ్డాయి. తాజాగా ఈ నెల 17న అనంతపురం శివార్లలోని నేషనల్ పార్క్ వద్ద సాయంత్రం 5.50కు చేరుకోగానే దుండగులు రాళ్లు విసిరారు. సీ–3, సీ–7 కోచ్‌ల అద్దాలు ధ్వంసమైనట్లు ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. ఈ రెండు దాడులూ బెంగళూరు నుంచి కాచిగూడకు బయలుదేరిన వందేభారత్ రైలుపైనే జరిగాయి. ధర్మవరం, అనంతపురం ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎవరు పాల్పడుతున్నారు

ఇటువంటి చర్యలకు ఎవరు, ఎందుకు పాల్పడుతున్నారో రైల్వే అధికారులకు, పోలీసులకు అంతుబట్టడం లేదు. ఇది ఆకతాయిల పనా, లేక తాగుబోతుల చేష్టలా లేక ఇంకేమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వందేభారత్ రైలుకు ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను తమకు ఇవ్వాలని కోరుతూ అనంతపురం, హిందూపురం ఆర్‌పీఎఫ్ పోలీసులు సికింద్రాబాద్‌లోని తమ శాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాశారు.

విమానాల టికెట్లు జంప్

దొడ్డబళ్లాపురం: దసరా పర్వదినాల సందర్భంగా వరుస సెలవులు రావడంతో దేశీ విమానాల టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కెంపేగౌడ ఎయిర్‌పోర్టు నుండి కోల్‌కతా, ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర నగరాలకు వెళ్లే విమానాల్లో ధరలు దాదాపుగా రెట్టింపయినట్టు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గతవారంతో పోల్చుకుంటే ధరలు 50 శాతం పెరిగాయని తెలుస్తోంది. మరోవైపు ప్రైవేటు బస్సులు, రైళ్లలో, క్యాబ్‌లలో కూడా ధరలు పెరిగాయని సమాచారం. సెలవులు వచ్చాయని ఆనందపడాలో, రేట్లు పెరిగాయని బాధపడాలో తెలీడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఇబ్రహీం ఇంటిముఖం

- జేడీఎస్ రాష్ట్ర పగ్గాలు హెచ్‌డీ కుమారకే
- దళపతి దేవేగౌడ ఆకస్మిక నిర్ణయం
- ఉద్వాసనపై భగ్గుమన్న ఇబ్రహీం

బనశంకరి: జేడీఎస్ పార్టీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రాధ్యక్షుడు సీఎం ఇబ్రహీంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని దళపతి హెచ్‌డీ దేవేగౌడ రద్దు చేశారు. గురువారం బెంగళూరులో జేడీఎస్ ఆఫీసులో రాష్ట్ర కార్యవర్గ భేటీ అనంతరం దేవేగౌడ విలేకరుల సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. జేడీఎల్పీ నేతగా ఉన్న హెచ్‌డీ.కుమారస్వామిని పార్టీ రాష్ట్రాధ్యక్షునిగా నియమించాలని అందరి ఆమోదంతో తీర్మానించామని తెలిపారు. దీంతో బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్న ఇబ్రహీంకు ఉద్వాసన పలికినట్లయింది. బీజేపీతో పార్టీ పొత్తును నిరసిస్తూ ఇబ్రహీం వరుసగా సమావేశాలు నిర్వహించడం, తనదే అసలైన జేడీస్ అనడం, వీలైతే కుమారస్వామిని పార్టీ నుంచి బహిష్కరిస్తానని సంచలన ప్రకటనలు చేయడంతో దేవెగౌడలో కలవరం ఏర్పడింది. మరో మాట లేకుండా ఇబ్రహీం తదితరులపై వేటు వేశారు.

విద్యుత్ స్కాం రట్టు చేస్తా: కుమార

పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పనిచేస్తానని కుమారస్వామి తెలిపారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కూడా కుటుంబపార్టీనేనని, వారికి తమ గురించి మాట్లాడే నైతికహక్కు వారికి ఉందా అని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో జరుగుతున్న లూటీ పై శుక్రవారం వివరంగా మాట్లాతానన్నారు.

నా పోరాటం ఏమిటో చూపిస్తా: ఇబ్రహీం

హెచ్‌డీ.దేవేగౌడ పుత్రవ్యామోహం రుజువైందని, తనను పార్టీనుంచి గెంటేసిన ప్రభావం ఎలా ఉంటుందో చూడాలని సీఎం ఇబ్రహీం సవాల్ చేశారు. నగరంలో నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ తనను రాష్ట్రాధ్యక్ష పదవి నుంచి తొలగించే అధికారం లేదని పలు అంశాలను ఏకరువు పెట్టారు. దేవేగౌడను తండ్రితో సమానమని అనుకున్నాను, కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి జేడీఎస్‌లో చేరానని వాపోయారు. నేను సీఎం సిద్దరామయ్యను తిట్టలేదని దేవేగౌడకు ఆగ్రహంగా ఉందేదన్నారు. దేవేగౌడకు కొంచెం కూడా జ్ఞానంలేదని, తన పోరాటం ఇప్పుడు ప్రారంభమౌతుందని చెప్పారు.



దేవేగౌడ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న కుమారస్వామి



అవమానకరంగా ఇబ్రహీం నిష్క్రమణ

ఎవరీ ఇబ్రహీం?

చాంద్ మహల్ ఇబ్రహీం, వయసు 75 ఏళ్లు, స్వస్థలం హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకాలోని ఐరణి గ్రామం. ఆయన తండ్రి కాంగ్రెస్ నేత. అలా ఇబ్రహీం కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. జనతాపార్టీ ద్వారా 1978లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆపై కాంగ్రెస్‌లో కొనసాగారు. తరువాత జేడీఎస్‌లో చేరి ఎంపీగా ఎన్నికై ప్రధానులు దేవెగౌడ, గుజ్రాల్ తదితరుల హయాంలో మూడుసార్లు కేంద్రమంత్రిగా పనిచేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కాంగ్రెస్‌ను వీడి జేడీఎస్ రాష్ట్ర అధ్యక్ష పదవి తీసుకున్నారు. అప్పుడే అందరూ ఆయన నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లోనే ఉండి ఉంటే సులభంగా గెలిచి రాష్ట్ర మంత్రి అయ్యుండేవారని అభిప్రాయపడ్డారు.

బీజేపీ కార్యకర్త ఆత్మహత్య

- మంత్రి వేధింపులే కారణమని వీడియో

రాయచూరు రూరల్: రాజకీయ వేధింపులను భరించలేక శివకుమార్ (30) అనే ఓ యువకుడు బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబుర్గి జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. కలబుర్గి జిల్లా చించోళి తాలూకా శిరోళికి చెందిన బీజేపీ కార్యకర్త శివకుమార్.. బంధువు నరసప్ప పొలానికి వెళ్లినప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు అతనిపై దాడి చేశారు. మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తనపై దాడి చేయడంతో పాటు ఫోన్‌లో నానా రకాలుగా దూషించారని శివకుమార్ వీడియోలను, ఆడియోలను విడుదల చేశాడు. హిందూ మతం అనే పదాన్ని ఎక్కడా వాడరాదని హెచ్చరించారని, తన బాధలకు మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ ప్రధాన కారణమంటూ నేరుగా మంత్రికి మూడుసార్లు వీడియోలను తీసి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ వీడియోలు స్థానికంగా వైరల్ అయ్యాయి. కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా సహా పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై మండిపడ్డారు. హిందూ యువకుడిని బాధించి, అతని ఆత్మహత్యకు కారకుడైన ప్రకాష్ పాటిల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.



శివకుమార్ (ఫైల్), మంత్రి శరణప్రకాష్

పోషించలేక ప్రాణం తీశాడు

- ఏడాదిన్నర కొడుకుని చెరువులో పడేసిన తండ్రి

మైసూరు: పోషణ చేతకాక ఓ కన్నతండ్రి తన ఏడాదిన్నర కుమారుడిని చెరువులో పడేసిన దారుణ ఘటన మైసూరు జిల్లా పిరియా పట్టణ తాలూకా మాకోడిలో చోటుచేసుకుంది. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...బెంగళూరు సమీపంలోని దేవనహళ్లి తాలూకాకు చెందిన గణేశ్‌కు 2014లో వివాహం జరిగింది. వీరికి హారిక, దీక్ష అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఏడాదిన్నర క్రితం అతని భార్య లక్ష్మీ మగబిడ్డకు జన్మనిచ్చింది. కాన్పు సమయంలో అతని భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు ఆడపిల్లలను దేవనహళ్లి వద్ద ఉన్న తాత వద్ద వదిలి, మగబిడ్డను తీసుకుని పిరియా పట్టణ తాలూకా మాకొడికి వచ్చాడు. అక్కడ తల్లితో కలిసి ఉన్నాడు. పలుమార్లు మామ వచ్చి మనవడిని ఇవ్వాలని ప్రాధేయపడ్డాడు. చివరకు కిరాతకుడు కొడుకును చెరువులో పడేశాడు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

లలితా త్రిపుర సుందరిగా దర్శనం

బనశంకరి: దసరా శరన్నవరాత్రులను బనశంకరి దేవస్థానంలో కన్నులపండువగా నిర్వహిస్తున్నారు. భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. గురువారం వేకువజామున సుప్రభాతసేవ, ప్రత్యేక పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు ఏ.చంద్రమోహన్ అమ్మవారికి లలితాత్రిపుర సుందరి అలంకరణ, శాకంబరీదేవికి అలంకరణ గావించి పూజలు నిర్వహించారు. యాగశాలలో వివిధ హోమాలు, పూర్ణాహుతి జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏహెచ్. బసవరాజ్, ఈఓ లక్ష్మీ , సూపర్నెంటు శ్రీనివాసమూర్తి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





అమ్మవారికి లలితాత్రిపుర అలంకారం, (ఇన్‌సెట్లో) యాగంలో పాల్గొన్న భక్తులు

పసుపు, కుంకుమ.. వివాదం

- ఆయుధ పూజలో వాడొద్దన్న సర్కారు

యశవంతపుర: దసరా ఆయుధపూజ సందర్భంగా విధానసౌధ, వికాససౌధ, ఎంఎస్ బిల్డింగ్ కట్టడాలలో రసాయనిక పసువు, కుంకుమతో పాటు ఇతర రంగులను పూజలు, అలంకరణల్లో ఉపయోగించవద్దని ప్రభుత్వం అధికారులను ఆదేశించడం చర్చనీయాంశమైంది. చారిత్రక కట్టడాలు కావడంతో రసాయనిక రంగులను వాడరాదన్నారు. ఈ ఆదేశాలు కొత్తగా వచ్చినవి కావని సీఎం సిద్దరామయ్య చెప్పడం గమనార్హం.

హిందూ వ్యతిరేకం: ఈశ్వరప్ప

శివమొగ్గ: రాష్ట్రంలోని చారిత్రక భవనాలలో ఆయుధ పూజకు రసాయనాలు ఉన్న పసుపు, కుంకుమలను వాడరాదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం ద్వారా హిందూ వ్యతిరేకతను చాటుకుందని బీజేపీ మాజీ మంత్రి కే.ఎస్.ఈశ్వరప్ప ఆరోపించారు. గురువారం శివమొగ్గలో మీడియాతో మాట్లాడుతూ పసుపు కుంకుమలను ఉపయోగించరాదనడం ద్వారా హిందూ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రభుత్వం పాల్పడుతోందని మండిపడ్డారు. ఐటీ, సీబీఐ కేసుల్లో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తప్పకుండా మళ్లీ జైలుకు వెళతారని, కొన్నిరోజుల్లోనే అది తెలుస్తుందని అన్నారు.

ఎక్కడికీ పారిపోలేదు: డీకేశి

దొడ్డబళ్లాపురం: ఈశ్వరప్ప తదితరుల మాటలపై డీకే శివకుమార్ స్పందిస్తూ తనను తీహార్ జైలుకు పంపిస్తానని బీజేపీ నాయకులు చెబుతున్నారని, తాను ఎక్కడికీ పారిపోనని, తప్పు చేసి ఉంటే శిక్ష అనుభవిస్తానని చెప్పారు. కుమారస్వామి, ఈశ్వరప్ప మాటలు వింటుంటే వారే జడ్జిలు ఏమో అని పిస్తోందన్నారు. కుమారస్వామి గంటకో మాట మాట్లాడతారని, ఆయనకు రాజకీయ పరిజ్ఞానం లేదని అన్నారు.



చారిత్రక భవనాలలో పసుపు, కుంకుమలతో పూజ చేయొద్దని ఆదేశాలు

క్లుప్తంగా

వాటర్ క్యాన్ల వితరణ



నీళ్ల క్యాన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

గంగావతి: ధర్మస్థళ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో గురువారం కొప్పళ తాలూకా గంగావతి అసెంబ్లీ క్షేత్ర పరిధిలోని ఇందరిగి గ్రామంలో 50 మంది మహిళలకు రక్షిత నీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డాక్టర్ అమరప్ప మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ప్రధానంగా మహిళల ఆర్థిక అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. మహిళలకు సొంత కాళ్లపై నిలబడేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తమ సంఘం ద్వారా అందజేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో మహిళలు తమ సంఘం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేత ఇంట్లో ఈడీ సోదాలు

సాక్షి,బళ్లారి: ఇటీవల ఐటీ దాడుల్లో కాంగ్రెస్ నేతల ఇళ్లల్లో కోట్లాది రూపాయల నోట్ల కట్టలు బయట పడుతున్న నేపథ్యంలో గురువారం ఈడీ కూడా రంగప్రవేశం చేసింది. కలబుర్గి జిల్లా చించోళి తాలూకా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాబూరావ్ పాటిల్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. చందాపుర బసవనగరలోని ఆయన ఇంట్లో హైదరాబాద్ నుంచి విచ్చేసిన ఈడీ అధికారుల పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కలబుర్గి జిల్లాలో కలకలం సృష్టించింది.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి రూరల్ : కొప్పళలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్యే కె.రాఘవేంద్ర హిట్నాల్‌ను కర్ణాటక ప్రదేశ కురుబ సంఘం నూతన సహ కార్యదర్శి రమేష్ గిరణి కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కురుబ సమాజం నాయకులు బసవరాజ్ బెలవాడగి, సోమణ్ణ ముళ్లూరు, బాలప్ప గురికార్‌తో పాటు సమాజ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి రూపాల్లో తృప్తి

- ఇళకల్ చీరల రాయబారిచే దేవి రూపాల ప్రదర్శన



దేవి రూపాల్లో తృప్తి సాలిమఠ

రాయచూరు రూరల్: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దేవి రూపాల్లో తృప్తి సాలిమఠ కనిపించారు. బాగల్‌కోటె జిల్లా ఇళకల్‌లో తృప్తి సాలిమఠ చీరల ప్రదర్శనకు రాయబారిగా విధులు నిర్వహిస్తూ తొమ్మిది రోజుల పాటు శక్తి దేవతల ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకుంది. తొమ్మిది మంది దేవతల రూపాలను ధరించి ఆదిపరాశక్తి, శాంభవి, అంబా భవాని, దుర్గ, కాళికా, చాముండి, ఇతర శక్తిదేవతల రూపాలను ధరించారు. తెలుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ, పసుపు పచ్చ, బూడిద, కేసరి, గులాబీ, నేరేడు రంగు చీరలు ధరించి అందరినీ అలరించింది.

అమ్మవారికి దానిమ్మ అలంకారం

కోలారు: శరన్నవరాత్రులను పురస్కరించుకుని గురువారం నగరంలోని శారదా శంకరమఠంలోని శారదా మాత ఆలయంలో అమ్మవారికి దానిమ్మ అలంకరణ చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. శంకరమఠం నిర్వాహకులు ప్రతి నిత్యం అమ్మవారి ఆలయంలో నవరాత్రుల్లో తొమ్మిదిరోజులు అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మఠం ధర్మాధికారి జెఎన్ రామకృష్ణ తెలిపారు.

ట్రాఫిక్ కట్టడికి వినూత్న వ్యూహాలు

- ఎక్కడబడితే అక్కడ వాహనాలు ఆపకుండా చర్యలు
- చిన్న పిల్లలు బైక్‌లు నడిపితే ఇకపై జరిమానా వసూలు
- గత కొన్ని రోజుల నుంచి రూ.52 వేలకు పైగా వసూళ్లు



భారీ శబ్దం కల్గించే బైక్‌ల పొగగొట్టాలను తొలగింపజేస్తున్న ట్రాఫిక్ పోలీస్



ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

సాక్షి,బళ్లారి: నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పాటు వాహనాలను ఎక్కడబడితే అక్కడ ఆపేసి వెళ్లిపోతుండటంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారి సూచనలతో ట్రాఫిక్ సీఐ అమరేగౌడ పాటిల్ ట్రాఫిక్ నియంత్రణకు సరికొత్త చర్యలు చేపడుతూ సత్ఫలితాలను సాధిస్తున్నారు. సాధారణంగా ట్రాఫిక్ పోలీసుల చేతిలో విజిల్ ఉండేది. ప్రస్తుతం పలువురు ట్రాఫిక్ పోలీసుల చేతికి విజిల్‌కు బదులుగా మైక్‌లు ఇస్తూ ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నారు. నగరంలో ప్రధాన వీధులైన రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు, మోతీ సర్కిల్, ఎస్పీ సర్కిల్, మీనాక్షి సర్కిల్ తదితర ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను పలువురు ఎక్కడబడితే అక్కడ ఆపి ట్రాఫిక్ సమస్యను సృష్టించేవారు. పోలీసులు విజిల్ వేసే లోపు సదరు వాహన యజమాని దూరం వెళ్లిపోయేవారు. ఇక అలా జరగకుండా దూరం నుంచి గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు మైక్ ద్వారా వాహనం రోడ్డు మీద వదలవద్దు అంటూ గట్టిగా మైక్‌లో హెచ్చరిస్తుండటంతో జనంలో భయం పుట్టి వాహనాలను రోడ్లలో వదలకుండా దూరంగా వదిలేందుకు ప్రయత్నిస్తున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

అలాగే ఇటీవల 18 ఏళ్ల లోపు వయస్సు బాలురు, బాలికలు కూడా ద్విచక్ర వాహనాలు నడుపుకుంటూ నగరంలో తిరుగుతుండటం పెరిగిపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల నుంచి చిన్న వయస్సు ఉన్న వారు వాహనాలు నడిపితే వాహన యజమానులకు నోటీసులు జారీ చేసి, సీజ్ చేసి ఫైన్ వేస్తున్నారు. రెండు రోజుల నుంచి దాదాపు రూ.55 వేల జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. ఇంకా పలువురు యజమానులకు నోటీసులు జారీ చేశామని, జరిమానా విధించి వాహనాలు వదులుతామన్నారు. అలాగే ప్రజలను ఇబ్బంది పెట్టేలా శబ్దం కలిగించే పొగగొట్టాలు కలిగిన ద్విచక్ర వాహనాలను కూడా గుర్తించి సీజ్ చేస్తున్నామన్నారు.

ఏడు గంటల విద్యుత్ ఇవ్వండి



వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభాకర్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో రైతులకు ఏడు గంటల విద్యుత్‌ను అందజేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్ డిమాండ్ చేశారు. గురువారం జెస్కాం కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. రైతులకు ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి సూచనలివ్వాలన్నారు. రెండు మూడు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. రైతులు భూముల్లో వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరుతూ చీఫ్ ఇంజినీర్ వెంకటేష్ దేశాయికి వినతిపత్రం సమర్పించారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని జై కన్నడ రక్షణా వేదిక డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు శరణప్ప మాట్లాడారు. ఆశాపూర్ రహదారిలోని బుడ్డి బాబా దర్గా వద్ద నివాసమున్న పేదలకు సర్వే నంబర్–1458లో పట్టాలు పంపిణీ చేసి వారి నివాసాలకు అవకాశం కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

యథేచ్ఛగా జలచౌర్యం

- తుంగభద్ర ఎడమ కాలువకు అక్రమ నీటి పైపులు
- చివరి ఆయకట్టు భూములకు అందని సాగునీరు



జలచౌర్యానికి వీలుగా కాలువకు వేసిన అక్రమ పైపులు



నీటి కోసం కాలువపై రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ కింద 55వ డిస్ట్రిబ్యూటరీ ఆయకట్టు చివరి భూములకు నీరందక పోవడానికి పైభాగంలో కాలువకు నేరుగా అక్రమంగా పైపులు వేసుకొని నీటిని చౌర్యం చేస్తుండడమే కారణం. గురువారం జిల్లాలోని మస్కి తాలూకా రహమత్నాళ వద్ద రైతులు వేసుకున్న నీటి పైపులను తొలగించడానికి వెళ్లిన అధికారులు, ఇంజినీర్లను రైతులు అడ్డుకున్నారు. 89, 90, 92, 93, 94, 95వ మైలు డిస్ట్రిబ్యూటరీల వద్ద నీటి గేజ్‌ను సక్రమంగా చేపట్టడానికి వెళ్లిన ఇంజినీర్లను రైతులు అడ్డుకొని పైపులు తొలగించరాదంటూ అడ్డుపడ్డారు. దీంతో పోలీస్, రెవిన్యూ, నీటిపారుదల, జెస్కాం అధికారులకు చుక్కెదురైంది. తుంగభద్ర ఎడమ కాలువపై వడ్డరహట్టి డివిజన్‌లో రైతులు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కొప్పళ జిల్లాలో యథేచ్ఛగా, అక్రమంగా నీటిని వాడుకుంటుడడంతో రాయచూరు జిల్లాలో చివరి ఆయకట్టు భూములకు నీరందడం గగనమైంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సింధనూరు దాటి కనకగిరి, కారటిగి ప్రాంతాలకు వెళ్లి నీటి నిర్వహణ విషయంపై చర్చించిన సందర్భాలు లేవు. దీంతో రాయచూరు జిల్లాలో తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించడం కష్టసాధ్యంగా మారింది. రాయచూరు, కొప్పళ జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాధికారులు, ఎస్పీలు, నీటిపారుదల శాఖాధికారులు సమావేశమై సమస్యలను పరిష్కరించడానికి తగిన మార్గాలను అనుసరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

జనతా దర్శన్‌తో ప్రజల వద్దకు పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లే కార్యక్రమాన్ని నగరంలో ప్రథమంగా ప్రారంభించామని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం నగరసభ కార్యాలయం ఆవరణలో జనతా దర్శన్ కార్యక్రమాన్ని జిల్లాధికారితో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. తాలూకాలోని ప్రతి డివిజన్‌లో 15 రోజులకు ఒకసారి జనతా దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పిస్తే ఆయా శాఖల అధికారులు వెంటనే వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపుతారన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటల నుంచి తమ సమస్యలపై జిల్లాధికారి నళీన్ అతుల్ అర్జీలను స్వీకరించడం శ్లాఘనీయం అని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొత్తం 372 అర్జీలను ప్రజలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యశోద, అదనపు జిల్లాధికారి సావిత్రి కడే, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నం పాండే తదితర అధికారులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో ఔషధాల కోసం రోగుల పాట్లు

హుబ్లీ: ఉత్తర కర్ణాటకలోని వివిధ జిల్లాల ఆరోగ్య ప్రదాయిని కిమ్స్ ఆస్పత్రిలో ఔషధాల కోసం రోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఉన్న కౌంటర్లలో రోగులకు అనుకూలంగా మందులు పంపిణీ జరగడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో శుక్రవారం కౌంటర్ల ముందు పేద రోగులు, వారి సహాయకులు బారులు తీరి ఉండటం కనిపించింది. సంబంధిత వైద్యులు రాసిచ్చిన మందుల చీటి పట్టుకొని రెండు గంటల పాటు క్యూలలో నిలబడటం రోగులకు కష్టతరంగా మారింది. జనం రద్దీతో కూడి ఉండటంతో వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని క్యూలలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని దళిత విమోచన సమితి నేత శ్రీధర్ కందగల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన సంబంధిత వైద్యాధికారులను కోరారు. కాగా ఈ విషయమై కిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ కిమ్స్‌లో ఔషధాలు, సిబ్బంది కొరత లేదు. అయినా నానాటికీ వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. గదగ్, హావేరి, కొప్పళ, బాగలకోటె తదితర జిల్లాల నుంచి రోగులు కిమ్స్‌కు వస్తున్నారన్నారు. ఇందుకోసం 8 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. నిత్యం ప్రతి కౌంటర్లలో 500 కేసులు నమోదు అవుతున్నాయన్నారు. ప్రతి రోజూ 4 వేల మంది బయటి రోగులు(ఓపీ) చీటీలు నమోదు అవుతున్నాయన్నారు. ఎక్కువగా రోగులు రావడం వల్ల ఈ సమస్య ఏర్పడుతోందని, దీనిపై దృష్టి సారిస్తామన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పేదల వెంపర్లాట



ప్రభుత్వ స్థలంలో హద్దులను గుర్తిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: గూడు లేని పేదలు ఇళ్ల స్థలాల కోసం వెంపర్లాడిన ఘటన బుధవారం నగరంలోని చంద్రబండ రోడ్డులోని పాత ఆశ్రయ కాలనీలో చోటు చేసుకుంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకోవడానికి కార్మికులు, పేదలు మూకుమ్మడిగా పరుగులు తీశారు. మాజీ నగరసభ సభ్యులు, ప్రజాప్రతినిధులు మౌఖికంగా గుడిసెలు వేసుకోమని చెప్పడంతో పాత ఆశ్రయ కాలనీలో వందలాది మంది కట్టెలు పాతడానికి, కంచెలు వేయడానికి ముందుకు వచ్చారు. తమకు ఇళ్లు కావాలని నాలుగేళ్ల క్రితం ప్రజలు దరఖాస్తు చేసుకున్నా నగరసభ అధికారులు అప్పట్లో మౌనం దాల్చారు. హమాలీలు, మాజీ నగరసభ సభ్యులు డబ్బులు తీసుకొని ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి, గుడిసెలు వేసుకోవడానికి అనుమతిచ్చారనే ఆరోపణలున్నాయి. ఇదే అదునుగా భావించి ప్రజలు ప్రభుత్వ స్థలంలో హద్దులను ఏర్పరచుకోడానికి ముందుకు రావడంతో నగరసభ అధికారులు, పోలీసులు అవాక్కయ్యారు.

ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.రూ.2.64 లక్షల నగదు, మొబైళ్లు సీజ్

హుబ్లీ: క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన సీసీబీ పోలీసులు వారి నుంచి రూ.2.64 లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని భవానీ నగరకు చెందిన నవీన్ గణపతి జిటోరి, శాంతినగరకు చెందిన మహమ్మద్ యరగట్టి, వికాస్ నగరకు చెందిన పవన ఇరకల్ నిందితులు. ఈ ముగ్గురు నగరంలోని దాసప్ప సర్కిల్ దగ్గర ప్రపంచకప్ క్రికెట్ వేళ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2.39 లక్షల నగదు, రూ.25 వేల విలువ చేసే వివిధ కంపెనీల మొబైల్‌లు మొత్తం కలిపి రూ.2.64 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కమరిపేటె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా జంట నగరాల్లో ఎటువంటి జూదాలను, ఇతర అక్రమ కార్యకలాపాలను ఉక్కు పాదంతో అణిచి వేస్తామని జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ తెలిపారు.

సాంకేతిక పద్ధతుల్లో సేద్యం లాభదాయకం



మాట్లాడుతున్న కేసీ మంజునాథ్

శ్రీనివాసపురం: రైతులు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసీ మంజునాథ్ తెలిపారు. గురువారం తాలూకాలోని దొడ్డ బందార్లహళ్లి గ్రామంలో నిర్వహించిన రైతులకు ఒకరోజు సదస్సులో పాల్గొని మాట్లాడారు. విశేషంగా రైతులు వనరులను సద్వినియోగపరిస్తే వ్యవసాయ భూమి సారవంతాన్ని పెంచవచ్చన్నారు. వ్యవసాయ యంత్రపరికరాలకు ప్రభుత్వం నుంచి లభించే నిధులపై , జలానయన, కిసాన్ కార్యక్రమాలు, ప్రభుత్వ వివిధ పథకాల గురించి రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. జీపీ సభ్యుడు రమణారెడ్డి, మునియప్ప, రవణప్ప, జయరామరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శిల్ప, అగ్రికల్చర్ సూపర్ వైజర్ రమేష్ పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల సంచారంతో హడల్

హొసపేటె: జిల్లాలోని ప్రధాన పర్యాటక కేంద్రమైన తుంగభద్ర డ్యాంలో గత రెండు రోజుల నుంచి ఎలుగుబంట్ల బెడద మొదలైంది. తెల్లవారు జామున కూడా జాంబవ ప్రత్యక్షమై భద్రతా సిబ్బందిలో ఆందోళన రేకెత్తించింది. తుంగభద్ర డ్యాం వైకుంఠ అతిథి గృహం, ఎస్‌డీఓ కార్యాలయం, ఉద్యానవన ప్రాంతానికి వెళ్లే మార్గంలో వరుసగా రెండు రోజులుగా అర్ధరాత్రి ఎలుగుబంటి సంచరిస్తోంది. బుధవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో డ్యాం ప్రధాన ద్వారం నుంచి వైకుంఠ అతిథిగృహానికి వెళ్లే మార్గంలో ఎలుగుబంటి కనిపించింది. దీంతో కుక్కలు పెద్దగా అరవడం ప్రారంభించాయి. విధుల్లో ఉన్న కేఎస్ఐఎస్ఎఫ్ కానిస్టేబుల్, ఎస్ఐఎస్ సెక్యూరిటీ సిబ్బంది ఎలుగుబంటిని గమనించారు. అది తమ వైపు వస్తూ ఉండటం చూసి పరుగెత్తారు. కాసేపటి తర్వాత ఎలుగుబంటి దాడి నుంచి తప్పించుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన గురువారం ఉదయం పార్కు సమీపంలో సంభవించింది.

కోలారు వార్తలు...

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా



హూడి విజయకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాలూరు: తాలూకా ప్రజల విశ్వాసానికి తాను సదా రుణపడి ఉంటానని, తాలూకాలో సేవా కార్యక్రమాలను ఇలాగే కొనసాగిస్తానని సంజీవిని ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు హూడి విజయకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో ప్రజల నుంచి సన్మానం స్వీకరించి ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా తాలూకాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో ప్రజల కష్టాలపై స్పందించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. మందులు, ఆహార ధాన్యాలు, కూరగాయలు ప్రజలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. తాను ఎన్నికల్లో ఓటమి పాలైనా సేవా కార్యక్రమాలు మాత్రం యథావిధిగా కొనసాగిస్తానన్నారు.

అభివృద్ధికి అందరి సహకారం అవసరం

కోలారు: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అందరి సహకారం అవసరమని జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పీడీఓలు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల సన్మాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను సద్వినియోగం చేయడం ద్వారా గ్రామాభివృద్ధి చేయాలనేది ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీజీపీ ప్రణబ్ మొహంతి మాట్లాడుతూ జీపీలు అభివృద్ధి చెందితే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందినట్లేనన్నారు. గ్రామాభివృద్ధిపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అక్రం పాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పావగడ: తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరిహరపురకు చెందిన ఈరణ్ణ(43) అనే వ్యక్తి గొడనకెరె సమీపంలోని కానుగ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం వెలుగు చూసింది. మృతునికి భార్య కరియమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే ఈరణ్ణ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటనపై అరసికెరె ఎస్ఐ ధారాసింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఉపాధి హామీలో అక్రమాలపై నిరసన



ధర్నా చేస్తున్న యువ వేదిక కార్యకర్తలు

కేజీఎఫ్: తాలూకాలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలను ఖండిస్తూ అంబేడ్కర్ యువ వేదిక కార్యకర్తలు గురువారం నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ జీపీల్లో జాబ్ కార్డుల పేరుతో పీడీఓలు లక్షలాది రూపాయలను బిల్లులు చేసుకుని నిధులను స్వాహా చేశారని ఆరోపించారు. వెంగసంద్ర జీపీలోని గోపేనహళ్లిలో రాజ కాలువ అభివృద్ధి పేరుతో బిల్లులు చేసుకుని ఎలాంటి పనులు చేయలేదన్నారు. గ్రామానికి చెందిన గణేశప్ప అనే వ్యక్తి పొలంలో పనులు చేసినట్లు చూపించినా అతనికి ఎలాంటి భూమి లేదన్నారు. వెంగసంద్ర పీడీఓ చేసిన అక్రమాలకు ఇదే నిదర్శనమన్నారు. తాలూకాలోని అన్ని జీపీల్లోనూ పీడీఓలు నకిలీ బిల్లులను సృష్టించి లక్షలాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధులను కూడా దుర్వినియోగ పరిచారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు.

సమాజ అభివృద్ధికి శ్రమించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విశ్వకర్మ సముదాయ ప్రముఖులు రాజకీయాలు పక్కనబెట్టి సముదాయ ప్రజలకు రుణాలు ఇప్పించి సముదాయ అభివృద్ధికి శ్రమించి నిజమైన నాయకులుగా ఎదగాలని ఎంపీ ఎస్.మునిస్వామి తెలిపారు. ఆయన గురువారం టి.చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన భగవాన్ విశ్వకర్మ జయంతిలో పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం విశ్వకర్మ పథకం కింద రూ.13,600 కోట్లను విడుదల చేశారన్నారు. సముదాయ ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ విశ్వకర్మ సముదాయానికి చెందిన కేపీ నంజుండిని ఎమ్మెల్సీని చేయడం ద్వారా సముదాయానికి న్యాయం చేసిందన్నారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు మాట్లాడుతూ కాళికాంబ ఆలయానికి దేవదాయ శాఖతో చర్చించి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. విశ్వకర్మ సముదాయ క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కేవీ జగదీశ్వరాచారి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివణ్ణ పాల్గొన్నారు.

అవినీతి పాలనను ఖండిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

కోలారు: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలు, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ బీజేపీ నాయకులు నగరంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఎంపీ ఎస్.మునిస్వామి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంపై 40 శాతం కమీషన్ ప్రభుత్వమని ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు అదే కాంట్రాక్టర్ల నుంచి 80 శాతం కమీషన్లను గుంజి అవినీతి అక్రమాల్లో పరాకాష్టకు చేరారన్నారు. కాంట్రాక్టర్ల ఇళ్లలో వందల కోట్ల డబ్బులు లభించడమే కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు నిదర్శనమన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేయడానికే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు కూడబెడుతోందని ఆరోపించారు. ధర్నాలో మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, కె చంద్రారెడ్డి, ఎస్‌బీ మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ సవారీ, యోగాసనాలు

- ఆకట్టుకున్న దసరా సంబరాలు



యోగాసనాలను ప్రదర్శిస్తున్న బాలికలు

మైసూరు: దసరా ఉత్సవాల్లో గురువారం నగరంలో ట్రిన్, ట్రిన్ సైకిల్ సవారీ, యోగా పోటీలు, చిత్రలేఖనం, బాలల కళా ప్రదర్శనలు అలరించాయి. సైకిల్ తొక్కుతూ నగరవాసులు, పర్యాటకులు ప్రముఖ భవనాలను వీక్షించారు. యోగాసనాల పోటీల్లో బాల బాలికలు ప్రతిభతో ముగ్ధుల్ని చేశారు. కళా మందిరం ఆవరణలో వస్తు ప్రదర్శన నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులైన కళాకారులు సంగీత కచేరీ ప్రశంసలు అందుకుంది. కళాశ్రీ విద్యా రవిశంకర్ బృందం వారి నృత్యాలు, గాన ప్రదర్శన అబ్బురపరచింది.



చిత్రలేఖనాన్ని గీస్తున్న దృశ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

క్లుప్తంగా

బోరు తవ్వకానికి పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హోసకోటె పట్టణంలో ప్రజల తాగునీటి సౌకర్యం కోసం నగరసభ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ మండపం వెనుక భాగంలో బోరుబావి తవ్వకానికి స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బి.వి.భైరగౌడ, నగరసభ కమిషనర్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై శవం

గౌరిబిదనూరు: నగర సమీపంలోని నాగప్పా బ్లాక్ వద్ద రైలు పట్టాలపై యువకుడి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు నీలిరంగు టీషర్టు, చెక్స్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే వివరాలకు దొడ్డబళ్లాపురం రైల్వే పోలీసులు, లేదా యశ్వంతపుర పోలీసులను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న కావేరి నిరసనలు



బొరుగులు తింటూ నిరసన

మండ్య: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వెంటనే నిలిపివేయాలని మండ్య జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం రైతులు, రైతు నాయకులు ధర్నాలో పాల్గొని మరమరాలు తింటూ ఆందోళనలు కొనసాగించారు. నగరంలోని సర్ ఎం. వి విగ్రహం వద్ద జిల్లా రైతు హితరక్షణ సమితి చేపట్టిన ధర్నా ప్రాంతానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాగచంద్రికాదేవిగా మారమ్మ



మారమ్మ దేవికి అలంకరణ

బొమ్మనహళ్లి: నవరాత్రుల సందర్భంగా హెచ్ఎస్ఆర్‌లేఔట్ పరంగిపాళ్యలో గ్రామ దేవత మారమ్మదేవిని శ్రీనాగచంద్రికాదేవిగా అలంకరించారు. అర్చకులు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం, పూజలు నిర్వహించారు. అలాగే అగర గ్రామంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామివారు భక్తులకు శ్రీకృష్ణుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అనంతపురం చంద్రమౌళి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

21 నుంచి తుమకూరు దసరా



మాట్లాడుతున్న నిర్వాహకులు

తుమకూరు: తుమకూరు దసరా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ కార్యాధ్యక్షుడు డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నాడహబ్బ దసరా సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బనశంకరి సన్నిధిలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీ విజేతలతో బసవరాజ్, ఈఓ లక్ష్మీ తదితరులు


బనశంకరి: శరన్నరాత్రులు సందర్భంగా బనశంకరి సన్నిధిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి బనశంకరీ సన్నిధిలో విదుషి మైసూరు ఎల్.లీతా బృందంచే వీణావాదన కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. రంగోళి పోటీల్లో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగోళి పోటీలలో విజేతలైన లక్ష్మీరంగనాథ్, మాలా గోవిందరాజ్, మంజుల తదితరులకు ఆలయ వ్యవస్థాపకులు బసవరాజ్, ఈఓ లక్ష్మీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సమితి పదాధికారులు రవికుమార్, దీపామంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరుకు మెట్రో రైలు ఎన్నడు?

- బెంగళూరు నుంచి శివార్ల వరకు పథకం
- ఆపై సర్వేను దాటని కలల ప్రాజెక్టు



హోసూరుకు చేరువలో నిలిచిపోయిన మెట్రో ప్రాజెక్టు



బెంగళూరు శివార్ల నుంచి హోసూరుకు మెట్రో మార్గం మ్యాప్



ఐటీ సిటీ- హోసూరు మధ్య విపరీతమైన ట్రాఫిక్ రద్దీ

హోసూరు: బెంగళూరు నుంచి బొమ్మసంద్ర వరకు ఏర్పాటైన మెట్రో రైలు సేవలు హోసూరు వరకు పొడిగించాలన్నది ఇరు ప్రాంతాల వాసుల కోరిక. తమిళనాడు నుంచి బెంగళూరుకు ఉద్యోగ, వ్యాపార, విద్య, వైద్య సేవల కోసం రోజూ వేలాది మంది వెళ్లి వస్తుంటారు. బెంగళూరు చందాపుర నుంచి హోసూరు వైపు జాతీయ రహదారిపై విపరీతమైన ట్రాఫిక్ ఉండడం వల్ల గంటల తరబడి ప్రయాణం సాగుతుంది. బొమ్మసంద్ర నుంచి అత్తిపల్లి వరకు మెట్రో సేవలు కొనసాగించేందుకు కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్కడి నుంచి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న హోసూరు వరకు మెట్రో సేవలు కొనసాగించాలని, క్రిష్ణగిరి కాంగ్రెస్ ఎంపీ సెల్లకుమార్, బీజేపీ మాజీ ఎంపీ నరసింహన్, కర్ణాటక, కేంద్ర ప్రభుత్వాలను కోరారు. ఇందుకు అంగీకారం తెలిపాయి.

పట్టాలెక్కని పనులు

ఈ నేపథ్యంలో మెట్రో పథకం సర్వే కోసం చెన్నై మెట్రో సంస్థ రూ. 75 లక్షల నిధులను మంజూరు చేసింది. మెట్రో రైల్ రోడ్డు ఏర్పాటుకు 11 సంస్థలు సంసిద్ధత తెలిపాయి. ఈ సంస్థల్లో ఒక్క సంస్థను ఎంపిక చేసి నిర్మాణానికి అనుమతిస్తారని ప్రచారం సాగుతోందే తప్ప పనులు మొదలైంది లేదు. త్వరగా పథకం పనులు చేపట్టాలని హోసూరు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మెట్రో ఏర్పాటైతే నిమిషాల్లో ఇరుప్రాంతాల వాసులు గమ్యస్థానం చేరుకోవచ్చని చెప్పారు.

రోజూ ఇదే తతంగం సార్!

- ఎమ్మెల్యే సుబ్బారెడ్డితో వాపోయిన ఆర్టీసీ డ్రైవర్



తన కారులో నుంచి బస్సును గమనిస్తున్న ఎమ్మెల్యే

బాగేపల్లి: ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు నిర్వహణ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అవి ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోవడం సహజమే. గురువారం ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యే తన కారులో వస్తూ నిలిచిపోయిన ఆర్టీసీ బస్సును గమనించి అవాక్కయ్యారు. బాగేపల్లి తాలూకా పాతపాళ్య రోడ్డులో ఉదయం ఎమ్మెల్యే కారులో వస్తుండగా ఓ ఆర్టీసీ బస్సును ప్రయాణికులు తోస్తూ కనిపించారు. వెంటనే ఎమ్మెల్యే కారు దిగి బస్సు డ్రైవర్‌ను పిలిపించి మాట్లాడారు. బస్సుకు రంగులు వేసి కొత్తగా ఉన్నా ఇంజిన్‌లో పసలేదని డ్రైవర్ ఎమ్మెల్యే ఎదుట వాపోయాడు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. దీంతో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ త్వరలో డిపోకు వచ్చి బస్సుల పరిస్థితిలపై చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మడ్‌హైప్ పబ్‌లో నిబంధనలు ఉల్లంఘన

- ఘటన స్థలాన్ని పరిశీలించిన హోం మంత్రి



ఘటనా స్థలాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడుతున్న హోం మంత్రి పరమేశ్వర్

బనశంకరి: కోరమంగలలోని మెడ్‌హైప్ పబ్-కెఫెలో నిబంధనలు ఉల్లంఘించి హుక్కాబార్ నిర్వహిస్తున్నట్లు తేలిందని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. పబ్‌లో బుధవారం భారీ అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెల్సిందే. గురువారం ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మెడ్‌హైప్‌కు హోటల్ నిర్వహించడానికి మాత్రమే అవకాశం ఉందని, అయితే అక్కడ నిబంధనలు ఉల్లంలఘించి హుక్కాబార్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇక్కడ బీబీఎంపీ నిర్లక్ష్యంగా కూడా ఉందని, నిబంధనలు ఉల్లంఘించి హుక్కాబార్ నిర్వహిస్తున్నా పట్టించుకోలేదని, ఈ విషయంలో అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సిలిండర్లు పేలినా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. ఓ వ్యక్తి భవనంపై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారని అన్నారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉందన్నారు.

నరేగా పథకంపై ఇంటింటా ప్రచారం



మండ్య: మండ్య తాలూకా పంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో 2023-24 ఏడాదికి సంబంధించి 46 గ్రామ పంచాయతీల పరిధిలో నరెగా నడిగె సుస్థిరం వైపు అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తాలూకా పంచాయతీ ఈఓ వీణా తెలిపారు. గురువారం మండ్య తాలూకాలో 46 గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. టీపీ సీఈఓ తదితరులు మాట్లాడారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీరంగ పట్టణంలో వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి జానపద, సాంస్కృతిక కళాబృందాలు సభికులను విశేషంగా అలరించాయి. వేడుకలను మంత్రి కృష్ణబైరేగౌడ ప్రారంభించారు. వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రుల పూజలు



స్వామి వారికి విశేష అలంకరణ

చింతామణి: శరన్నవరాత్రుల సందర్భంగా తాలూకాలోని పలు ఆలయాల్లో మూల విరాట్లకు విశేష పూజలు, అలంకరణ చేశారు. పట్టణంలోని దొడ్డపేటలో వెలసిన కన్యకపరమేశ్వరి అమ్మవారికి కామాక్షి అలంకరణ, నారసింహపేటలో వెలసిన గంగాభవని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అదే విధంగా తాలూకాలోని కోటగల్ గ్రామంలో వెలసిన శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వాముల వారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శనం చేసుకున్నారు.

క్రీడా మైదానం నిర్వహణ చూసుకోండి

తుమకూరు: స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన నగరంలోని మహాత్మగాంధీ క్రీడా మైదానం నిర్వహణను క్రీడా, యువ సబలీకరణ శాఖ చూసుకోవాలని జిల్లా అధికారి కే శ్రీనివాస్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మైదానం పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రూ. కోటి వ్యయంతో మైదానం అభివృద్ధి చేశామని చెప్పారు.

ఉచిత వైద్య పరీక్షలు

పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ మరియప్ప అన్నారు. గురువారం బెంగళూరు నగరంలోని స్పర్శ ఆస్పత్రి, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. నగరంలోని మహాత్మ గాంధీ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా స్పర్శ ఫౌండేషన్, వివేకాంద స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

తాగునీటి ఫిల్టర్ ప్రారంభం

తుమకూరు నగరంలోని వీవీ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే జ్యోతి గణేశ్ తాగునీటి ఫిల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పావగడ రామకృష్ణ ఆశ్రమానికి చెందిన డాక్టర్. జపానంద స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు పండగే





మైసూరు: విశ్వ విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలు వీధి వ్యాపారులకు మంచి ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. బెలూన్లు, బంతులు, బొమ్మలు, మిఠాయిలు, ఇతర అలంకరణ వస్తువులు విక్రయిస్తూ ఎంతో మంది వీధి వ్యాపారులు ఒకింత ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.. పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో వీరి వాప్యారం జోరుగా సాగుతోంది.

శోభాయమానంగా శరన్నవరాత్రి వేడుకలు



శ్రీదొడ్డమ్మ దేవి



శ్రీదుర్గా పరమేశ్వరికి శాకంబరి అలంకరణ



శారదా దేవికి వైష్ణవి అలంకరణ



మొక్కజొన్నల అలంకారం

బొమ్మనహళ్లి: శరన్నవ రాత్రి వేడుకలు పురస్కరించుకుని నగరంలోని బొమ్మనహళ్లి పరిధి ఇబ్బలూరులో గ్రామ దేవత దొడ్డమ్మ దేవికి బుధవారం రాత్రి కుంకుమ అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

బొమ్మనహళ్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా బొమ్మనహళ్లి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ అగర గ్రామంలో వెలసిన శక్తి దేవత శ్రీదుర్గా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు శాకంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మూల విగ్రహాలకు విశేష అలంకరణ

గౌరిబిదనూరు: నగరంలోని వివిధ ఆలయాల్లో మూల విగ్రహాలకు శరన్నవ రాత్రుల సందర్భంగా విశేష అలంకరణలు, పూజలు చేశారు. శారదా మందిరంలో హిందూపురానికి చెందిన గతిస్తం సంస్థ విద్యార్థులు విద్యాధరి, వాగ్మిల అన్నమయ్య భక్తి గీతాలను ఆలపించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

గౌరిబిదనూరు: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని గౌరీవల్లభేశ్వరుడికి బుధవారం రాత్రి మొక్కజొన్నల అలంకరణ చేశారు. అర్చకులు నాగేంద్ర శర్మ,చంద్రు, అనంతు, నాగరాజు విశేష పూజలు చేశారు.

హోసూరు వార్తలు..

మహిళ చైన్ స్నాచింగ్

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి సమీపంలో ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు దుండగుడు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కల్లావి సమీపంలోని కోళినాయకన పట్టి గ్రామానికి చెందిన శ్రీధర్ భార్య శ్రుతి (26) గురువారం మధ్యాహ్నం స్కూటర్‌పై పొలానికి వెళ్తోంది. వెనుక నుంచి ఆమెను వెంబడిస్తూ వెళ్లిన ఇద్దరు గుర్తు తెలియని 5 పౌన్ల గొలుసును తెంచుకెళ్లారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కల్లావి పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

క్రిష్ణగిరి మద్య నిషేధ శాఖ ఇన్‌స్పెక్టర్ శివలింగం నేతృత్వంలో పోలీసులు బుధవారం రాత్రి కావేరిపట్టణం ప్రాంతంలో తనిఖీలు చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. అదే ప్రాంతానికి చెందిన తిమ్మరాయన్, కార్తీక్, మాదేష్ అని తెలిసింది. అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 75 బాటిళ్లను స్వాధీనపరుచుకొన్నారు.

రైతు పథకాలచే లబ్ధి పొందాలి

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో గ్రామీణ సంయుక్త వ్యవసాయాభివృద్ధి పనులను ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్ ఇమానువేల్ పరిశీలించారు. బర్గూర సమితి బాలేతోటం ప్రాంతంలో మెట్ట భూములను పరిశీలించారు. ఉచిత బిందు సేద్య ఉపకరణాలు, మొక్కల పంపిణీ, రాయితీ ధరలతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ ఉపకరణాలు, పంటల బీమా పథకం తదితర పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన శాఖ డైరెక్టర్ భూపతి, శరవణన్, ఆర్ముగం, శివశంకరి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వాసులు మంగళూరులో ఆత్మహత్య ?

యశవంతపుర: మంగళూరు పణంబూరు సముద్ర తీరంలో బెంగళూరుకు చెందిన మహిళతో పాటు పురుషుడు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వీరిని లక్ష్మీ (43), బోరలింగయ్య (50)లుగా గుర్తించారు. వీరు ఇంటిలో చెప్పకుండా బుధవారం మంగళూరు వచ్చారు. ఏమి జరిగిందో కాని ఇద్దరి మృతదేహాలు గురువారం ఉదయం ఒడ్డుకు చేరాయి. మృతుల మొబైల్ ఫోన్ ఒడ్డున లభించడంతో పణంబూరు పోలీసులు బెంగళూరులోని బంధువులకు సమాచారం అందించారు. ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆకట్టుకున్న సంగీత కచేరి



చింతామణి: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీక్షేత్ర కైవార యోగినారేయణ మఠం ఆవరణంలో గురువారం విదుషి ధన్యశ్రీ కాంచన బృందం సంగీత కచేరిని నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస, కైవారం, త్యాగరాజ కీర్తలను ఆలపించారు.

మహిళ అనుమానాస్పద మృతి

దొడ్డబళ్లాపురం: వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన కనకపుర పట్టణంలోని నిర్వాణేశ్వర కాలనీలో చోటుచేసుకుంది. అయితే మహిళ మృతిపై అనుమానాలు ఉండడంతో పోలీసులు మహిళ ప్రియుడిని అరెస్టు చేసారు. కమలాబాయి (38) ఆత్మహత్య చేసుకోగా ఈమె ప్రియుడు లింగరాజు నాయక్ (47)ను పోలీసులు అరెస్టు చేసారు. ఇద్దరూ ఒక ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. ఇద్దరి మధ్య గొడవ జరిగినట్టు స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బయటపడిన శిలా శాసనం



యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు సోమేశ్వరలో సోమేశ్వర దేవస్థానంలో ఆళుప చక్రవర్తి మొదటి కులశేఖర ఆళుపేంద్ర శాసనాలు బయట పడ్డాయి. కరావళి పురావస్తు శాస్త్రం టి మురుగేశి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయతాకార శిల్పంపై రెండు అకర్షించే చిత్రాలు గుర్తించారు. మొదటి వరుసలో సోమేశ్వర దేవస్థానం సోమప్రభు ఇక్కడ నివాసించారంటూ ఉంది. మొదటి కులశేఖర సోమకుల తిలక, పాండ్య మహరాజాధి రాజ పరమేశ్వర, పరమభట్టారకుడిగా వర్ణించారు. 5, 6 వరుసలో శ్రీ మత్కలసేకరాళ్వర తెలిపే మరణ శాసనం ఉందని మురుగేశి తెలిపారు.

సాయి ఆలయంలో పూజలు



బనశంకరి: యలహంక ఓల్డ్‌టౌన్‌లో శ్రీసాయి నాగరాయణ మందిరంలో శిరిడిసాయిబాబా ఆలయంలో గురువారం పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి రామలింగారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్త అనుశ్రీదేవి, ఆలయ సిబ్బంది మంత్రిని సన్మానించారు.

ఎస్టేట్‌లో పనిమనిషి అదృశ్యం

యశవంతపుర: శాండల్‌వుడ్ నటి రాధికా ఎస్టేట్‌లో పని చేస్తున్న వివాహిత అదృశ్యమయ్యారు. దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకాలో నటి రాధికా ఎస్టేట్ ఉంది. ఈ ఎస్టేట్‌లో కుమటా తాలూకా మాదనగిరికి చెందిన నాగరత్న పనిచేస్తోంది. ఈనెల 13న ఆమె ఆకస్మికంగా కనిపించకుండా పోయారు. బంట్వాళ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సేలం టు బెంగళూరు



సాగుతున్న నాలుగు రోడ్ల నిర్మాణ పనులు



- చకచకా 4 లేన్ల రోడ్డు పనులు

హోసూరు: సేలం నుంచి బెంగళూరు వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నారు. బెంగళూరు నుంచి సేలం వరకు క్రిష్ణగిరి మీదుగా సేలంకి వెళ్లే ఈ రహదారి వల్ల దూరం తగ్గుతుంది. అందులో భాగంగా కేంద్ర రహదారుల శాఖ ఆధ్వర్యంలో ధర్మపురి నుంచి రాయకోట మీదుగా నాలుగు రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రాయకోట నుంచి హోసూరు వరకు 60 శాతం వరకు పూర్తయ్యాయి. సర్వీసు రోడ్డు పనులు జరుగుతున్నాయి. బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం నుంచి దేవనహళ్లి మీదుగా బాగలూరు, పేరండపల్లి, బేళగొండపల్లి, ఆనేకల్ మీదుగా శాటిలైట్ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. పై రెండు రోడ్ల నిర్మాణ పనులు త్వరగా ముగిసినట్లెతై హోసూరు- బెంగళూరు మధ్య ట్రాఫిక్ సమస్య తగ్గిపోతుందని స్థానికులు అన్నారు.

సాంబారులో కారం ఎక్కువైందని దారుణం

- తండ్రిని హతమార్చిన కొడుకు

యశవంతపుర: సాంబారులో కారం ఎక్కువ వేశావని ప్రశ్నించిన తండ్రిని కొడుకు తీవ్ర ఆగ్రహంతో కొట్టి చంపిన ఘటన కొడగు జిల్లా విరాజపేట తాలూకా నాంగాల గ్రామంలో జరిగింది. సీకే చిట్టియప్ప (63)ను ఆయన కొడుకు తమ్మయ్య కర్రతో బాది హత్య చేశాడు. పెద్దకొడుకు, అతడి భార్య 10 రోజుల క్రితం బంధువుల ఇంటికెళ్లారు. అవివాహితుడైన తమ్మయ్య వంట చేశాడు. బుధవారం రాత్రి సాంబారులో ఎక్కువగా కారం వేశావంటూ కొడుకుతో తండ్రి గొడవ పడ్డారు. ఆక్రోశంతో కర్రను తీసుకుని తండ్రి తలపై బాదటంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తమ్మయ్యను అరెస్ట్ చేశారు.

పేలుడులో రైతుకు గాయాలు

గనులను పేలుడుతో రైతు గాయపడిన ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా సేవాపుర గ్రామంలో జరిగింది. గనుల తవ్వకాల కోసం డైనమేట్లు పేలాయి. అదే సమయంలో పొలం వైపు వెళ్తున్న రైతు సిద్దనాయక్‌పై రాళ్లు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మెడికల్ షాప్‌లో చోరీ



చోరీకి పాల్పడుతున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: మెడికల్ షాప్ షెట్టర్ పైకెత్తి లోపల జొరబడ్డ దుండగులు చోరీకి పాల్పడ్డ సంఘటన చెన్నపట్టణలో చోటుచేసుకుంది. చెన్నపట్టణ కోర్టు ముందు ఉన్న భాస్కర్ మెడికల్స్ షాప్‌లో చోరీ జరిగింది. రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు దుండగులు గడారుతో షెట్టర్ పైకెత్తి లోపల ప్రవేశించి చోరీకి పాల్పడ్డ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. కొంత నగదు, కొన్ని వస్తువులు చోరీ అయినట్టు షాప్ యజమాని తెలిపారు. చెన్నపట్టణ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శ్రీకృష్ణావతారంలో ఖాద్రీశుడు



కదిరి టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం రాత్రి ఐదో రోజు ఖాద్రీశుడు శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా పట్టణంలోని వివిధ ఆలయాల్లో మూలవిరాట్లకు విశేష అలంకరణలు చేశారు. చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి గౌరీదేవి అలంకారం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో లలితా దేవి అలంకారం, మరకత మహా లక్ష్మీ ఆలయంలో అమ్మవారికి మీనాక్షిదేవి అలంకారం చేశారు.





సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో మహిళల కేరింతలు



ముఖ్యమంత్రిపై పూల వర్షాన్ని కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న ఎమ్మిగనూరు ప్రజలు

కౌరవులతో పోరాడుతున్నాం

చెట్టు ఎక్కి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తోన్న ప్రజలు



▶ మొదటి పేజీ తరువాయి

మీ అందరి చల్లని దీవెనలను మాత్రమే. మీ అందరికీ ఒకటే చెబుతున్నా.. వారు చెప్పే మోసాలు, అబద్ధాలను నమ్మకండి. ఓటు వేసే ముందు ఒక్కటే ఆలోచించండి. మీ బిడ్డ వల్ల మీ ఇంటికి మంచి జరిగిందా? లేదా? అని ఆలోచించండి. మంచి జరిగిందంటే మీరే మీ బిడ్డకు సైనికుల్లా అండగా ఉండండి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో 'జగనన్న చేదోడు' నాలుగో విడత సాయాన్ని ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. 3.25 లక్షల మంది టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.325.02 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

జీవన యానంలో తోడుగా నిలబడ్డాం..

వెనుకబడిన కులాలు, వర్గాలను వెన్నెముక కులాలుగా మారుస్తామని నా పాదయాత్ర సందర్భంగా మాటిచ్చా. ఈ 52 నెలల పాలనలో నవరత్నాలులోని ప్రతి కార్యక్రమం ద్వారా నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలను, నా నిరుపేద వర్గాలను చేయి పట్టుకుని నడిపించగలిగానని మీ బిడ్డగా సగర్వంగా తలెత్తుకుని చెబుతున్నా. వారి జీవన ప్రయాణంలో తోడుగా నిలబడ్డాం. సొంత దుకాణాలున్న రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు జగనన్న చేదోడు ద్వారా ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం. క్రమం తప్పకుండా వరుసగా నాలుగో ఏడాదీ పథకాన్ని అమలు చేస్తున్నాం. దీనిద్వారా 1.80 లక్షల మంది టైలర్లు, 1.04 లక్షల మంది రజకులు, దాదాపు 40 వేల మందికిపైగా నాయీ బ్రాహ్మణులకు ఈరోజు మేలు జరుగుతోందని సంతోషంగా చెబుతున్నా. చేదోడు ద్వారా ఇవాళ జమ చేస్తున్న నగదుతో కలిపితే ఇప్పటివరకు దాదాపు రూ.1,252 కోట్లు కేవలం ఈ ఒక్క పథకం కోసమే ఖర్చు చేశాం. ఒక్కో పేద కుటుంబానికి రూ.40 వేల చొప్పున మేలు చేయగలిగాం. ఈ 52 నెలల్లో ప్రతీ అడుగు మంచి కోసమే వేశాం. మొత్తంగా రూ.2.38 లక్షల కోట్లను మీ బిడ్డ బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాడు. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష చూపలేదు.

గతంలో ఎవరైనా ఆలోచించారా?

చిన్న షాపులు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న వారంతా బతకలేని పరిస్థితుల్లో ఉంటే ఈ వ్యవస్థలు కుప్పకూలిపోవా? అని అడుగుతున్నా. ఇలాంటి వారి గురించి గతంలో ఎవరైనా ఆలోచించారా? ప్రతీ అడుగులోనూ పేదలకు తోడుగా నిలిచాం. చేదోడు, వాహనమిత్రతో పాటు స్వయం ఉపాధిని ప్రోత్సహించే కార్యక్రమాలతో పేదలకు అండగా ఉన్నాం. ఏటా క్రమం తప్పకుండా సాయం చేస్తున్నాం. ప్రతీ పేద ఇంట్లో నా అక్కచెల్లెమ్మలకు తోడుగా, వారి పిల్లలకు మేనమామలా తోడుగా ఉన్నా.

అప్పుడూ ఇదే బడ్జెట్..

ఈ పథకాలన్నీ ఇంతకుముందు ఎప్పుడైనా విన్నామా? అమలు జరిగాయా? అని అంతా ఆలోచించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తోడుగా నిలిచి వారి అభ్యున్నతికి అడుగులు పడింది మీ బిడ్డ నాలున్నరేళ్ల పాలనలోనే. ఈ ప్రభుత్వం వస్తుంది.. ఇలా పథకాలను ఇవ్వగలుగుతుంది... ఎక్కడా లంచాలు, వివక్ష ఉండదు... ఏ పార్టీకి ఓటేశారని అడగరు.. అర్హత ఉంటే చాలు ఖాతాల్లో డబ్బులు పడతాయని ఎవరైనా అనుకున్నారా? గతంలో ఎప్పుడూ జరగని విధంగా మంచి చేస్తున్నాం. అప్పుడూ ఇప్పుడూ అదే బడ్జెట్.. అదే రాష్ట్రం! మారింది కేవలం ముఖ్యమంత్రి మాత్రమే. అప్పుల పెరుగుదల కూడా అప్పటి కంటే తక్కువే. మరి అప్పుడు ఇవన్నీ ఎందుకు జరగలేదు? ఇప్పుడు మీ బిడ్డ ప్రభుత్వంలోనే ఎందుకు జరుగుతున్నాయి?



జగనన్న చేదోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అని అంతా ఆలోచించాలి. గతానికీ, ఇప్పటికీ తేడా ఒక్కటే. మీ బిడ్డ మంచి మనసుతో బటన్ నొక్కుతున్నాడు. నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళుతున్నాయి. అప్పట్లో గజదొంగల ముఠా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, వీరికి తోడుగా దత్తపుత్రుడు... వీరంతా కలసి దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడమే! అప్పటికీ, ఇప్పటికీ తేడా ఇదీ. అప్పట్లో గజదొంగల ముఠా దోచేసే కార్యక్రమం జరిగింది. ఇప్పుడు మీ బిడ్డ బటన్ నొక్కితే నేరుగా ఖాతాల్లోకి వెళుతున్నాయి.

మాఫీ పేరుతో ముంచేశాడు..

2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు, దత్తపుత్రుడి సంతకాలతో లెటర్లు తీసుకొచ్చారు. టీవీ ఆన్ చేస్తే చంద్రబాబు ముఖం కనిపించేది. వ్యవసాయ రుణాలు మాఫీ కావాలంటే, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం బయటకు రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలని ఊదరగొట్టారు. తీరా చంద్రబాబు సీఎం అయ్యాక రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ, బంగారం సంగతి దేవుడెరుగు అప్పటి వరకూ వస్తున్న సున్నా వడ్డీని కూడా ఎత్తేశాడు. ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు కూడా ఇవ్వని పరిస్థితి. సున్నా వడ్డీ పథకం రద్దయింది. బ్యాంకుల్లోని బంగారాన్ని వేలం వేసే పరిస్థితులు రావడంతో రైతన్న అష్టకష్టాలు పడ్డాడు. అందుకే ఆలోచించాలని అందరినీ అడుగుతున్నా. 2019 మేనిఫెస్టోలో రైతుకు ఏం చెప్పామో అంతకంటే మిన్నగా చేస్తోంది మీ బిడ్డ ప్రభుత్వం. మేనిఫెస్టోను ప్రకటించి ఎన్నికల తర్వాత చంద్రబాబు చెత్త బుట్టలో వేసిన పరిస్థితిని గుర్తు తెచ్చుకోవాలని కోరుతున్నా.

అక్కా.. మీరే చూడండి అంటూ

ఎన్నికల వేళ మీ బిడ్డ ఓ మాట చెప్పాడు. అందులో 99 శాతం హామీలను పూర్తి చేసి మేనిఫెస్టోని ప్రతి గడప వద్దకూ తీసుకెళ్లి 'అక్కా... జగనన్న మీకు ఈ మాట చెప్పాడు! ఆ మాటను నెరవేర్చాడు చూడండి..' అంటూ మీ బిడ్డ ప్రభుత్వం పాలన చేస్తోంది. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల నుంచి రాజధాని భూముల వరకూ, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ నుంచి ఫైబర్ గ్రిడ్ దాకా.. చివరకు మద్యంలోనూ దోచేయడం, పంచుకోవడం, తినుకోవడమే. ఇది మినహా నాడు ఏదీ కనిపించలేదు.

ఆ మోసాలు.. గుర్తున్నాయా?

పొదుపు సంఘాలను మోసం చేస్తూ చంద్రబాబు చెప్పిన మాటలు జ్ఞాపకం ఉన్నాయా? నాడు టీవీల్లో ప్రకటనలు వచ్చేవి! ఓ అక్క, ఓ చెల్లెమ్మను చూపించేవారు. అందులో మంగళసూత్రం లాక్కుని వెళ్లే ఓ చేతిని మరో చెయ్యి పట్టుకుంటుంది. పొదుపు సంఘాల రుణాలు మాఫీ కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అనేవారు. ఆయన సీఎం అయ్యారు కానీ అప్పటివరకూ ఏ, బీ, గ్రేడ్‌లో ఉన్న సంఘాలన్నీ సీ, డీ గ్రేడ్‌కు దిగజారాయి. పొదుపు సంఘాలకు అప్పటివరకూ ఉన్న సున్నా వడ్డీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేశారు. అక్కచెల్లెమ్మలకు ఎన్నో ఇబ్బందులు కల్పించారు. ఆ దుస్థితి నుంచి కాపాడేందుకు మీకు మంచి అన్నయ్య, తమ్ముడు.. మీ బిడ్డ రూపంలో సీఎం స్థానంలోకి వచ్చాడు. వారందరికీ తోడుగా ఉన్నాడు. వైఎస్సార్ ఆసరాం సున్నా వడ్డీ, చేయూతను తోడుగా ఇచ్చాడు. అమ్మ ఒడి ద్వారా ఆదుకున్నాడు. దీంతో ఆ సంఘాలు తిరిగి ఏ, బీ గ్రేడ్‌గా చలామణీ అవుతున్నాయి. ఇప్పుడు అక్కచెల్లెమ్మలు వస్తుంటే బ్యాంకర్లు సెల్యూట్ కొట్టి రుణాలు ఇస్తున్నారు. నాడు 18 శాతం ఉన్న ఎన్‌పీఏలు, అవుట్ స్టాండింగ్ రుణాలు నేడు 0.3 శాతానికి తగ్గాయి. రాష్ట్రమే కాదు దేశం మొత్తం మన పొదుపు సంఘాల వైపు చూస్తోంది.

మనుషులు చనిపోయినా పట్టని బాబు పాలన

గతంలో పింఛన్, రేషన్‌కార్డు లాంటి ఏ పౌర సేవ కావాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తూ చెప్పులు అరిగేలా తిరిగిన రోజులే గుర్తుకొస్తాయి. చంద్రబాబు హయాంలో రైతులకు ఎరువులు, పురుగు మందులు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి క్యూలో నిల్చునేవారు. మనుషులు చనిపోయినా పట్టించుకోని పాలన ఆయనదైతే ఇప్పుడు మీ బిడ్డ పాలనలో అవన్నీ మన గ్రామంలో, మన గడప వద్దకే వలంటీర్లు చిరునవ్వుతో తెచ్చి సంక్షేమ ఫలాలను అందిస్తూ తోడుగా ఉంటున్నారు. అప్పట్లో ఆరోగ్యశ్రీని ఎలా వదిలించుకోవాలనే పాలన సాగింది. రాష్ట్రంలో 108,104 వాహనాలకు కనీసం డీజిల్ ఖర్చులు కూడా ఇవ్వని పరిస్థితి. చంద్రబాబు పాలన పోయింది. మీ బిడ్డ పాలన వచ్చింది. ఈ రోజు రాష్ట్రంలో ఏకంగా 17 కొత్త మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నాం. ఆదోనిలో కూడా మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నాం. ఏకంగా 1,600 కొత్త 108, 104 వాహనాలను కొనుగోలు చేసి పేదవాడికి తోడుగా ఉన్నాం. గతంలో ఆరోగ్యశ్రీ పరిధిలో వెయ్యి ప్రొసీజర్లు మాత్రమే ఉంటే ఈ రోజు 3,300 ప్రొసీజర్లకు విస్తరించాం. రోగులు ఆపరేషన్ అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకునే సమయంలో డాక్టర్ల సిఫారసు మేరకు నెలకు రూ.5 వేల చొప్పున వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా సాయం అందిస్తున్నాం. ఇవాళ ప్రతీ గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తెచ్చాం. వీటికి తోడు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికి వచ్చి జల్లెడ పట్టి వైద్య పరీక్షలు చేసి మందుల నుంచి చికిత్స వరకూ అందిస్తూ చేయి పట్టుకుని నడిపిస్తున్నాం.



మనందరి పాలనలో..

ఏ పేద కుటుంబమైనా, సంప్రదాయ వృత్తుల కుటుంబాలైనా, రైతులు, కూలీలు.. పేదరికంలో ఉన్న వారెవరైనా కోరుకునేది వారికి ఎప్పుడైనా వైద్యం అవసరమైతే మంచి మనసుతో అండగా నిలిచి ఎన్ని లక్షలైనా ఖర్చు చేసే ప్రభుత్వం కావాలనే! ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ, లంచాలు లేకుండా వారి కుటుంబానికి ఇంటి ముందుకొచ్చి చేతికిచ్చిపోయే ప్రభుత్వం రావాలని, కావాలని కోరుకుంటారు. ఇంటి స్థలం, ఇల్లు అవసరాన్ని గుర్తించి వాటిని అందించి, నిర్మించి ఇచ్చే ప్రభుత్వం రావాలని, కావాలని కోరుకుంటారు. నిరుపేద కుటుంబాన్ని శాశ్వతంగా పేదరికం నుంచి బయటపడేసేందుకు తమ పిల్లలను మంచిగా చదివించే మేనమామ స్థానంలో ఉండే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటారు. అవ్వాతాతలను ఆదుకునే పాలకుడు కావాలని కోరుకుంటారు. అక్కచెల్లెమ్మల సాధికారతకు అండగా నిలబడే మంచి అన్నయ్య, తమ్ముడు సీఎంగా కూర్చోవాలని ప్రతీ పేద కుటుంబం కోరుకుంటుంది. ఇలాంటి మార్పులన్నీ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో, ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో కళ్లెదుట కనిపించే విధంగా పాలన అందుబాటులోకి వస్తే అలాంటి పాలనను 'మా పాలన.. మనందరి పాలన.. మా బిడ్డ పాలన.. మా జగనన్న పాలన 'అని అంటారు.

జనవరిలో వైఎస్సార్ ఆసరా.. చేయూత

- నా అక్కచెల్లెమ్మల ముఖంలో సంతోషం చూడాలని నాలుగేళ్లలో వైఎస్సార్ ఆసరా ద్వారా 78,94,194 మందికి రూ.19,178 కోట్లు అందించాం. వచ్చే జనవరిలో మరో రూ.6,500 కోట్లు ఆసరా ద్వారా ఇవ్వనున్నాం.
- పొదుపు సంఘాలు తమ కాళ్లపై నిలబడాలని సున్నా వడ్డీ కింద రూ.4,960 కోట్లు ఇచ్చాం.
- వైఎస్సార్ చేయూత ద్వారా 45–60 ఏళ్లు ఉన్న 26,39,703 మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు అమూల్, ఐటీసీ, రిలయన్స్, హిందుస్థాన్ లీవర్ లాంటి సంస్థలతో వ్యాపార అవకాశాలను కల్పిస్తూ నేరుగా రూ.14,189 కోట్లు అందించాం. చేయూతకు జనవరిలో మరో రూ.5 వేల కోట్లు ఇవ్వనున్నాం.
- వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 3,57,844 మందికి రూ.2,028 కోట్లు అందించాం. ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణాల్లోని 4.40 లక్షల మంది పేదలకు రూ.1,257 కోట్లు సాయం అందజేశాం.
- మత్స్యకార భరోసా ద్వారా 2,43,394 మందికి రూ.538 కోట్లు ఇవ్వగలిగాం.
- వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 82 వేల చేనేత కుటుంబాలకు రూ.982 కోట్లు అందించాం.
- వాహన మిత్ర ద్వారా 275,931 మంది డ్రైవరన్నలకు రూ.1,302 కోట్లు ఇచ్చాం.
- జగనన్న తోడు ద్వారా ఫుట్‌పాత్‌లు, తోపుడుబండ్లపై ఆధారపడే చిరువ్యాపారులకు పెట్టుబడి ఖర్చులకు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున వడ్డీ లేని రుణాలతో 15,87,492 మందికి రూ.2,956 కోట్లు అందజేశాం.

పేద పిల్లలకు నాణ్యమైన చదువులు

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీల పిల్లలు వెళ్లే ప్రభుత్వ స్కూళ్లను తెలుగు మీడియానికే పరిమితం చేసి నారాయణ, చైతన్యలను పెంచి పోషించిన పరిస్థితి చంద్రబాబు హయాంలో ఉంటే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు ద్వారా రూపురేఖలు మార్చి 6 నుంచి పైతరగతులను డిజిటలైజ్ చేశాం. ప్రతి పేద పిల్లాడి చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. బాగా చదువుకోవాలని ప్రోత్సహిస్తూ గోరుముద్ద ద్వారా రోజుకో మెనూ అమలు చేస్తున్నాం. పిల్లలు చిక్కటి చిరునవ్వుతో ఉండాలని విద్యాకానుక కిట్లను ఇస్తున్నాం. బైజూస్ కంటెంట్ తీసుకొచ్చాం. సీబీఎస్‌ఈ సిలబస్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, టోఫెల్ శిక్షణను సర్కారు స్కూళ్లలో అందుబాటులోకి తెచ్చాం. గతంలో పేదవాడి గురించి ఏమాత్రం ఆలోచించిన పరిస్థితి లేదు. అహంకార ధోరణి, పెత్తందారీతనంతో అవమానించారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? బీసీల తోకలు కత్తిరిస్తా..! ఖబడ్దార్ అని చంద్రబాబు హెచ్చరించలేదా? చివరకు అక్కచెల్లెమ్మలను సైతం అవహేళన చేసేలా కోడలు మగ పిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా? అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు రాజధాని నగరం అని పేరు పెట్టుకున్న చోట పేదవాడికి ఇళ్ల స్థలాలిస్తుంటే కులాల మధ్య సమతుల్యత దెబ్బతింటుందంటూ నిస్సిగ్గుగా కోర్టుల్లో కేసులు వేసి ఆయన నైజాన్ని చాటుకున్నారు.

హంద్రీపై వంతెనకు రూ.47 కోట్లు

కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా పత్తికొండ–గోనెగండ్లను కలిపేలా హంద్రీ–నదిపై వంతెన నిర్మాణం కోసం రూ.47 కోట్లను మంజూరు చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. జగనన్న చేదోడు నిధుల విడుదల సందర్భంగా ఎమ్మిగనూరులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుమ్మనూరు జయరాం, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, శ్రీదేవి, హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీలు మధుసూదన్, రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, పోతుల సునీత, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఏకంగా 2.07 లక్షల కొత్త ఉద్యోగాలు

చంద్రబాబు హయాంలో పేదవాడు ఎలా బతుకున్నారో కనీసం ఆలోచించలేదు. ఇల్లు, ఇంటి స్థలం ఉందా? అని ఆలోచించి కనీసం ఒక్క సెంటు ఇచ్చిన పాపాన పోలేదు. మీ బిడ్డ సీఎం అయ్యాక 10, 20 లక్షలు కాదు.. ఏకంగా 31 లక్షల ఇంటి పట్టాలిచ్చాడు. ఒక్కో ఇంట్లో సగటున ముగ్గురు ఉన్నారనుకున్నా ఏకంగా కోటి మందికి మేలు చేసే కార్యక్రమం చేశాం. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయి. వేగంగా పేదల గృహాలను నిర్మిస్తున్నాం. ఈ తేడాను గమనించాలి. చంద్రబాబు హయాంలో ఎంతమంది పేదలకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని అడుగుతున్నా. జాబు రావాలంటే బాబు రావాలి.. అంటూ ప్రకటనలిచ్చారు. జాబు ఇవ్వకపోతే ఇంటింటికీ నెలకు రూ.రెండు వేలు నిరుద్యోగభృతి ఇస్తానని ఊదరగొట్టారు. బాబు సీఎం అయినా భృతి ఇవ్వకుండా పిల్లలను కూడా మోసం చేశాడు. ఆపై మీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే మీ బిడ్డ హయాంలో ఏకంగా 2.07 లక్షల కొత్త ఉద్యోగాలు ఇచ్చాడు. అందులో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే 80 శాతం ఉద్యోగాలిచ్చాం.

అంతా మీ పుణ్యమే అన్నా



గతంలో మా బార్బర్ షాపులో పాత కుర్చీలు ఉండడంతో కస్టమర్లు అంతగా వచ్చేవారు కాదు. జగనన్న చేదోడు ద్వారా ఇప్పటికే మూడు విడతలు ఆర్థిక సాయం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఈ నిధులతో షాపును ఆధునికీకరించుకున్నా. ఇప్పుడు కస్టమర్ల సంఖ్య పెరిగింది. దేవాలయాల పాలక మండళ్లలో సభ్యులుగా చేర్చి మా గౌరవాన్ని పెంచారన్నా. గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా నాయీ బ్రాహ్మణులకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. మీరిచ్చిన గౌరవం, ఆర్థిక సాయంతో నా కుమారుడు ఉన్నత చదువు చదివి డాక్టర్ అయ్యాడు. మరో కుమారుడికి రూ.8 లక్షలు ఖర్చయ్యే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సను వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీద్వారా ఉచితంగా చేయడంతో సమస్య తొలగిపోయి సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. నాకు టిడ్కో ఇల్లు ఇచ్చారు. ఇంటిల్లిపాది సంతోషంగా వున్నామంటే అది మీ పుణ్యమే అన్నా.

– స్వామి చంద్రుడు, నాయీబ్రాహ్మణుడు, కర్నూలు

కుల గణనతో బీసీల భవిష్యత్తుకు భరోసా



జగన్ అంటే జనం కోరుకొనే శక్తి. జనం కోసం ఆలోచించే యుక్తి. కష్టం తప్ప కల్మషం తెలియని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగాలని తపించే వ్యక్తి మన ముఖ్యమంత్రి. అందుకే కులగణన చేపట్టాలనే నిర్ణయం తీసుకున్నారు. కుల వృత్తులకే పరిమితమైన బీసీ బిడ్డలు ఉన్నత చదువులు చదివేందుకు వైఎస్సార్ నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెడితే చంద్రబాబు తన కులపోళ్ల కాలేజీలకు మేలు చేసేందుకు ఆ పథకానికి తూట్లు పొడిచారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బీసీల భవిష్యత్తుకు భరోసా లభించింది.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి

కుప్పంలోనూ ఇళ్లు ఇచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమే

చంద్రబాబు సాగించిన పాలనను చూస్తే కుప్పం ప్రజలు కూడా ఆయన్ను తమవాడు అని చెప్పుకునే పరిస్థితి లేదు. మూడు విడతలుగా 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా అక్కడ పేదవాళ్లకు ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. మీ బిడ్డ ప్రభుత్వం అక్కడ 20 వేల ఇంటి పట్టాలను పేదలకు ఇచ్చింది. ఆ అక్కచెల్లెమ్మలకు ఇంటి పట్టాలివ్వడమే కాకుండా 8 వేల ఇళ్లను కూడా నిర్మిస్తోంది మన ప్రభుత్వమే.




కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 20-10-2023

ఫ్యాషన్

నిన్న.. నేడు.. రేపటి స్టైల్

ఒకరేమో నిన్నటి తరం ఇష్టాలను తెలిసున్నవారు మరొకరు నేటి తరపు ఆసక్తులను ఒంటపట్టించుకున్నవారు ఈ ఇద్దరూ తూరుపు పశ్చిమానికి వారధులుగా ఇండోవెస్టర్న్ డ్రెస్ డిజైన్స్‌తో సినీ స్టార్స్‌ను కూడా ఆకట్టుకుంటున్నారు. హైదరాబాద్ వాసులైన ఈ అత్తాకోడళ్ల పేర్లు శివానీ సింఘానియా, మాన్సీ సింఘానియా. అత్త తన డిజైన్స్‌ని కోడలికి నేర్పిస్తుంటే.. కోడలు నేటి ట్రెండ్‌ని అత్తకు పరిచయం చేస్తుంది. ఇద్దరూ కలిసి ఒకే రంగంలో రాణిస్తూ పాతికమందికి ఉపాధి కల్పిస్తున్నారు.


మాన్సీ, శివాని





డిజైన్స్ తెలుసుకుంటూ..

కోడలు మాన్సీ మాట్లాడుతూ.. 'నేను ఎంబీయే చేశాను. డ్రెస్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవడంలో ఇష్టంతో పాటు ఈ తరం ఎలాంటి మోడల్స్‌ని ఇష్టపడుతుందో తెలుసు. అయితే, ఈ రంగంలోకి వస్తాను అనుకోలేదు. నా పెళ్లికి మా అత్తగారే డిజైనర్. అవి నాకు చాలా బాగా నచ్చాయి. పెళ్లయ్యాక మా అత్తగారు శివానీ దగ్గర డిజైన్స్‌కు సంబంధించి కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటూ వాటి రూపకల్పనలో ఉంటున్నాను. మా కలెక్షన్‌లో బ్రైడల్, కాంటెంపరరీ, వెస్టర్న్, ఇండో–వెస్టర్న్– క్లాసిక్ వేర్‌లలో స్ట్రెయిట్ కట్ ప్యాటర్న్స్, మినిమలిస్ట్ ఎంబ్రాయిడరీ ప్రత్యేకంగా ఉంటాయి. వింటేజ్ స్టైల్స్‌తో పాటు మోడర్న్ డ్రెస్సుల రూపకల్పన మా ప్రత్యేకత' ' అని వివరిస్తుంది మాన్సీ.

సెల్ఫ్ డిజైనర్‌ని..

''నేను చదువుకున్నది ఇంటర్మీడియెట్ వరకు. కానీ ఈ రంగంలో ఉన్న ఆసక్తి నన్ను ఎంతోమందికి పరిచయం చేసింది. ఇంట్లో ఖాళీ సమయాల్లో పెయింట్స్, పెన్సిల్ డ్రాయింగ్ చేసేదాన్ని. కొన్నాళ్లకు ఆ డ్రాయింగ్స్‌ని టైలర్‌కి చూపించి మోడల్ డ్రెస్సులు తయారు చేయమని చెప్పాను. మొదట మా ఇంట్లో అమ్మాయిలకు, బంధువులకు డిజైన్ చేసి ఇస్తూ, ఈ రంగంలోకి వచ్చేశాను. ఆ విధంగా ఫ్యాషన్ డిజైనింగ్‌ని సొంతంగా నేర్చుకున్నాను. నా డిజైన్స్ మామూలు వారి దగ్గర నుంచి టాలీవుడ్, బాలీవుడ్ స్టార్స్ కూడా మెచ్చుకోవడం ఎంతో ఆనందాన్నిస్తుంది. ప్రతి అమ్మాయి మా దుస్తుల్లో ఒక దివ్వెలా వెలిగిపోవాలని ఊహించి తొమ్మిదేళ్ల క్రితం బంజారాహిల్స్‌లో కనక్ పేరుతో డ్రెస్ డిజైన్ స్టూడియో ప్రారంభించాం' అని వివరిస్తారు శివాని.

వ్యక్తిగత శైలి, క్లిష్టమైన డిజైన్స్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ తమ ప్రత్యేకతలు అని చెబుతారు ఈ అత్తాకోడళ్లు. బాలీవుడ్ స్టార్ సోహా ఆలీఖాన్, సోనాక్షి, మోడల్స్, ప్రముఖ గాయకులతో కలిసి తమ క్రియేషన్స్‌తో వేదికలపైన ప్రదర్శించామని వివరించారు.

వంటిల్లు

తియ్యటి వేడుక

దేవీ నవరాత్రుల్లో సెలవులకు ఇంటికొచ్చిన పిల్లలు, బంధువులతో లోగిళ్లన్నీ కళకళలాడుతున్నాయి. ఈసారి దసరా వేడుకలను విభిన్న తీపి రుచులతో మరింత తియ్యగా చేసుకోమని చెబుతోంది ఈ వారం వంటిల్లు...

దెహరోరి



కావలసినవి: బియ్యం – కప్పు; నీళ్లు – పావు కప్పు; పెరుగు – పావు కప్పు; నెయ్యి – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; యాలకుల పొడి – రెండు టీస్పూన్లు; బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరు గంటల పాటు నానబెట్టుకోవాలి • నానిన బియ్యంలో నీటిని తీసేసి సూజీ రవ్వలా బరకగా గ్రైండ్ చేయాలి. గ్రైండ్ చేసేటప్పుడు నీళ్లు అసలు పోయకూడదు • రవ్వలా గ్రైండ్ చేసిన బియ్యంలో పెరుగు వేసి చేతులతో బాగా కలపాలి • చేతులు వేడెక్కిన తరువాత కలపడం ఆపేసి మూతపెట్టి రాత్రంతా ఉంచేయాలి • మరుసటిరోజు పంచదారను గిన్నెలో వేయాలి. పంచదార మునిగేన్ని నీళ్లుపోసి మంట మీద పెట్టాలి • సన్నని మంట మీద సిరప్‌ను తయారు చేయాలి • పాకం తయారైందనుకున్నప్పుడు యాలకుల పొడి వేసి కలిపి, దించేయాలి • ఇప్పుడు బాణలిలో నెయ్యివేసి చక్కగా కాగనివ్వాలి • రాత్రి కలిపి పెట్టుకున్న బియ్యం రవ్వ మిశ్రమాన్ని కుడుముల్లా చేసుకుని నెయ్యిలో డీప్‌ఫ్రై చేయాలి • కుడుము రెండువైపులా లైట్ బ్రౌన్ కలర్‌లోకి మారాక తీసేసి టిష్యూ పేపర్ మీద వేయాలి • ఐదు నిమిషాల తరువాత టిష్యూపేపర్ మీద నుంచి తీసి పంచదార పాకంలో వేయాలి • బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులతో గార్నిష్ చేసి సర్వ్‌చేసుకోవాలి. రిఫ్రిజిరేటర్‌లో పెట్టకపోయినా దెహరోరిలు పదిరోజులపాటు రుచిగా ఉంటాయి .

మండిగే



కావలసినవి: బొంబాయి రవ్వ – రెండు కప్పులు; గోధుమ పిండి – కప్పు; ఉప్పు – చిటికెడు; బెల్లం తరుగు – అరకప్పు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చకర్పూరం – చిటికెడు.

తయారీ: పెద్ద గిన్నెలో బొంబాయి రవ్వ, గోధుమ పిండి, ఉప్పు, టేబుల్ స్పూను నెయ్యివేసి కలపాలి • ఇప్పుడు నీళ్లు చల్లుకుంటూ చపాతీ ముద్దలా చేసుకోవాలి. దీని పైన మూతపెట్టి ఇరవై నిమిషాలు పక్కన పెట్టాలి • బెల్లంలో మిగిలిన నెయ్యి, పచ్చకర్పూరం వేసి, కలిపి పక్కన పెట్టుకోవాలి • 20 నిమిషాల తరువాత పిండిముద్దను ఉండలుగా చుట్టి, చపాతీలా వత్తుకోవాలి • ఇప్పుడు ఒక చపాతీ తీసుకుని,పైన రెండు టీస్పూన్ల బెల్లం మిశ్రమం వేసి చపాతీ అంతా పరచాలి • బెల్లం పరిచిన చపాతీపై మరో చపాతీని వేసి చపాతీకర్రతో ఒకసారి వత్తుకోవాలి • ఇప్పుడు ఈ చపాతీని పెనం మీద వేసి రెండు వైపులా క్రిస్పీగా మారేంత వరకు కాల్చి తీసేయాలి • ఇలా కాలిన మండిగేను రెండు మూడు మడతలు వేసి సర్వ్ చేసుకోవాలి.

లవంగ్ లతిక



కావలసినవి: మైదా – ముప్పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; పంచదార – కప్పు; లవంగాలు – పన్నెండు; నెయ్యి – డీప్‌ఫ్రైకి సరిపడా. స్టఫింగ్ కోసం: కోవా తురుము – ముప్పావు కప్పు; బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులు – అరకప్పు; వేడిపాలు – అరటీస్పూను; కుంకుమ పువ్వు రేకులు – పావు టీస్పూను; పంచదార పొడి – పావు టీస్పూను; యాలకుల పొడి – అరటీస్పూను.


తయారీ: మైదాలో టేబుల్ స్పూను నెయ్యి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలిపి పక్కన పెట్టుకోవాలి • పంచదారలో ఒకటిన్నర కప్పుల నీళ్లుపోసి మీడియం మంట మీద తిప్పుతూ సిరప్ తయారు చేసుకుని పక్కన పెట్టుకోవాలి • స్టఫింగ్ కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి • నానిన పిండిముద్దను ఉండలుగా చుట్టుకోవాలి • ఈ ఉండలను పూరీల్లా వత్తుకుని మధ్యలో రెండు రెండు టీస్పూన్ల స్టఫింగ్‌ను వేయాలి • ఇప్పుడు స్టఫింగ్ బయటకు రాకుండా రెండు పక్కలా పూరీని మూయాలి • పూరీని తిరగేసి తెరచి ఉన్న మరోవైపుని కొద్దిగా తడిచేసి మూసివేయాలి. మడత ఊడిపోకుండా లవంగం గుచ్చాలి •ఇలా అన్ని లతికలను తయారు చేసుకోవాలి • ఇప్పుడు సలసల కాగుతోన్న నెయ్యిలో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేయాలి • చక్కగా వేగిన లతికలను టిష్యూపేపర్ మీద వేసుకోవాలి •వీటిని తినాలనుకున్నప్పుడు పంచదార సిరప్‌ను వేడిచేసి దానిలో లతికలను వేసి పదిహేను నిమిషాలు ఉంచి, ఆ తరువాత సర్వ్ చేయాలి.

పంచతంత్రం

బరిలో డిగ్గీ సొంత సైన్యం!

మధ్యప్రదేశ్ బరిలో దిగ్విజయ్ కుటుంబం నుంచి నలుగురు | కొడుకు, తమ్ముడు, అల్లుళ్లకు టికెట్లు | కాంగ్రెస్ కుటుంబ పాలనకు నిదర్శనం: బీజేపీ

మధ్యప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయాలపై తన పట్టును మాజీ రాజ కుటుంబీకుడు దిగ్విజయ్ సింగ్ మరోసారి నిరూపించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుమారుడు, తమ్ముడు, అల్లుళ్లు... ఇలా ఏకంగా నలుగురికి టికెట్లు దక్కడం విశేషం! దీన్ని కాంగ్రెస్ వ్యక్తి పూజకు, కుటుంబ పాలనకు మరో నిదర్శనంగా ఎప్పట్లాగే బీజేపీ ఎద్దేవా చేస్తుండగా సమర్థులకే అవకాశాలిస్తున్నామంటూ కాంగ్రెస్ సమర్థించుకుంటోంది...


దిగ్విజయ్

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇటీవల విడు దల చేసిన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయా లపై తన పట్టును మా జీ రాజ కుటుంబీకుడు దిగ్వి జయ్‌సింగ్ మరోసారి నిరూపించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుమారుడు, తమ్ముడు, అల్లుళ్లు... ఇలా ఏకంగా నలుగురికి టికెట్లు దక్కడం విశేషం! దీన్ని కాంగ్రెస్ వ్యక్తి పూజకు, కుటుంబ పాలనకు మరో నిదర్శనంగా ఎప్పట్లాగే బీజేపీ ఎద్దేవా చేస్తుండగా సమర్థులకే అవకాశాలిస్తున్నామంటూ కాంగ్రెస్ సమర్థించుకుంటోంది...తొలి జాబితా చాలా కారణాలతో వార్తల్లో నిలిచింది. అయితే అందరినీ ఆకర్షించింది మాత్రం పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ కుటుంబంలో ఏకంగా నలుగురికి టికెట్లు దక్కడం ! వివాదాస్పదుడైన సోదరుడు లక్ష్మణ్‌సింగ్‌తో పాటు కుమారుడు జైవర్దన్, అల్లుడు ప్రియవ్రత్, అదే వరుసయ్యే అజయ్‌సింగ్ రాహుల్ పేర్లకు చోటు దక్కింది.

అజయ్‌సింగ్ రాహుల్



68 ఏళ్లు. దిగ్విజయ్‌కి వరసకు కోడలి భర్త. రక్త సంబంధీకుడు కాకున్నా డిగ్గీకి అత్యంత విశ్వాసపాత్రుడు. ఐదుసార్లు ఎమ్మెల్యే. వింధ్య ప్రాంతంలో గట్టి పట్టున్న నాయకుడు. ముఖ్యంగా సిద్ధి జిల్లాపై పలు దశాబ్దాలుగా రాజకీయ పెత్తనం ఆయన కుటుంబానిదే.

> 'మధ్యప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్ ఇవ్వగలిగింది కేవలం కుటుంబ పాలన మాత్రమేనని దిగ్విజయ్ ఉదంతం మరోసారి నిరూపించింది. ఇది కాంగ్రెస్ రక్తంలోనే ఉంది. నా కుమారుడు ఆకాశ్ తనకు టికెటివ్వొద్దని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఇవీ మా పార్టీ పాటించే విలువలు!'
>
> – బీజేపీ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్‌లో పార్టీ సీనియర్ నేత.

లక్ష్మణ్‌సింగ్




68 ఏళ్లు. దిగ్విజయ్ తమ్ముడు. మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. 1990లో రాజకీయాల్లోకి వచ్చారు. వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. సొంత పార్టీనీ వదలకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు! 2004లో బీజేపీలో చేరి రాజ్‌గఢ్ నుంచి అసెంబ్లీకి గెలిచారు. 2010లో నాటి బీజేపీ అధ్యక్షుడు నితిన్ గడ్కరీని విమర్శించి బహిష్కారానికి గురయ్యారు. 2018లో రాష్ట్ర రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చి కాంగ్రెస్ నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా నెగ్గారు.

ప్రియవ్రత్‌సింగ్



45 ఏళ్లు. దిగ్విజయ్ మేనల్లుడు. కిల్చీపూర్ సంస్థాన వారసుడు. ఆ స్థానం నుంచే 2003లో అసెంబ్లీకి వెళ్లారు. అభివృద్ధి పనులతో ఆకట్టుకుని 2008లో మళ్లీ నెగ్గారు. 2013లో ఓడినా 2018లో మంచి మెజారిటీతో గెలిచారు. కమల్‌నాథ్ మంత్రివర్గంలో ఇంధన శాఖ దక్కించుకున్నారు.

జైవర్ధన్‌సింగ్



37 ఏళ్లు. దిగ్విజయ్ కుమారుడు. గ్వాలియర్–చంబల్ ప్రాంతంలో సింధియాల కంచుకోటలను చేజిక్కించుకోవడంపై ఈసారి దృష్టి సారించారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారి కేంద్ర మంత్రి పదవి పొందిన జ్యోతిరాదిత్య సింధియా అనుయాయుల్లో పలువురిని ఇటీవల కాంగ్రెస్ గూటికి చేర్చారు.

డూన్ స్కూల్లో చదివిన ఆయన కొలంబియా వర్సిటీలో మాస్టర్స్ చేశారు. 2013లో రాజకీయాల్లో అడుగు పెట్టారు. తమ మాజీ సంస్థానమైన రాఘవ్‌గఢ్ అసెంబ్లీ స్థానం నుంచి 59 వేల పైచిలుకు మెజారిటీతో నెగ్గారు. 2018లో దాన్ని 64 వేలకు పెంచుకోవడమే గాక కమల్‌నాథ్ మంత్రివర్గంలో చోటు కూడా దక్కించుకున్నారు.

కాంగ్రెస్‌తో కలిసి ఉండలేం

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై పునరాలోచన చేస్తాం | సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ: విపక్ష 'ఇండియా' కూటమిలో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు చిచ్చు పెట్టే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తమను పట్టించుకోకుండా ఏకపక్షంగా 144 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడం పట్ల సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో కలిసి పని చేసే పరిస్థితి లేనప్పుడు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చేతులు కలిపే అంశాన్ని పునఃపరిశీలించాల్సి ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. తమతో వారి (కాంగ్రెస్) ప్రవర్తన లాగే వారితో తమ ప్రవర్తన ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలను మోసగిస్తోందని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పోటీ చేస్తున్న స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. 18 స్థానాల్లో ఈ రెండు పార్టీలు పరస్పరం బలంగా పోటీ పడుతున్నాయి. దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోయి అధికార బీజేపీ లాభపడుతుందని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నాయకులు ఆందోళన చెందుతున్నారు. మధ్యప్రదేశ్‌లో తమకు తగిన బలం ఉందని, గతంలో రెండో స్థానంలో నిలిచామని అఖిలేష్ యాదవ్ గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా ఆరు స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, చివరకు మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు.


మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం కోసం బీజేపీ రంగంలోకి దించిన హై టెక్ వాహనాలివి. భోపాల్‌లో గురువారం వీటిని సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ జెండా ఊపి ప్రారంభించారు.

కాంగ్రెస్ నక్సలిజాన్ని ప్రోత్సహిస్తోంది


బీజేపీకి అధికారమిస్తే రాష్ట్రాన్ని ఈ బెడద నుంచి విముక్తం చేస్తాం | ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ర్యాలీలో హోం మంత్రి అమిత్ షా



జగదల్‌పూర్: కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహిస్తోందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో వామపక్ష తీవ్రవాద ఘటనలు 52 శాతం మేర తగ్గుముఖం పట్టాయని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్ సీఎం భగేల్ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు ఏటీఎంగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన స్కాముల ప్రభుత్వంగా తయారైందని పేర్కొన్నారు. జగదల్‌పూర్, కొండగావ్‌లలో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో అమిత్ షా మాట్లాడారు. 'రాష్ట్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అర్థించటానికే మీ ముందుకు వచ్చా. స్కాములకు పాల్పడటం ద్వారా గిరిజనుల డబ్బును దోచుకున్నవారిని తలకిందులుగా వేలాడదీస్తాం'అని ఆయన అన్నారు. బీజేపీకే ఓటు వేయాలని ప్రజలను కోరిన అమిత్ షా, 'మీ ముందు రెండు అవకాశాలున్నాయి..ఒకటి నక్సలిజాన్ని ప్రోత్సహించే కాంగ్రెస్, మరోవైపు, ఈ బెడదను నిర్మూలించే బీజేపీ. కోట్లాది రూపాయల అవినీతి సొమ్మును ఢిల్లీ దర్బార్‌కు పంపే కాంగ్రెస్.. కోట్లాది మంది పేదలకు గ్యాస్ సిలిండర్లు, మరుగుదొడ్లు, తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, రేషన్, ఇళ్లు అందజేస్తున్న బీజేపీ. ఈ రెండింట్లో మీరు ఏ ప్రభుత్వాన్ని కోరుకుంటారు?'అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ ప్రజలు దీపావళి పండుగను ఈసారి మూడుసార్లు జరుపుకుంటారంటూ... మొదటిది దీపావళి రోజున, రెండోది డిసెంబర్ 3న రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక, మూడోది జనవరిలో అయోధ్య రామాలయ నిర్మాణం పూర్తయ్యాక (శ్రీరాముడి మాతామహుల నివాసం ఛత్తీస్‌గఢ్ అని ప్రజల విశ్వాసం)అని అమిత్ షా చెప్పారు. 'రాష్ట్రంలో బీజేపీకి అధికారమిస్తే, ఈ బెడద నుంచి పూర్తిగా విముక్తి కల్పిస్తాం. మోదీ ప్రభుత్వ పాలనలో 9 ఏళ్ల కాలంలో నక్సల్ సంబంధ హింస 52% తగ్గగా నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 62% మేర క్షీణించింది'అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో జరిగే తీవ్రవాద సంబంధ హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే పోలీసులైనా, పౌరులైనా, నక్సలైట్లయినా అందరూ గిరిజనులేనని ఆయన చెప్పారు.

ముఖ్యమంత్రి పదవి నన్ను వదులుకోదు

• రాజస్తాన్ సీఎం గహ్లోత్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి పదవి వదులుకోవాలని తాను అనుకుంటున్నప్పటికీ ఆ పదవి తనను వదిలిపెట్టబోదని రాజస్తాన్ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గహ్లోత్ వ్యాఖ్యానించారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ తానే ముఖ్యమంత్రి అవుతానని పరోక్షంగా తేల్చిచెప్పారు. సీఎం పదవిపై ఆశలు పెట్టుకోవద్దంటూ పార్టీలో తన ప్రత్యర్థి అయిన సచిన్ పైలట్‌కు సర్వగర్భంగా సూచించారు. గహ్లోత్ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'దేవుడి దయతో మీరు నాలుగోసారి ముఖ్యమంత్రి అవుతారని ఓ మహిళా నాతో చెప్పింది. ముఖ్యమంత్రి పోస్టు వదులుకోవాలని నేను అనుకుంటున్నా అది నన్ను వదలడం లేదని ఆమెతో చెప్పా. ఇక ఎప్పటికీ ఆ పదవి నన్ను వదలకపోవచ్చు' అని గహ్లోత్ వెల్లడించారు. రాజస్తాన్‌లో సీఎం పోస్టు కోసం ఈసారి సచిన్ పైలట్ గట్టిగా పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో గహ్లోత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు బయటపడ్డాయని ప్రత్యర్థులు అంటున్నారు. ఎవరికి టికెట్లు ఇచ్చినా అభ్యంతరం లేదు. ఎవరికి టికెట్లు ఇచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. పైలట్ వర్గం సహా అందరితో చర్చించి, అభ్యర్థులను ఖరారు చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి పదవిని ఎవరికి అప్పగించాలో పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుందని, పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో తాము చేసిన అభివృద్ధే తమ పార్టీని గెలిపిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి వదులుకుంటానని చెప్పే ధైర్యం దేశంలో ఎంతమంది సీఎంలకు ఉందని ప్రశ్నించారు. రాజస్తాన్‌లో నవంబర్ 25న ఎన్నికలు జరుగనున్నాయి.

కాంగ్రెస్ వస్తే పథకాలు ఆగిపోతాయి: శివరాజ్‌సింగ్

భోపాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, తమ ప్రభుత్వం తీసుకొచ్చిన 'లాడ్లీ బెహన యోజన' వంటి సంక్షేమ పథకాలు ఆగిపోతాయని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓటర్లను అప్రమత్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఈ పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. లబ్ధిదారులకు అందాల్సిన సొమ్ము ఇవ్వడంలో తప్పేముందని ప్రశ్నించారు. చౌహాన్ గురువారం ఝబువా జిల్లాలో థాండ్లా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఆ పార్టీకి అధికారం అప్పగిస్తే ప్రజల పరిస్థితి అధోగతేనని అన్నారు. లాడ్లీ బెహన యోజన కింద లబ్ధిదారులకు ప్రతినెలా రూ.1,250 చొప్పున అందజేస్తున్నామని, ఇది చూసి కాంగ్రెస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని చౌహాన్ మండిపడ్డారు.

హార్దిక్ పాండ్యాకు గాయం

ప్రపంచకప్ వేటలో ఉన్న భారత శిబిరంలో కాస్త ఆందోళన పెంచే ఘటన మైదానంలో జరిగింది. బంగ్లాతో మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయపడ్డాడు. తన తొలి ఓవర్ మూడో బంతిని బ్యాటర్ దాస్ నేరుగా ఆడగా బంతిని ఆపే ప్రయత్నంలో పాండ్యా తన కాలును బాగా ముందుకు జరిపాడు. ఈ క్రమంలో అతని చీలమండ భాగం మడత పడింది. దాంతో అతను నొప్పితో విలవిల్లాడాడు. ప్రాథమిక చికిత్స చేసినా లాభం లేకపోవడంతో అలాగే మైదానం వీడాడు. కొద్ది సేపటికే ఈ మ్యాచ్‌లో అతను బౌలింగ్ చేయడని బీసీసీఐ ప్రకటించింది. అతని కాలికి స్కాన్ నిర్వహించినట్లు తెలిసింది. దాని ఫలితాలపై పూర్తి సమాచారం లేకున్నా మ్యాచ్ తర్వాత రోహిత్ 'పెద్దగా ప్రమాదం ఏమీ లేకపోవడం మాకు ఊరట. అయితే ప్రతీ రోజు గాయాన్ని వైద్యులు పర్యవేక్షిస్తారు' అని స్పష్టతనిచ్చాడు. పాండ్యా తప్పుకోవడంతో ఆ ఓవర్లో మిగిలిన మూడు బంతులను కోహ్లి బౌల్ చేయడంతో స్టేడియం హోరెత్తింది. దీనికి ముందు 2017లో శ్రీలంకపై చివరిసారిగా కోహ్లి బౌలింగ్ చేశాడు.



నాలుగోసారీ ఛేదించాం

మళ్లీ అదే వ్యూహం... అదే ఫలితం... పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడం... ఆపై మెరుపు బ్యాటింగ్‌తో వేగంగా విజయాన్నందుకోవడం... 199, 272, 191, 256... ఇలా ప్రత్యర్థి స్కోర్లు మారడమే తప్ప భారత జట్టు ఆట మారలేదు... సమష్టి ప్రదర్శనతో సొంతగడ్డపై ప్రపంచకప్‌లో భారత్ జైత్రయాత్ర ఆగలేదు... వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా తమ విజయాల స్కోరును 4/4గా మార్చుకుంది... బలహీన ప్రత్యర్థి బంగ్లాదేశ్‌పై సులువైన విజయంతో రోహిత్ బృందం సత్తా చాటింది. బౌలర్లు చెలరేగడంతో బంగ్లాదేశ్ నామమాత్రపు స్కోరుకు పరిమితం కాగా... రోహిత్, గిల్, కోహ్లి బ్యాటింగ్‌తో అలవోకగా భారత జట్టు లక్ష్యం చేరింది... చిన్నపాటి లక్ష్యంలో కూడా చివర్లో చెలరేగి కోహ్లి 48వ వన్డే సెంచరీని తన ఖాతాలో వేసుకోవడం మ్యాచ్‌లో హైలైట్.

ప్రపంచకప్‌లో భారత్‌కు మరో విజయం

7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు ● విరాట్ కోహ్లి 48వ వన్డే శతకం
రాణించిన గిల్, రోహిత్, బౌలర్లు ● ఆదివారం న్యూజిలాండ్‌తో తర్వాతి మ్యాచ్


గిల్


రోహిత్

పుణే: తిరుగులేని ప్రదర్శనతో భారత్ వరల్డ్‌కప్‌లో మరో గెలుపును తమ ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగిన పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. లిటన్ దాస్ (82 బంతుల్లో 66; 7 ఫోర్లు), తన్‌జీద్ హసన్ (43 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మహ్ముదుల్లా (36 బంతుల్లో 46; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) జట్టు స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం భారత్ 41.3 ఓవర్లలో 3 వికెట్లకు 261 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (97 బంతుల్లో 103 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీ సాధించగా... గిల్ (55 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (40 బంతుల్లో 48; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. భారత్ ఆదివారం జరిగే తమ తర్వాతి పోరులో ధర్మశాలలో న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

ఓపెనర్ల జోరు...

బంగ్లాకు ఓపెనర్లు తన్‌జీద్, దాస్ శుభారంభం అందించారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు చక్కటి బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. శార్దుల్ తొలి ఓవర్లో తన్‌జీద్ వరుసగా 6, 4, 6 బాదడంతో 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 63 పరుగులకు చేరింది. ఈ క్రమంలో 41 బంతుల్లో తన్‌జీద్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకొని కుల్దీప్ భారీ భాగస్వామ్యానికి ముగింపు పలికాడు. అంతే...ఆ తర్వాత బంగ్లా బ్యాటర్లు ఒకరి తర్వాత మరొకరు వరుసగా విఫలమయ్యారు. 93/0తో ఒకదశలో పటిష్ట స్థితిలో కనిపించిన జట్టు వేగంగా వికెట్లు కోల్పోయింది. నజ్ముల్ (8), మిరాజ్ (3) తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా... 62 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్న దాస్ వీరిని అనుసరించాడు. తౌహీద్ (16) బంతులు వృథా చేయగా, ముష్ఫికర్ రహీమ్ (46 బంతుల్లో 38; 1 ఫోర్, 1 సిక్స్) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే మన పటిష్ట బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం కష్టంగా మారింది. చివర్లో మహ్ముదుల్లా ధాటిగా ఆడటంతో బంగ్లా ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. గాయం కారణంగా కెప్టెన్ షకీబ్ అల్ హసన్, ప్రధాన పేసర్ తస్కీన్ అహ్మద్ ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో ఆట ఆరంభానికి ముందే బంగ్లా బలహీన పడింది.

కీలక భాగస్వామ్యాలు...

ఛేదనలో ఎప్పటిలాగే రోహిత్ తనదైన శైలిలో దూకుడు చూపిస్తూ వరుస బౌండరీలతో దూసుకుపోయాడు. మరో వైపు నసుమ్ ఓవర్లో 2 సిక్స్‌లతో జోరు పెంచిన గిల్... ముస్తఫిజుర్ ఓవర్లో మూడు ఫోర్లు బాదాడు. అయితే హసన్ ఓవర్లో భారీ సిక్స్ కొట్టిన రోహిత్ తర్వాతి బంతికి అదే తరహా షాట్ ఆడబోయి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కోహ్లి బాధ్యత తీసుకోగా... 52 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన తర్వాత గిల్ నిష్క్రమించాడు. చూడచక్కటి షాట్లు ఆడిన కోహ్లి 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (25 బంతుల్లో 19; 2 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... కోహ్లి, కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. వీరిద్దరు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగా, వీరిని నిలువరించలేక బంగ్లా బౌలర్లు చేతులెత్తేశారు.

సెంచరీ దిశగా ఉత్కంఠ!

బ్యాటింగ్‌లో భారత్ జోరు చూస్తే జట్టు విజయంపై ఎలాంటి సందేహాలు లేవు. అయితే కోహ్లి శతకం చేరుకునే ప్రయత్నం చేయడమే చివర్లో ఆటను కాస్త ఆసక్తికరంగా మార్చింది. 36 ఓవర్ల తర్వాత జట్టు విజయానికి 48 పరుగులు కావాల్సి ఉండగా... కోహ్లి 68 పరుగుల వద్ద ఉన్నాడు. తర్వాతి ఓవర్లో రాహుల్ 6, 4 సహా 12 పరుగులు చేయడంతో ఈ అంతరం మరింత తగ్గింది. మరుసటి ఓవర్ తర్వాత భారత్‌కు 28 పరుగులు... కోహ్లి సెంచరీకి 27 పరుగులు కావాలి. ఇద్దరు ప్రధాన బ్యాటర్లు క్రీజ్‌లో ఉంటే ఒక్కడే పరుగులు చేయడం దాదాపుగా జరగదు. కానీ తగినన్ని ఓవర్లు అందుబాటులో ఉండటంతో సమస్య లేదు కాబట్టి ఈ దశలో కోహ్లి సెంచరీపై దృష్టి పెట్టాడు. రాహుల్ కూడా పరుగులు చేయకుండా వెనక్కి తగ్గాడు. సింగిల్స్ తీసే అవకాశమున్నా దానిని బ్యాటర్లు కాదనుకున్నారు. ఫలితంగా కోహ్లికి శతకం సాధ్యమైంది. తర్వాతి 32 పరుగుల్లో కోహ్లి ఒక్కడే 30 పరుగులు సాధించగా రాహుల్ సింగిల్ మాత్రమే తీశాడు. మరో పరుగు వైడ్ రూపంలో వచ్చింది. నసుమ్ వేసిన ఫుల్‌టాస్ బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాది విరాట్ శతక గర్జన చేశాడు.


కోహ్లి

48 వన్డేల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. ఈ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా సచిన్ టెండూల్కర్ (49) పేరిట ఉన్న రికార్డును సమం చేసేందుకు కోహ్లి మరో సెంచరీ దూరంలో ఉన్నాడు. రోహిత్ (31) మూడో స్థానంలో ఉన్నాడు.

4 వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో ఓ మ్యాచ్‌లో భారత జట్టుపై ఓపెనర్లిద్దరూ అర్ధ సెంచరీలు/సెంచరీలు చేయడం ఇది నాలుగోసారి మాత్రమే. ప్రత్యర్థి జట్టు ఓపెనర్లు హాఫ్ సెంచరీలు/సెంచరీలు చేసిన మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు ఓటమి చెందగా... నాలుగోసారి మాత్రం భారత్ గెలిచింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X పాకిస్తాన్
వేదిక: బెంగళూరు
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 51; లిటన్ దాస్ (సి) గిల్ (బి) జడేజా 66; నజ్ముల్ (ఎల్బీ) (బి) జడేజా 8; మిరాజ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 3; తౌహీద్ (సి) గిల్ (బి) శార్దుల్ 16; ముష్ఫికర్ (సి) జడేజా (బి) బుమ్రా 38; మహ్ముదుల్లా (బి) బుమ్రా 46; నసుమ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 14; ముస్తఫిజుర్ (నాటౌట్) 1; షరీఫుల్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (50 ఓవర్లలో 8 వికెట్లకు) 256. **వికెట్ల పతనం:** 1-93, 2-110, 3-129, 4-137, 5-179, 6-201, 7-233, 8-248. **బౌలింగ్:** బుమ్రా 10-1-41-2, సిరాజ్ 10-0-60-2, పాండ్యా 0.3-0-8-0, కోహ్లి 0.3-0-2-0, శార్దుల్ 9-0-59-1, కుల్దీప్ 10-0-47-1, జడేజా 10-0-38-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) తౌహీద్ (బి) హసన్ 48; గిల్ (సి) మహ్ముదుల్లా (బి) మిరాజ్ 53; కోహ్లి (నాటౌట్) 103; అయ్యర్ (సి) మహ్ముదుల్లా (బి) మిరాజ్ 19; రాహుల్ (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (41.3 ఓవర్లలో 3 వికెట్లకు) 261. **వికెట్ల పతనం:** 1-88, 2-132, 3-178. **బౌలింగ్:** షరీఫుల్ 8-0-54-0, ముస్తఫిజుర్ 5-0-29-0, నసుమ్ 9.3-0-60-0, హసన్ 8-0-65-1, మిరాజ్ 10-0-47-2, మహ్ముదుల్లా 1-0-6-0.

ఇక ఆసీస్‌తో ప్రమాదం

కృష్ణమాచారి శ్రీకాంత్

వరుస పరాజయాల అనంతరం ఆస్ట్రేలియా జట్టు ఎట్టకేలకు శ్రీలంకపై చక్కని విజయంతో ప్రపంచకప్‌లో బోణీ చేసింది. పట్టికలో చేరిన 2 పాయింట్లు ఆసీస్ శిబిరాన్ని సంబరంలో ముంచింది. ఓ కెప్టెన్ ముందుండి నడిపిస్తే దాని ప్రభావం జట్టుపై చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ విషయం రోహిత్ శర్మ భారత్‌ను ఎలా విజయవంతగా నడిపిస్తున్నాడో చూస్తే అర్థమవుతుంది. ఆసీస్ కెప్టెన్ కమిన్స్ లయ అందుకోవడం, స్పిన్నర్ జంపా తిప్పేయడంతో 'కంగారూ జట్టు' ఇకపై ప్రమాదకర శక్తిగా మారుతుంది. ఇదే విషయం వారి గత ఐదు ప్రపంచకప్ టైటిళ్ల ఘనమైన రికార్డు సూచిస్తుంది. మార్ష్, లబుషేన్‌లతో పాటు స్మిత్ కూడా నిలకడగా ఆడితే బ్యాటింగ్ దళానికి తిరుగుండదు. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు అఫ్గాన్, దక్షిణాఫ్రికాకు నెదర్లాండ్స్ ఊహించని షాక్‌లు ఇచ్చాయి. ఇలా రోజుల వ్యవధిలోనే రెండు సంచలనాలు సెమీఫైనల్ బెర్త్‌ల రేసును రసవత్తరం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా దక్షిణాఫ్రికాపై ఆఖరి పది ఓవర్లలో డచ్ బ్యాటర్లు చెలరేగిన వైనం, బౌలింగ్‌లో సఫారీపై విసిరిన పంజా అద్భుతం. ఇలాంటి పరాజయం నుంచి దక్షిణాఫ్రికా ఎలా పుంజుకుంటుందో చూడాలి. నేడు ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌ల మధ్య ఆసక్తికర మ్యాచ్ జరగడం ఖాయం. ఎందుకంటే రెండు మ్యాచ్‌లు ఓడిన ఆసీస్ గెలుపుబాట పట్టగా, రెండు విజయాలు సాధించిన పాక్ ఓటమితో ఉంది. ఇలాంటి జట్ల మధ్య శుక్రవారం ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి. యువ బ్యాటర్లు షఫిక్, ఇమాముల్, షకీల్‌లతో పాటు సీనియర్లు బాబర్ ఆజమ్, రిజ్వాన్‌లు బ్యాట్ ఝుళిపిస్తే విజయం ఏమంత కష్టం కాదు. ఇక వేదిక గురించి చెప్పుకోవాల్సి వస్తే... బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద ఖాయం. ఇది ఎన్నోసార్లు పరుగుల మజా పంచింది. అలాగే నాణ్యమైన బౌలింగ్ రుచి చూపిస్తే... కట్టడి చేయొచ్చని కూడా ఐపీఎల్‌లో యజువేంద్ర చహల్ నిరూపించాడు. ఈ నేపథ్యంలో ఎవరు మెరిపిస్తారో, ఎవరు కట్టడి చేస్తారో చూడాలి.

ఆసియా ఆర్చరీ పోటీలకు జ్యోతి సురేఖ, ధీరజ్





సోనీపత్: వచ్చే నెలలో బ్యాంకాక్‌లో జరిగే ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల రికర్వ్, కాంపౌండ్ జట్లను ప్రకటించారు. మహిళల కాంపౌండ్ జట్టులో స్టార్ ప్లేయర్, ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు గెలిచిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ... పురుషుల రికర్వ్ జట్టులో ఆసియా క్రీడల్లో టీమ్ విభాగంలో రజత పతకం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ఆటగాడు ధీరజ్ బొమ్మదేవర ఎంపికయ్యారు. సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహించే ధీరజ్‌కు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు మరో అవకాశం దక్కింది. నవంబర్ 3 నుంచి 10 వరకు జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో రికర్వ్ పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో స్వర్ణం గెలిచిన జట్లు... పురుషుల, మహిళల వ్యక్తిగత విభాగాల్లో ఫైనల్ చేరిన ఇద్దరు ప్లేయర్లు చొప్పున పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.

హెచ్‌సీఏలో ఎన్నికల సందడి

నేడు పోలింగ్, ఫలితాలు ● 6 పదవుల కోసం బరిలో 24 మంది


అధ్యక్ష అభ్యర్థులు అమర్‌నాథ్


జగన్‌మోహన్ రావు


పీఎల్ శ్రీనివాస్


అనిల్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవకతవకలు, అవినీతి, కోర్టు వివాదాలు, పరస్పర ఆరోపణలు, సస్పెన్షన్‌లు, పర్యవేక్షకుల పరిపాలన తర్వాత ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వీఎస్ సంపత్ ఆధ్వర్యంలో నేడు ఉప్పల్ స్టేడియంలో ఎన్నికలు జరుగుతాయి. వాస్తవానికి మొహమ్మద్ అజహరుద్దీన్ అధ్యక్షుడిగా 2019లో ఎన్నికైన హెచ్‌సీఏ కార్యవర్గం పదవీ కాలం గత ఏడాది సెప్టెంబర్ 26నే ముగిసింది. ఆ వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉన్నా... వేర్వేరు వివాదాలతో అవి వాయిదా పడ్డాయి. చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఎన్నికలు జరిగే వరకు రోజువారీ కార్యకలాపాల కోసం మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) ఎల్.నాగేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య పర్యవేక్షణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో మూడు వరల్డ్‌కప్ మ్యాచ్‌లు కూడా జరిగాయి. చివరకు అక్టోబర్ 20న ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి ముందు హెచ్‌సీఏను ప్రక్షాళన చేసే క్రమంలో 57 క్లబ్‌లపై నాగేశ్వరరావు నిషేధం విధించారు. దాంతో ఈ క్లబ్‌లకు ఎన్నికల్లో ఓటు హక్కు లేకుండా పోయింది.

నాలుగు ప్యానెల్‌లుగా...

అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కౌన్సిలర్... ఇలా ఆరు పదవుల కోసం ఎన్నికలు జరగనున్నాయి. లోధా కమిటీ సిఫారసులు, కొత్త నియమావళి కారణంగా గతంలో కీలక పదవులు నిర్వహించిన సీనియర్లందరూ ఈసారి పోటీలో లేకపోగా, తాము మద్దతునిస్తూ సన్నిహితులను బరిలోకి దించారు. దాంతో ఈసారి ఎక్కువగా కొత్త మొహాలు కనిపిస్తున్నాయి. నాలుగు వేర్వేరు గ్రూప్‌లుగా విడిపోయి అభ్యర్థులంతా పోటీ చేస్తున్నారు. అయితే ఫలితం విషయంలో గ్రూప్‌లతో సంబంధం లేదు. ఒక్కో పదవి కోసం అత్యధిక ఓట్లు సాధించిన వారు ప్యానెల్‌తో సంబంధం లేకుండా ఎన్నికవుతారు. పోలింగ్ కోసం మొత్తం 173 ఓట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 101 రెగ్యులర్ క్రికెట్ క్లబ్‌లు కాగా 48 ఇన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు ఉన్నాయి. 9 జిల్లా క్లబ్‌లతో పాటు 15 మందికి అంతర్జాతీయ ఆటగాళ్ల హోదాలో ఓటు హక్కు ఉంది. గెలిస్తే తాము హైదరాబాద్ క్రికెట్ సంఘాన్ని చక్కదిద్దుతామని, వివాదాలు లేకుండా నడిపిస్తామని అభ్యర్థులంతా హామీ ఇస్తున్నారు. శుక్రవారం సాయంత్రమే ఓట్లను లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారు.

బరిలో ఉన్న ప్యానెల్, అభ్యర్థులు

యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ: ఎ.జగన్‌మోహన్ రావు, పి.శ్రీధర్, ఆర్.హరినారాయణ రావు, నోయల్ డేవిడ్, సీజే శ్రీనివాస్, అన్సర్ అహ్మద్ ఖాన్. **క్రికెట్ ఫస్ట్:** అమర్‌నాథ్, జి.శ్రీనివాస రావు, ఆర్.దేవరాజ్, సి.సంజీవ్ రెడ్డి, చిట్టి శ్రీధర్, సునీల్ కుమార్. **ఆనెస్ట్ హార్డ్ వర్కింగ్ హెచ్‌సీఏ:** పీఎల్ శ్రీనివాస్, సి. బాబూరావు, ఆర్ఎం భాస్కర్, రోహిత్ అగర్వాల్, జెరార్డ్ కార్, డీఏజే వాల్టర్. **గుడ్ గవర్నెన్స్:** కె. అనిల్‌కుమార్, దల్జీత్ సింగ్, వి.ఆగమరావు, బసవరాజు, పి.మహేంద్ర, వినోద్ ఇంగ్లే.

హడలెత్తించిన రవితేజ

13 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన బౌలర్ ● హైదరాబాద్‌కు వరుసగా మూడో విజయం



జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. ఛత్తీస్‌గఢ్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టును హైదరాబాద్ మీడియం పేసర్ టి.రవితేజ హడలెత్తించాడు. రవితేజ కేవలం 13 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. సీవీ మిలింద్ (2/16), తనయ్ త్యాగరాజన్ (2/16) కూడా రాణించడంతో ఛత్తీస్‌గఢ్ 19.1 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. శశాంక్ సింగ్ (47 బంతుల్లో 51; 5 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం హైదరాబాద్ 16 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 98 పరుగులు చేసి గెలిచింది. తన్మయ్ అగర్వాల్ (15 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ రాయుడు (10 బంతుల్లో 14; 2 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (13 బంతుల్లో 11; 1 ఫోర్), చందన్ సహని (22 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (33 బంతుల్లో 25 నాటౌట్) రాణించారు. హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్‌లో 21న మిజోరం జట్టుతో ఆడుతుంది.

షేక్ రషీద్ అజేయ శతకం

54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 100 నాటౌట్ ● అరుణాచల్ ప్రదేశ్‌పై ఆంధ్ర గెలుపు



రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు తొలి విజయం నమోదు చేసింది. అరుణాచల్ ప్రదేశ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర 145 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 228 పరుగులు చేసింది. షేక్ రషీద్ (54 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) అరుణాచల్ బౌలర్లపై విరుచుకుపడి అజేయ సెంచరీ చేశాడు. హనుమ విహారి (32 బంతుల్లో 49; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. రికీ భుయ్ (10 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు), కరణ్ షిండే (8 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడారు. 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి ఓడిపోయింది. ఆంధ్ర జట్టు బౌలర్లలో స్టీఫెన్ (3/10), కేవీ శశికాంత్ (2/2) రాణించారు. ఆంధ్ర తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 21న గుజరాత్‌తో ఆడుతుంది.

క్వార్టర్స్‌లో సింధు



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 18-21, 21-15, 21-13తో ప్రపంచ ఏడో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)పై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్ 18-21, 8-21తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది.

డిసెంబర్ 2 నుంచి పీకేఎల్

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ షెడ్యూల్‌ను నిర్వాహకులు ప్రకటించారు. అహ్మదాబాద్‌లో డిసెంబర్ 2న గుజరాత్ జెయింట్స్, తెలుగు టైటాన్స్ మ్యాచ్‌తో పీకేఎల్ మొదలవుతుంది. ఈసారి పీకేఎల్ మ్యాచ్‌లు 12 జట్ల నగరాల్లో జరుగుతాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21తో లీగ్ దశ ముగుస్తుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. హైదరాబాద్ అంచె పోటీలు జనవరి 19 నుంచి 24 వరకు జరుగుతాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు బరిలో దిగుతున్న ఈ లీగ్‌లో బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, తెలుగు టైటాన్స్, యు ముంబా, యూపీ యోధాస్ జట్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
20-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
248	46
65,629	19,625

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,277	▽	37
డోజోన్స్	33,625	▽	40
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,500	▽	88
డాక్స్	15,045	▽	50
షాంఘై	3,005	▽	53
నికాయ్	31,431	▽	612

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)		
59,940	△	100
బంగారం (22 క్యారట్)		
59,700	△	100
వెండి (కేజీ)		
71,324	△	873

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	84.18
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.45	102.77
€	యూరో	ఎస్‌బీఐ	86.25	89.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.80	56.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.44	53.72
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.72	61.64
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

ఐటీసీ లాభం అప్

క్యూ2లో రూ. 4,956 కోట్లు



న్యూఢిల్లీ: హోటళ్లు, ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 4,956 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,670 కోట్లు ఆర్జించింది. స్టాండెలోన్ లాభం సైతం 10 శాతం ఎగసి రూ. 4,927 కోట్లను తాకింది. ఇక కార్యకలాపాల మొత్తం ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 19,270 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఆగస్ట్‌లో కంపెనీ బోర్డు హోటళ్ల బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. మొత్తం ఆదాయంలో సిగరెట్ల బిజినెస్ నుంచి 10 శాతం అధికంగా రూ. 7,657 కోట్లు, ఎఫ్‌ఎంసీజీ నుంచి 8 శాతం వృద్ధితో రూ. 5,293 కోట్లు, హోటళ్ల విభాగం నుంచి 21 శాతం అధికంగా రూ. 649 కోట్లు చొప్పున సమకూరింది. కాగా.. మొత్తం వ్యయాలు 3.5 శాతం పెరిగి రూ. 13,279 కోట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.4 శాతం నీరసించి రూ. 450 వద్ద ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం ఫ్లాట్

- క్యూ2లో రూ. 2,657 కోట్లు
- షేరుకి రూ. 18 డివిడెండ్



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 2,657 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,670 కోట్లు ఆర్జించింది. పరిశ్రమలో నెలకొన్న తీవ్ర పోటీ లాభాలపై ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 15,253 కోట్ల నుంచి స్వల్ప వృద్ధితో రూ. 15,806 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ. 11,965 కోట్ల నుంచి రూ. 12,211 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది.

మార్జిన్లు ఓకే

సవాళ్లతో కూడిన వాతావరణంలోనూ పటిష్ట పనితీరు చూపడంతోపాటు.. నిర్వహణ(ఇబిటా) మార్జిన్లను మెరుగుపరుచుకున్నట్లు హెచ్‌యూఎల్ సీఈవో, ఎండీ రోహిత్ జావా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల డిమాండ్ మందగించగా.. పరిశ్రమలో పోటీ తీవ్రమైనట్లు తెలియజేశారు. ప్రకటనలు, ప్రమోషనల్ వ్యయాలను కోవిడ్–19 ముందుస్థాయికి పెంచినట్లు కంపెనీ సీఎఫ్‌వో రితేష్ తివారీ తెలియజేశారు. క్యూ2లో ఇందుకు రూ. 700 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు రోహిత్ పేర్కొన్నారు. ఎఫ్‌ఎంసీజీ డిమాండ్ క్రమంగా పుంజుకోనున్నట్లు అంచనా వేశారు. పండుగల సీజన్, ప్రభుత్వ వ్యయాల పెంపు తదితర అంశాలు ఇందుకు దోహదపడగలవని వివరించారు. అయితే గ్లోబల్ కమోడిటీ ధరలు, పంటలపై రుతుపవన ప్రభావం వంటి అంశాలకు ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు ఎన్‌ఎస్‌ఈలో నామమాత్ర వృద్ధితో రూ. 2,550 వద్ద ముగిసింది.

నెస్లే షేర్ల విభజన

- 1:10 నిష్పత్తిలో షేర్ల జారీ
- క్యూ 3 లాభం రూ. 908 కోట్లు

న్యూఢిల్లీ: నెస్లే ఇండియా ఈ ఏడాది (2023) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్ (క్యూ3)లో నికర లాభం 37 శాతంపైగా ఎగసి రూ. 908 కోట్లను అధిగమించింది. గతేడాది (2022) ఇదే కాలంలో రూ. 661 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర అమ్మకాలు 9 శాతం పైగా వృద్ధితో రూ. 5,010 కోట్లకు చేరాయి. 1:10 నిష్పత్తిలో ఈక్విటీ షేర్లను విభజించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు నెస్లే ఇండియా తాజాగా వెల్లడించింది. వెరసి రూ. 10 ముఖ విలువగల షేరుని రూ. 1 ముఖ విలువగల 10 షేర్లుగా విభజించనుంది. అంతేకాకుండా వాటాదారులకు షేరుకి రూ. 140 చొప్పున రెండో మధ్యంతర డివిడెండును సైతం బోర్డు ప్రకటించింది.



రెండోరోజూ అమ్మకాల ఒత్తిడి

- కొనసాగిన అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం
- సెన్సెక్స్ నష్టం 248 పాయింట్లు
- 46 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. దేశీయ ఐటీ కంపెనీ విప్రో క్యూ2 క్వార్టర్ ఫలితాలు మెప్పించకపోవడం, యాజమాన్యపు ఆదాయ అంచనాలు తగ్గింపు ఇన్వెస్టర్లను మరింత నిరాశపరిచాయి. మెటల్, ఇంధన, ఐటీ, విద్యుత్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 248 పాయింట్లు నష్టపోయి 65,629 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46 పాయింట్లు పతనమై 19,625 వద్ద నిలిచింది. ఇజ్రాయెయిల్ – పాలస్తీనా పరిణామాలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల నేపథ్యంలో ఉదయం సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే విక్రయాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 534 పాయింట్లు క్షీణించి 65,343 వద్ద, నిఫ్టీ 159 పాయింట్లు కోల్పోయి 19,512 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. అయితే కనిష్ట స్థాయిల వద్ద ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్, మీడియా, ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలు తగ్గించుకున్నాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.08%, 0.07% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,093 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.736 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

''అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు అంతకంతకూ అధికమవుతున్నాయి. ఫెడ్ రిజర్వ్ మరో దఫా వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చనే అంచనాలతో బాండ్లపై రాబడులు పెరగుతున్నాయి. దేశీయ కార్పొరేట్ క్యూ2 ఫలితాలు ఇప్పటివరకు చెప్పుకోదగిన స్థాయిలో నమోదుకాలేదు. ఈ పరిణామాలు దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాలకు కారణమయ్యాయి. అయితే ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ క్రూడాయిల్ ధరలు దిగిరావడం కొంత కలిసొచ్చే అంశం'' అని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే తెలిపారు.

సైయంట్ లాభం 71 శాతం జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ కంపెనీ సైయంట్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 71 శాతం ఎగసి రూ.173 కోట్లు నమోదు చేసింది. ఎబిటా రూ.244 కోట్లు, మార్జిన్ 16.5 శాతంగా ఉంది. టర్నోవర్ 22 శాతం అధికమై రూ.1,476 కోట్లకు ఎగసింది. కొత్త ఆర్డర్లు 40 శాతం దూసుకెళ్లాయి. ఫలితాల నేపథ్యంలో సైయంట్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 4.75 శాతం ఎగసి రూ.1,763.05 వద్ద స్థిరపడింది.

మేడిన్ ఇండియా 'పిక్సెల్'

- వచ్చే ఏడాది నుంచి మార్కెట్లో
- తాజాగా వెల్లడించిన గూగుల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్.. పిక్సెల్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లను భారత్‌లో తయారు చేయాలని నిర్ణయించింది. దేశీయ మార్కెట్‌తోపాటు విదేశాలకు వీటిని సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఈ మోడల్ ఫోన్లు చైనా, వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయి. ఇటీవల విడుదలైన పిక్సెల్ 8 సిరీస్ భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా వినియోగదార్లను ఆకట్టుకుంటోంది. తొలుత పిక్సెల్ 8 మోడల్ ఫోన్లు మేడిన్ ఇండియా ట్యాగ్‌తో రానున్నాయి. పిక్సెల్ 8 ప్రో మోడల్ సైతం ఇక్కడ రూపొందే చాన్స్ ఉంది. దేశీయంగా పిక్సెల్ ఫోన్ల తయారీకై తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్, భారత్‌కు చెందిన డిక్సన్ టెక్నాలజీస్ పోటీపడుతున్నట్టు సమాచారం. 2016 నుంచి అంతర్జాతీయంగా సుమారు 4 కోట్ల పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. ఇందులో ఒక కోటి యూనిట్లు గడిచిన 12 నెలల్లో అమ్ముడవడం విశేషం.

వచ్చే ఏడాది నుంచి..

మేడిన్ ఇండియా పిక్సెల్ స్మార్ట్‌ఫోన్స్ వచ్చే ఏడాది నుంచి అందుబాటులో ఉంటాయని గూగుల్ డివైసెస్, సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రిక్ ఓస్టెర్లో గురువారం వెల్లడించారు. ఇందుకోసం అంతర్జాతీయ, దేశీయ ఒప్పంద తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటామని గూగుల్ ఫర్ ఇండియా 2023 కార్యక్రమంలో పేర్కొన్నారు. గూగుల్ తన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్లను దేశంలో తయారు చేయాలనే నిర్ణయం భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడం, అలాగే ప్రత్యర్థి చైనాతో పోటీ పడాలనే భారత లక్ష్యానికి పెద్ద ప్రోత్సాహం. క్రోమ్‌బుక్స్‌ను భారత్‌లో తయారు చేసేందుకు పర్సనల్ కంప్యూటర్ల ఉత్పత్తిలో పేరెన్నికగల హెచ్‌పీ ఇటీవలే గూగుల్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే.

భారత్‌లో ఇప్పటికే యాపిల్..

కొన్నేళ్లుగా యాపిల్ తన తయారీ స్థావరాన్ని విస్తరించాలని కోరుకుంటోంది. ఇందుకోసం చైనా+1 విధానంలో భాగంగా భారత్‌లో పలు ఉపకరణాలను అసెంబ్లింగ్ చేస్తోంది. గత నెలలో ఐఫోన్ 15 విడుదల యాపిల్ ఇండియా తయారీ ప్రణాళికలో ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. భారత్‌లో, అలాగే చైనాలో ఉత్పత్తి అయిన ఐఫోన్స్‌ను ఒకే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో తొలిసారిగా యాపిల్ విడుదల చేయడం ఇందుకు కారణం. సాధారణంగా భారత్‌లో యాపిల్ తాజా మోడళ్ల ఉత్పత్తి చైనా కంటే కొన్ని నెలలు వెనుకబడి ఉంటుంది. 2025 నాటికి భారత్‌లో 25 శాతం ఐఫోన్లను తయారు చేయాలని యాపిల్ లక్ష్యంగా చేసుకుంది.

జోస్ ఆలుక్కాస్ నుంచి 'ఐవి' ఆభరణాల కలెక్షన్



ముంబై: జోస్ ఆలుక్కాస్ 'ఐవి' పేరుతో కొత్త ఆభరణాల కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ముంబైలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ మోడల్ రాఫెల్లా సిక్వేరా నూతన కలెక్షన్‌ను పరిచయం చేశారు. ఉంగరాలు, గొలుసులు, నెక్లెస్‌లు, చెవిపోగులు, గాజులు ఈ ఆభరణ శ్రేణిలో ఉన్నాయి. ''మారుతున్న ట్రెండ్‌లకు అనుగుణంగా జోస్ ఆలుక్కాస్ స్థిరంగా ఆభరణాల డిజైన్లను రూపొందిస్తోంది. నేటి యువతులు కోరుకుంటున్న ప్రాధాన్యతలు, అభిరుచులకు అనుగుణంగా 'ఐవి' కలెక్షన్ తీర్చిదిద్దాము'' అని సంస్థ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమం ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కాల సమక్షంలో జరిగింది.

భీమ జ్యువెల్స్ 'సూపర్ సర్‌ప్రైజెస్' వేడుకలు



హైదరాబాద్: భీమ జువెల్స్ తన 99 వార్షికోత్సవాన్ని 'భీమ సూపర్ సర్‌ప్రైజెస్' వేడుకలతో జరుపుకుంటోంది. ఈ సందర్భంగా కస్టమర్లకు పలు ఆఫర్లు ప్రకటించింది. బంగారం ఆభరణాలపై గ్రాముకు రూ.250 వరకు, డైమండ్ జ్యువెలరీపై క్యారెట్‌కు రూ.20 వేల వరకు, ప్లాటినం ఆభరణాలపై 10%, కేజీ వెండి ఆభరణాలపై రూ.4 వేల తగ్గింపు అందిస్తోంది. కొనుగోళ్ల స్థాయిని బట్టి తక్షణ క్యాష్‌బ్యాక్, గోల్డ్, సిల్వర్ నాణేలు, గిఫ్ట్ వోచర్లు, ఇతర మరెన్నో సర్‌ప్రైజెస్ గిఫ్ట్‌లు పొందవచ్చు. రోజువారీ, బంపర్ లక్కీ డ్రాలో కేజీ బంగారు నాణేలు గెలుకోవచ్చు. ఇద్దరు వ్యక్తులు దుబాయ్, ప్యారీస్ ట్రిప్‌ను పొందే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఉండే భీమ స్టోర్లలో నవంబర్ 13 వరకు ఆఫర్లు అందుబాటులో ఉంటాయి.

క్లుప్తంగా...

47 మంది హైకోర్టు మాజీ జడ్జీలకు సీనియర్ హోదా

- జాబితాలో ఏపీ, తెలంగాణ హైకోర్టుల నుంచి ఏడుగురు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు 47 మందికి సీనియర్ హోదా ఇవ్వాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. వీరిలో 9 మంది హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులున్నారు. ఈ నెల 16న జరిగిన ఫుల్ కోర్ట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 47 మంది మాజీ న్యాయమూర్తుల్లో ఏపీ, తెలంగాణ హైకోర్టుల నుంచి ఏడుగురికి సీనియర్ హోదా లభించింది. ఏపీ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వంగల ఈశ్వరయ్య, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ రెడ్డి కాంతారావు, జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్, జస్టిస్ అనుగు సంతోశ్‌రెడ్డి, జస్టిస్ డాక్టర్ అద్దుల వెంకటేశ్వరరెడ్డి సీనియర్ హోదా పొందారు.

రుషికొండ నిర్మాణాలపై త్వరగా తీర్పు ఇవ్వండి

- హైకోర్టును కోరిన రఘురామకృష్ణరాజు
- పరిశీలిస్తామన్న సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: విశాఖ రుషికొండపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో ఇప్పటికే రిజర్వు చేసిన తీర్పును వీలైనంత త్వరగా వెలువరించాలని నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది ఉమేష్ గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఉమేష్ వినతిపై స్పందించిన ధర్మాసనం మీ అభ్యర్థనను పరిశీలిస్తామంది.

సైబర్ నేరాలకు పరిష్కారం చెబితే రూ.లక్ష

సాక్షి, హైదరాబాద్ : నాలుగో ఆల్ ఇండియా సైబర్‌థాన్-2023లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బృందానికి రూ.లక్ష బహుమతి ఇవ్వనున్నట్టు చండీగఢ్ పోలీసులు ప్రకటించారు. సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సైబర్‌థాన్‌ను ఇన్ఫోసిస్, చండీగఢ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో కళాశాల విద్యార్థుల బృందాలతోపాటు పోలీస్ బృందాలు సైతం పాల్గొనవచ్చు. దరఖాస్తులు పంపేందుకు ఈనెల 26 గడువుగా నిర్వాహకులు పేర్కొన్నారు.https://chandgarhpolice.gov.in/cyberthon.html లో సంప్రదించాలని సూచించారు.

విశాఖలో విప్రో విస్తరణ

ప్రాజెక్ట్ లావెండర్ పేరుతో అధికారికంగా ప్రకటించిన సంస్థ

- డేటా సెంటర్‌గా అభివృద్ధికి ప్రణాళికలు
- 1000 సీట్లకు విస్తరించాలని నిర్ణయం
- ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం
- వీడీఐ, క్లౌడ్ ప్రాజెక్టుల కేంద్రంగా విశాఖ బ్రాంచ్



సాక్షి, విశాఖపట్నం : ఐటీ పరిశ్రమలకు విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే పలు సంస్థలు తమ శాఖల్ని ఇక్కడ విస్తరిస్తున్నాయి. తాజాగా ఈ వరుసలో దిగ్గజ ఐటీ సంస్థ విప్రో చేరింది. విశాఖలో ఉన్న ప్రస్తుత కార్యాలయాన్ని విస్తరిస్తున్నట్టు ఆ సంస్థ 'ప్రాజెక్ట్ లావెండర్' పేరు తో ప్రకటించింది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న తమ డేటా సెంటర్లలో విశాఖ వెళ్లేందుకు ఉన్న ఉద్యోగుల వివరాల్ని ఈ మెయిల్స్ ద్వారా సేకరించే పనిలో విప్రో నిమగ్నమైంది. ఈ ఏడాది చివరి నాటికి సంస్థను 1000 సీట్లకు విస్తరించే విషయంపై ఇప్పటికే సంస్థ ప్రతినిధులతో ప్రభుత్వం, ఎపిటా జరిపిన చర్చల్లో విప్రో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా సంస్థ ప్రకటనతో విశాఖ ఐటీలో కొత్త ఉత్సాహం నెలకొంది.

ద్వితీయ శ్రేణి నగరాలపై దృష్టి

అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు ఇప్పుడు మహా నగరాల నుంచి టైర్-2 సిటీల వైపు చూస్తున్నాయి. టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్ మొదలైన ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులేస్తున్నాయి. ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తాజాగా విప్రో కూడా అదే బాటలో విశాఖలో విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడిన ఉద్యోగులు.. తిరిగి కార్యాలయాలకు వచ్చేందుకు ఆసక్తి చూపించని నేపథ్యంలో వారి వద్దకే వెళ్లేందుకు ఐటీ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తమ వ్యయాల్ని తగ్గించుకునేందుకు ద్వితీయ శ్రేణి నగరాలపై దృష్టిసారించాయి. ఇందులో భాగంగా విప్రో కూడా విశాఖలో కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చింది.

ప్రాజెక్ట్ లావెండర్ పేరుతో..

విశాఖలో కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా తమ డెవలప్‌మెంట్ సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న వారికి విప్రో సంస్థ లేఖలు రాసింది. విశాఖ కేంద్రంగా పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్న వారి వివరాలు సేకరిస్తోంది. ఈ తరుణంలో తాజాగా విశాఖలో డేటా సెంటర్ విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. వృద్ధి చెందుతున్న నగరాల్లో తమ సంస్థ డెవలప్‌మెంట్ సెంటర్‌ను విస్తరించేందుకు ప్రాజెక్ట్ లావెండర్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. ఇందులో భాగంగా తొలి అడుగు విశాఖలో వేస్తున్నట్టు విప్రో స్పష్టం చేసింది.

వైఎస్సార్ హయాంలో నాంది

సత్యం జంక్షన్‌లో వైఎస్సార్ హయాంలో 2006 మేలో విప్రో క్యాంపస్‌కు ఏడెకరాల స్థలాన్ని కేటాయించారు. అనంతరం మూడున్నరేళ్ల తర్వాత విప్రో తన కార్యకలాపాల్ని ప్రారంభించింది. 750 మందితో ప్రారంభించాలని భావించినా.. తొలుత 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. అయితే కోవిడ్ సమయంలో క్రమంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించింది. పరిస్థితులు చక్కబడటంతో మళ్లీ కార్యకలాపాల జోరు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విప్రో ప్రతినిధులతో చర్చించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ(ఎపిటా) గ్రూప్ సీఈవో కిరణ్‌రెడ్డి విప్రో ప్రతినిధి శశి కుమార్‌తో పలు దఫా లుగా చర్చలు జరిపి.. విస్తరించేందుకు ఆహ్వానించారు. దీనిపై సుముఖత వ్యక్తం చేసిన విప్రో.. కా ర్యకలాపాలు ప్రారంభించింది. దశల వారీగా 1000 సీట్లకు విస్తరించేందుకు సిద్ధమని ప్రకటించింది.

మౌలిక సదుపాయాల పనులు పూర్తి

విశాఖలో విస్తరణకు విప్రో సరికొత్త ఆలోచనలతో ముందడుగు వేస్తోంది. గత క్యాంపస్‌లో కొంత భాగం ఇప్పటికే అద్దెకు ఇచ్చిన విప్రో.. ముందు భవనంలో ఇప్పటికే సేవలు ప్రారంభించింది. ఈ భవనంలోని అన్ని ఫ్లోర్లలోనూ తమ సంస్థ మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందులో అద్దెకు ఇచ్చిన వారిని ఖాళీ చేయించారు. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ను మార్చాలని నిర్ణయించింది. ఇప్పటికే వీడీఐ ప్రాజెక్టులతో కార్యకలాపాలు ప్రారంభించారు. ఇప్పటికే 1000 మందికి సరిపడా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనుల్ని దాదాపు పూర్తి చేసింది.

మానవ వనరుల్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం



సంస్థ సేవల్ని విశాఖలో విస్తరిస్తామని ప్రభుత్వంతో విప్రో స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరి కల్లా 1000 సీట్లకు పెంచుతామని చెప్పారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు విప్రో ప్రతినిధులు హామీ ఇవ్వడం శుభపరిణామం. వైజాగ్‌లో టాలెంట్, అప్‌స్కిల్లింగ్, అనుభవజ్ఞులైన నిపుణుల్ని అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలియజేశాం. భవిష్యత్తులో ఏ క్లెయింట్ వచ్చినా.. ఇక్కడికే తీసుకురావాలని సూచించాం. దానికి కావాల్సిన మానవ వనరుల్ని అందిస్తామన్నాం. దానికి విప్రో ప్రతినిధులు కూడా అంగీకరించారు. ప్రభుత్వం తరఫు నుంచి పూర్తి సహకారంతో పాటు విప్రో ప్రాజెక్టులకు అవసరమైన రిక్రూట్‌మెంట్‌కు కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చాం.

– కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

హిందుస్థాన్ షిప్‌యార్డు కీలక ఒప్పందాలు

గ్లోబల్ మారీటైమ్ ఇండియా సమ్మిట్‌లో 4 ఎంవోయూలపై సంతకం

సాక్షి, విశాఖపట్నం: సరికొత్త ఒప్పందాలతో హిందుస్థాన్ షిప్‌యార్డు(హెచ్ఎస్ఎల్) లాభాల బాట పట్టేలా దూసుకుపోతోంది. ఇందుకోసం ముంబైలో జరుగుతున్న గ్లోబల్ మారీటైమ్ ఇండియా సమ్మిట్-2023లో నాలుగు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. గ్రీన్‌టగ్‌ల నిర్మాణంపై దృష్టిసారించిన హెచ్ఎస్ఎల్, వాటి నిర్మాణానికి సంబంధించిన ఆర్డర్లు చేజిక్కించుకుంది. అదానీ హార్బర్ సర్వీస్ సంస్థతో 70 టన్నుల బొలార్డ్‌పుల్ ఫుల్లీ ఎలక్ట్రికల్ టగ్‌ల నిర్మాణానికి సంబంధించిన ఎంవోయూ కుదుర్చుకుంది. కేంద్ర పోర్టులు, జలరవాణా మంత్రిత్వ శాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ సమక్షంలో విశాఖపట్నం పోర్టు అథారిటీతో హైబ్రిడ్ టగ్‌ల నిర్మాణానికి సంబంధించి, నేవల్ట్ సంస్థతో సోలార్ ఎలక్ట్రిక్ బోట్ల నిర్మాణం, క్లబోర్గ్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సంస్థతో ఎలక్ట్రిక్ టగ్‌ల నిర్మాణానికి అవసరమైన యాక్సల్ ఫ్లక్స్ మోటార్‌లకు సంబంధించిన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు హెచ్ఎస్ఎల్ సీఎండీ కమోడర్ హేమంత్ ఖత్రి తెలిపారు. భవిష్యత్తులో గ్రీన్‌టగ్స్ నిర్మాణంపై కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ దృష్టిసారించిన తరుణంలో... ఈ ఎంవోయూలు షిప్‌యార్డు ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎంవోయూలను ప్రదర్శిస్తున్న హెచ్ఎస్ఎల్ అధికారులు

వరుసగా మూడో ఏడాదీ వైఎస్సార్ అవార్డులు

ఏడు రంగాల్లో 27 అవార్డులను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి : ఎంతో ప్రతిష్టాత్మకమైన 'వైఎస్సార్ పురస్కారాల'ను రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాదీ ప్రకటించింది. వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులైన 27 మంది వ్యక్తులు, సంస్థలను అవార్డులతో సత్కరించనుంది. వ్యవసాయం, కళలు-సంస్కృతి, తెలుగు భాషా-సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సమాజ సేవ వంటి విభాగాల్లో 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, నాలుగు వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను అందించనుంది. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) జీవీడీ కృష్ణమోహన్ మీడియాకు ఈ అవార్డు గ్రహీతల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత సంకల్పంతో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా సామాన్యుల్లోని అసామాన్యులను గుర్తించి 'వైఎస్సార్' అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి వచ్చిన ప్రతిపాదనలను ప్రత్యేక కమిటీ వివిధ దశల్లో క్షుణ్ణంగా పరిశీలించి ఎంతో పారదర్శకంగా అవార్డులకు ఎంపిక చేసిందన్నారు. సమాజంపై తమదైన ముద్రవేసిన వారిని సముచితంగా గౌరవించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో అవార్డులను ప్రకటిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 1న ఈ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. వైఎస్సార్ పురస్కార ఎంపికల కమిటీలో తనతోపాటు ప్రభుత్వ సలహాదారులు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్ (జాతీయ మీడియా), సీఎం రాజకీయ కార్యదర్శి ముత్యాలరాజు, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన ముఖ్యకార్యదర్శులు సభ్యులుగా ఉన్నారన్నారు. ఇక వైఎస్సార్ జీవిత సాఫల్యం కింద రూ.10 లక్షలు, వైఎస్సార్ సాఫల్యం కింద రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేస్తామని జీవీడీ చెప్పారు.

అవార్డు గ్రహీతల వివరాలు..

వ్యవసాయం :

- ఎస్టీ మహిళా రైతు పంగి వినీత, ఉత్తరాంధ్ర (సాఫల్య పురస్కారం)
- రైతు వైవీ మల్లారెడ్డి, అనంతపురం జిల్లా (జీవిత సాఫల్య)

తెలుగు భాష – సాహిత్యం..

- ప్రొ. బేతవోలు రామబ్రహ్మం, పశ్చిమ గోదావరి (జీవిత సాఫల్య)
- నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు (జీవిత సాఫల్య)
- అట్టాడ అప్పలనాయుడు, శ్రీకాకుళం (జీవిత సాఫల్య)
- ఖదీర్‌బాబు, గ్రామీణ మాండలికాల్లో పల్లెటూరి రచయిత, నెల్లూరు (సాఫల్య పురస్కారం)
- మహెజబీన్, నెల్లూరు (సాఫల్య పురస్కారం)

కళలు-సంస్కృతిలో జీవిత సాఫల్య పురస్కారాలు..

- యడ్ల గోపాలరావు, రంగస్థల కళాకారుడు, శ్రీకాకుళం
- తలిసెట్టి మోహన్, శ్రీకాళహస్తి కలంకారీ కళాకారుడు, తిరుపతి
- కోట సచ్చిదానంద శాస్త్రి, హరికథ, బాపట్ల
- కోన సన్యాసి, జనపదాల్లో ప్రత్యేకత ఉన్న తప్పెట గుళ్లు, శ్రీకాకుళం
- ఉప్పాడ హ్యాండ్‌లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ, కాకినాడ
- ఎస్వీ రామారావు, అంతర్జాతీయ చిత్రకారుడు, కృష్ణా
- రావు బాలసరస్వతి, తొలితరం నేపథ్య గాయని, నెల్లూరు
- తల్లావఝుల శివాజీ, చిత్రకారుడు, రచయిత, పాత్రికేయుడు, ప్రకాశం
- చింగిచెర్ల కృష్ణారెడ్డి, జానపద కళలు, అనంతపురం
- కలీసాహెబీ మహబూబ్-షేక్ మహబూబ్ సుబానీ దంపతులు, నాదస్వరం, ప్రకాశం

క్రీడా విభాగం..

- పుల్లెల గోపీచంద్ (బ్యాడ్మింటన్), గుంటూరు (జీవిత సాఫల్య)
- కరణం మల్లీశ్వరి (వెయిట్‌లిఫ్టింగ్), శ్రీకాకుళం, (జీవిత సాఫల్య)

వైద్య రంగం..

- మానసిక వైద్య నిపుణులుగా, స్వయంగా రచనలు చేస్తూ సమాజాన్ని జాగృతం చేసిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా, (జీవిత సాఫల్య)
- స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వినికిడి లోపం కలిగిన చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్స్ వైద్య సహాయం అందిస్తున్న డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా, (జీవిత సాఫల్య)

మీడియా రంగం..

- సమాజానికి ఎంతోమంది జర్నలిస్టులను అందించిన సీనియర్ జర్నలిస్టు గోవిందరాజు చక్రధర్, కృష్ణాజిల్లా, (జీవిత సాఫల్య)
- విప్లవ సాహిత్యంతో పాటు ఆధునిక, సంస్కరణవాద కవిత్వానికి పెద్దపీట వేస్తూ వివిధ పత్రికల్లో ప్రముఖ సేవలందించిన హెచ్ఆర్కే, కర్నూలు, (జీవిత సాఫల్య)

సామాజిక సేవ..

- బెజవాడ విల్సన్, ఎన్టీఆర్ (జీవిత సాఫల్యం)
- నిర్మల హృదయ్ భవన్, ఎన్టీఆర్ (జీవిత సాఫల్యం)
- డాక్టర్ జి.సమరం, ఎన్టీఆర్ (జీవిత సాఫల్యం)
- శ్యాంమోహన్, అంబేద్కర్ కోనసీమ (సాఫల్య పురస్కారం)

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

వాటర్ క్యాన్ల వితరణ



నీళ్ల క్యాన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

గంగావతి: ధర్మస్థళ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో గురువారం కొప్పళ తాలూకా గంగావతి అసెంబ్లీ క్షేత్ర పరిధిలోని ఇందరిగి గ్రామంలో 50 మంది మహిళలకు రక్షిత నీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డాక్టర్ అమరప్ప మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ప్రధానంగా మహిళల ఆర్థిక అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. మహిళలకు సొంత కాళ్లపై నిలబడేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తమ సంఘం ద్వారా అందజేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో మహిళలు తమ సంఘం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేత ఇంట్లో ఈడీ సోదాలు

సాక్షి,బళ్లారి: ఐటీ దాడుల్లో కాంగ్రెస్ నేతల ఇళ్లల్లో రూ.కోట్లాది నోట్ల కట్టలు బయట పడుతున్న నేపథ్యంలో గురువారం ఈడీ కూడా రంగప్రవేశం చేసింది. కలబుర్గి జిల్లా చించోళి తాలూకా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాబూరావ్ పాటిల్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. చందాపుర బసవనగరలోని ఆయన ఇంట్లో హైదరాబాద్ నుంచి విచ్చేసిన ఈడీ అధికారులు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు కలబుర్గి జిల్లాలో కలకలం సృష్టించాయి.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి రూరల్ : కొప్పళలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్యే కె.రాఘవేంద్ర హిట్నాల్‌ను కర్ణాటక ప్రదేశ కురుబ సంఘం నూతన సహ కార్యదర్శి రమేష్ గిరణి కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కురుబ సమాజం నాయకులు బసవరాజ్ బెలవాడగి, సోమణ్ణ ముళ్లూరు, బాలప్ప గురికార్‌తో పాటు సమాజ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి రూపాల్లో తృప్తి

- ఇళకల్ చీరల రాయబారిచే దేవి రూపాల ప్రదర్శన



దేవి రూపాల్లో తృప్తి సాలిమఠ

రాయచూరు రూరల్: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దేవి రూపాల్లో తృప్తి సాలిమఠ కనిపించారు. బాగల్‌కోటె జిల్లా ఇళకల్‌లో తృప్తి సాలిమఠ చీరల ప్రదర్శనకు రాయబారిగా విధులు నిర్వహిస్తూ తొమ్మిది రోజుల పాటు శక్తి దేవతల ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకుంది. తొమ్మిది మంది దేవతల రూపాలను ధరించి ఆదిపరాశక్తి, శాంభవి, అంబా భవాని, దుర్గ, కాళికా, చాముండి, ఇతర శక్తిదేవతల రూపాలను ధరించారు. తెలుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ, పసుపు పచ్చ, బూడిద, కేసరి, గులాబీ, నేరేడు రంగు చీరలు ధరించి అందరినీ అలరించింది.

లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేద్దాం

- మంత్రి నాగేంద్ర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర తదితర కాంగ్రెస్ నేతలు

బళ్లారిఅర్బన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసి కట్టుగా పని చేయాలని మంత్రి నాగేంద్ర పిలుపునిచ్చారు. ఆయన గురువారం స్థానిక హొసపేటె రోడ్డులోని గురు ఫంక్షన్ హాల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీడర్ షిప్ మిషన్ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ డివిజనల్ నేషనల్ కో–ఆర్డినేటర్ టీడబ్ల్యూసీ కే.రాజు, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల కోసం నాయకత్వ వికాస సదస్సు ద్వారా లోక్‌సభ ఎన్నికల బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఎన్ని అడంకులు వచ్చినా నాయకత్వ లక్ష్యంతో ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపారన్నారు. పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసికట్టుగా గెలుపు కోసం కృషి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు నాసీర్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు అల్లం వీరభద్రప్ప, అల్లం ప్రశాంత్, మహమ్మద్ అయాజ్, కందుకూరి రాముడు, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కట్టడికి వినూత్న వ్యూహాలు

- ఎక్కడబడితే అక్కడ వాహనాలు ఆపకుండా చర్యలు
- చిన్న పిల్లలు బైక్‌లు నడిపితే ఇకపై జరిమానా వసూలు
- గత కొన్ని రోజుల నుంచి రూ.52 వేలకు పైగా వసూళ్లు



భారీ శబ్దం కల్గించే బైకల పొగగొట్టాలను తొలగింపజేస్తున్న ట్రాఫిక్ పోలీస్



ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

సాక్షి,బళ్లారి: నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పాటు వాహనాలను ఎక్కడబడితే అక్కడ ఆపేసి వెళ్లిపోతుండటంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారి సూచనలతో ట్రాఫిక్ సీఐ అమరేగౌడ పాటిల్ ట్రాఫిక్ నియంత్రణకు సరికొత్త చర్యలు చేపడుతూ సత్ఫలితాలను సాధిస్తున్నారు. సాధారణంగా ట్రాఫిక్ పోలీసుల చేతిలో విజిల్ ఉండేది. ప్రస్తుతం పలువురు ట్రాఫిక్ పోలీసుల చేతికి విజిల్‌కు బదులుగా మైక్‌లు ఇస్తూ ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నారు. నగరంలో ప్రధాన వీధులైన రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు, మోతీ సర్కిల్, ఎస్పీ సర్కిల్, మీనాక్షి సర్కిల్ తదితర ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను పలువురు ఎక్కడబడితే అక్కడ ఆపి ట్రాఫిక్ సమస్యను సృష్టించేవారు. పోలీసులు విజిల్ వేసే లోపు సదరు వాహన యజమాని దూరం వెళ్లిపోయేవారు. ఇక అలా జరగకుండా దూరం నుంచి గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు మైక్ ద్వారా వాహనం రోడ్డు మీద వదలవద్దు అంటూ గట్టిగా మైక్‌లో హెచ్చరిస్తుండటంతో జనంలో భయం పుట్టి వాహనాలను రోడ్లలో వదలకుండా దూరంగా వదిలేందుకు ప్రయత్నిస్తున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

అలాగే ఇటీవల 18 ఏళ్ల లోపు వయస్సు బాలురు, బాలికలు కూడా ద్విచక్ర వాహనాలు నడుపుకుంటూ నగరంలో తిరుగుతుండటం పెరిగిపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల నుంచి చిన్న వయస్సు ఉన్న వారు వాహనాలు నడిపితే వాహన యజమానులకు నోటీసులు జారీ చేసి, సీజ్ చేసి ఫైన్ వేస్తున్నారు. రెండు రోజుల నుంచి దాదాపు రూ.55 వేల జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. ఇంకా పలువురు యజమానులకు నోటీసులు జారీ చేశామని, జరిమానా విధించి వాహనాలు వదులుతామన్నారు. అలాగే ప్రజలను ఇబ్బంది పెట్టేలా శబ్దం కలిగించే పొగగొట్టాలు కలిగిన ద్విచక్ర వాహనాలను కూడా గుర్తించి సీజ్ చేస్తున్నామన్నారు.

ఏడు గంటల విద్యుత్ ఇవ్వండి



వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభాకర్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో రైతులకు ఏడు గంటల విద్యుత్‌ను అందజేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్ డిమాండ్ చేశారు. గురువారం జెస్కాం కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. రైతులకు ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి సూచనలివ్వాలన్నారు. రెండు మూడు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. రైతులు భూముల్లో వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరుతూ చీఫ్ ఇంజినీర్ వెంకటేష్ దేశాయికి వినతిపత్రం సమర్పించారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని జై కన్నడ రక్షణా వేదిక డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు శరణప్ప మాట్లాడారు. ఆశాపూర్ రహదారిలోని బుడ్డి బాబా దర్గా వద్ద నివాసమున్న పేదలకు సర్వే నంబర్–1458లో పట్టాలు పంపిణీ చేసి వారి నివాసాలకు అవకాశం కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కిమ్స్‌లో ఔషధాల కోసం రోగుల పాట్లు

హుబ్లీ: ఉత్తర కర్ణాటకలోని వివిధ జిల్లాల ఆరోగ్య ప్రదాయిని కిమ్స్ ఆస్పత్రిలో ఔషధాల కోసం రోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఉన్న కౌంటర్లలో రోగులకు అనుకూలంగా మందులు పంపిణీ జరగడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో శుక్రవారం కౌంటర్ల ముందు పేద రోగులు, వారి సహాయకులు బారులు తీరి ఉండటం కనిపించింది. సంబంధిత వైద్యులు రాసిచ్చిన మందుల చీటి పట్టుకొని రెండు గంటల పాటు క్యూలో నిలబడటం రోగులకు కష్టతరంగా మారింది. జనం రద్దీతో కూడి ఉండటంతో వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని క్యూలలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని దళిత విమోచన సమితి నేత శ్రీధర్ కందగల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన సంబంధిత వైద్యాధికారులను కోరారు. కాగా ఈ విషయమై కిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ కిమ్స్‌లో ఔషధాలు, సిబ్బంది కొరత లేదు. అయినా నానాటికీ వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. గదగ్, హావేరి, కొప్పళ, బాగలకోటె తదితర జిల్లాల నుంచి రోగులు కిమ్స్‌కు వస్తున్నారన్నారు. ఇందు కోసం 8 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. నిత్యం ప్రతి కౌంటర్లలో 500 కేసులు నమోదు అవుతున్నాయన్నారు. ప్రతి రోజూ 4 వేల మంది బయటి రోగులు(ఓపీ) చీటీలు నమోదు అవుతున్నాయన్నారు. ఎక్కువగా రోగులు రావడం వల్ల ఈ సమస్య ఏర్పడుతోందని, దీనిపై దృష్టి సారిస్తామన్నారు.

యథేచ్ఛగా జల-చౌర్యం

- తుంగభద్ర ఎడమ కాలువకు అక్రమ నీటి పైపులు
- చివరి ఆయకట్టు భూములకు అందని సాగునీరు



జలచౌర్యానికి వీలుగా కాలువకు వేసిన అక్రమ పైపులు



నీటి కోసం కాలువపై రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ కింద 55వ డిస్ట్రిబ్యూటరీ ఆయకట్టు చివరి భూములకు నీరందక పోవడానికి పైభాగంలో కాలువకు నేరుగా అక్రమంగా పైపులు వేసుకొని నీటిని చౌర్యం చేస్తుండడమే కారణం. గురువారం జిల్లాలోని మస్కి తాలూకా రహమత్నాళ వద్ద రైతులు వేసుకున్న నీటి పైపులను తొలగించడానికి వెళ్లిన అధికారులు, ఇంజినీర్లను రైతులు అడ్డుకున్నారు. 89, 90, 92, 93, 94, 95వ మైలు డిస్ట్రిబ్యూటరీల వద్ద నీటి గేజ్‌ను సక్రమంగా చేపట్టడానికి వెళ్లిన ఇంజినీర్లను రైతులు అడ్డుకొని పైపులు తొలగించరాదంటూ అడ్డుపడ్డారు. దీంతో పోలీస్, రెవిన్యూ, నీటిపారుదల, జెస్కాం అధికారులకు చుక్కెదురైంది. తుంగభద్ర ఎడమ కాలువపై వడ్డరహట్టి డివిజన్‌లో రైతులు ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో కొప్పళ జిల్లాలో యథేచ్ఛగా, అక్రమంగా నీటిని వాడుకుంటుడడంతో రాయచూరు జిల్లాలో చివరి ఆయకట్టు భూములకు నీరందడం గగనమైంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సింధనూరు దాటి కనకగిరి, కారటగి ప్రాంతాలకు వెళ్లి నీటి నిర్వహణ విషయంపై చర్చించిన సందర్భాలు లేవు. దీంతో రాయచూరు జిల్లాలో తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించడం కష్టసాధ్యంగా మారింది. రాయచూరు, కొప్పళ జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాధికారులు, ఎస్పీలు, నీటిపారుదల శాఖాధికారులు సమావేశమై సమస్యలను పరిష్కరించడానికి తగిన మార్గాలను అనుసరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఎలుగుబంట్ల సంచారంతో హడల్



సీసీ టీవీ ఫుటేజీలో నమోదైన నగర వీధిలో ఎలుగుబంటి సంచారం

హొసపేటె: జిల్లాలోని ప్రధాన పర్యాటక కేంద్రమైన తుంగభద్ర డ్యాంలో గత రెండు రోజుల నుంచి ఎలుగుబంట్ల బెడద మొదలైంది. తెల్లవారు జామున కూడా జాంబవ ప్రత్యక్షమై భద్రతా సిబ్బందిలో ఆందోళన రేకెత్తించింది. తుంగభద్ర డ్యాం వైకుంఠ అతిథిగృహం, ఎస్‌డీఓ కార్యాలయం, ఉద్యానవన ప్రాంతానికి వెళ్లే మార్గంలో వరుసగా రెండు రోజులుగా అర్ధరాత్రి ఎలుగుబంటి సంచరిస్తోంది. బుధవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో డ్యాం ప్రధాన ద్వారం నుంచి వైకుంఠ అతిథిగృహానికి వెళ్లే మార్గంలో ఎలుగుబంటి కనిపించింది. దీంతో కుక్కలు పెద్దగా అరవడం ప్రారంభించాయి. విధుల్లో ఉన్న కేఎస్‌ఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్, ఎస్‌ఐఎస్ సెక్యూరిటీ సిబ్బంది ఎలుగుబంటిని గమనించారు. అది తమ వైపు వస్తూ ఉండటం చూసి పరుగెత్తారు. కాసేపటి తర్వాత ఎలుగుబంటి దాడి నుంచి తప్పించుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలో మెయిన్ గేటు నుంచి పెట్రోలింగ్ చేస్తున్న ఏఎస్సై లక్ష్మణ ఎదురుగా రావడంతో క్షణాల్లో బైక్ తిప్పి వెనుదిరిగాడు. ఇది గురువారం ఉదయం పార్కు సమీపంలో కనిపించింది. ఈ నేపథ్యంలో తుంగభద్ర డ్యాంలో ఎలుగుబంటి బెడద నివారించాలని అటవీ శాఖకు వినతిపత్రం అందించినట్లు తెలిసింది.

మహంకాళి భక్తులకు గట్టి భద్రత

ఇక్కడ టీబీ డ్యాం రెసిడెన్షియల్ హోం, వంకాయ క్యాంప్, పీఎల్‌సీ నుంచి వందలాది మంది మహిళలు నవరాత్రి సందర్భంగా సూర్యోదయానికి ముందు టీబీ డ్యాం లోపలి ప్రాంగణంలోని మహంకాళి దేవిని దర్శించుకోవడానికి వస్తారు. ఇప్పుడు ఎలుగుబంట్ల బెడద నేపథ్యంలో డ్యాం వద్ద మహంకాళి భక్తులకు కూడా భద్రత కల్పిస్తున్నారు. 10–15 మంది మహిళలు ఉన్న ప్రతి సమూహానికి ఒకరు లేదా ఇద్దరు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందిని వారి వెనుక భద్రతగా పంపుతున్నారు.

ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.రూ.2.64 లక్షల నగదు,మొబైళ్లు సీజ్

హుబ్లీ: క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన సీసీబీ పోలీసులు వారి నుంచి రూ.2.64 లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని భవానీ నగరకు చెందిన నవీన్ గణపతి జిటోరి, శాంతినగరకు చెందిన మహమ్మద్ యరగట్టి, వికాస్ నగరకు చెందిన పవన ఇరకల్ నిందితులు. ఈ ముగ్గురు నగరంలోని దాసప్ప సర్కిల్ దగ్గర ప్రపంచ కప్ క్రికెట్ వేళ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2.39 లక్షల నగదు, రూ.25 వేల విలువ చేసే వివిధ కంపెనీల మొబైల్‌లు మొత్తం కలిపి రూ.2.64 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కమరిపేటె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా జంట నగరాల్లో ఎటువంటి జూదాలను, ఇతర అక్రమ కార్యకలాపాలను ఉక్కు పాదంతో అణిచి వేస్తామని జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ తెలిపారు.

పథకాలపై ప్రచారానికి కళా బృందాల ఎంపిక



కళా ప్రదర్శననిస్తున్న బృందం సభ్యులు



ఎంపిక నిర్ణయం తీసుకుంటున్న అధికారులు

హొసపేటె: ప్రభుత్వ వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విజయనగర జిల్లా వార్తా పౌరసంబంధాల శాఖ ద్వారా కళా బృందాలను ఎంపిక చేసినట్లు సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ధనంజయప్ప తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పథకాలు, సౌకర్యాలు సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజలకు కూడా చేరేలా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. వార్తా, పౌర సంబంధాల శాఖ వివిధ మాధ్యమాల ద్వారా, వీధి నాటకాలు, జానపద సంగీతం, ప్రచార గీతాల ద్వారా ప్రచారం చేస్తుంది. ఈ లక్ష్యంతో విజయనగర జిల్లాలో వివిధ కళా బృందాల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 3 వీధి నాటక బృందాలు, 3 జానపద సంగీత బృందాలను ఎంపిక చేసేందుకు వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎంపిక ప్రదర్శనను ఏర్పాటు చేసింది. కమిటీ ఎంపికైన కళా బృందాలు విజయనగర జిల్లా హరపనహళ్లి, హడగలి, హగరిబొమ్మనహళ్లి తాలూకాల్లోని కొన్ని గ్రామాల్లో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వ వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా కన్నడ, సంస్కృతిక శాఖ సహాయక సంచాలకులు సిద్దలింగస్వామి, ఆరోగ్య విద్యాశాఖాధికారి పీ.సత్యనారాయణ, వర్కింగ్ జర్నలిస్టు సంఘం కళా బృందాలు పాల్గొన్నారు.

జనతా దర్శన్‌తో ప్రజల వద్దకు పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి: ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లే కార్యక్రమాన్ని నగరంలో ప్రప్రథమంగా ప్రారంభించామని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం నగరసభ కార్యాలయం ఆవరణలో జనతా దర్శన్ కార్యక్రమాన్ని జిల్లాధికారితో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. తాలూకాలోని ప్రతి డివిజన్‌లో 15 రోజులకు ఒకసారి జనతా దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పిస్తే ఆయా శాఖల అధికారులు వెంటనే వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపుతారన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటల నుంచి తమ సమస్యలపై జిల్లాధికారి నలీన్ అతుల్ అర్జీలను స్వీకరించడం శ్లాఘనీయం అని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొత్తం 372 అర్జీలను ప్రజలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యశోద, అదనపు జిల్లాధికారి సావిత్రి కడే, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నం పాండే తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పేదల వెంపర్లాట



ప్రభుత్వ స్థలంలో హద్దులను గుర్తిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: గూడు లేని పేదలు ఇళ్ల స్థలాల కోసం వెంపర్లాడిన ఘటన బుధవారం నగరంలోని చంద్రబండ రోడ్డులోని పాత ఆశ్రయ కాలనీలో చోటు చేసుకుంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకోవడానికి కార్మికులు, పేదలు మూకుమ్మడిగా పరుగులు తీశారు. మాజీ నగరసభ సభ్యులు, ప్రజా ప్రతినిధులు మౌఖికంగా గుడిసెలు వేసుకోమని చెప్పడంతో పాత ఆశ్రయ కాలనీలో వందలాది మంది కట్టెలు పాతడానికి, కంచెలు వేయడానికి ముందుకు వచ్చారు. తమకు ఇళ్లు కావాలని నాలుగేళ్ల క్రితం ప్రజలు దరఖాస్తు చేసుకున్నా నగరసభ అధికారులు అప్పట్లో మౌనం దాల్చారు. హమాలీలు, మాజీ నగర సభ సభ్యులు డబ్బులు తీసుకొని ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి, గుడిసెలు వేసుకోవడానికి అనుమతిచ్చారనే ఆరోపణలున్నాయి. ఇదే అదునుగా భావించి ప్రజలు ప్రభుత్వ స్థలంలో హద్దులను ఏర్పరచుకోడానికి ముందుకు రావడంతో నగరసభ అధికారులు, పోలీసులు అవాక్కయ్యారు.

అభివృద్ధికి అందరి సహకారం అవసరం

కోలారు: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అందరి సహకారం అవసరమని జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పీడీఓలు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల సన్మాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను సద్వినియోగం చేయడం ద్వారా గ్రామాభివృద్ధి చేయాలనేది ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీజీపీ ప్రణబ్ మొహంతి మాట్లాడుతూ జీపీలు అభివృద్ధి చెందితే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందినట్లేనన్నారు. గ్రామాభివృద్ధిపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ అక్రం పాషా పాల్గొన్నారు.



బెంకి మారెమ్మకు ముత్యాల అలంకరణ



నగరేశ్వరికి బాలాత్రిపుర సుందరి అలంకరణ



కన్యకా పరమేశ్వరి దేవికి అద్దాల మంటపం



వాసవీ మంటపంలో సరస్వతి దేవి అలంకరణ



ప్రత్యేక అలంకరణలో కాళికా దేవి



మమదాపురలో మారి కాంబకు అలంకరణ

బహుముఖ రూపిణి..శక్తి ప్రదాయిని

- నేత్రపర్వంగా అమ్మవారి అలంకరణలు
- ఆలయాల్లో బారులు తీరుతున్న భక్తులు



సీతారామ ఆశ్రమంలో గాయత్రిదేవి అలంకరణ



సంతోషిమాత ఆలయంలో విశేష అలంకరణ



చిన్నమార్కెట్ శాంభవిదేవికి సరస్వతిదేవి అలంకరణ

బళ్లారి అర్బన్: విజయదశమి సందర్భంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ఐదో రోజు గురువారం సాయంత్రం స్థానిక అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలతో పాటు అమ్మవార్లకు వివిధ రూపాల్లో అలంకరణలు గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ధార్మిక పూజలతో పాటు పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తి గీతాలను ఆలపించారు.

రాయచూరు రూరల్: జిల్లాలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని కోటలో కాళికా దేవి ఆలయంలో దేవిని పల్లకీలో ఊరేగించారు. కందగడ్డ మారెమ్మకు అలంకరణ, మమదాపురలో మారికాంబను, మాన్వి తాలూకా కల్లూరులో మహాలక్ష్మి దేవిని ఘనంగా అలంకరించారు. ఉప్పారవాడి లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో సింహ వాహనంలో స్వామివారిని ఊరేగించారు.

అమ్మవార్లకు విశేష పూజలు

గంగావతి: శరన్నవరాత్రుల ఐదో రోజున అమ్మవారి ఆలయాల్లో వివిధ రకాల అలంకరణలతో పూజలను ఘనంగా నెరవేర్చారు. మేగోటె దుర్గాదేవి ఆలయంలో అర్చకులు బ్రహ్మానంద స్వామి అమ్మవారికి పలు రకాల అభిషేకాలు, కుంకుమార్చన, మహామంగళారతి, హోమాలను జరిపారు. పంపాసరోవర్‌లో విజయలక్ష్మీ దేవిని బంగారుతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం దేవదాయ శాఖకు చెందినందున రెవెన్యూ శాఖ అధికారులు పూజలను, విశేష అలంకరణలను చేపట్టారు. ముత్తైదువులైన మహిళలతో కుంకుమార్చనను ప్రత్యేకంగా చేపట్టారు. నగరంలోని శంకరమఠంలో శారదాంబిక దేవి విశేష అలంకరణలు చేశారు. కొప్పళకు చెందిన మహిళా బృందం అమ్మవారి సన్నిధికి చేరుకొని ఆమె దర్శనాన్ని అందుకున్న అనంతరం కొన్ని గంటల పాటు భజనలను నిర్వహించారు.



అమ్మవార్లకు విశేషంగా అలంకరించిన దృశ్యాలు



అమ్మవారి ఆలయాల్లో భజన, భక్తిగీతాలు



సింహవాహనంలో వేంకటేశ్వర స్వామి ఊరేగింపు